UNIVERSAL LIBRARY
OU_204619
UNIVERSAL LIBRARY

# ఆంధ్ర కాదంబరి

## పూర్వార్ధము


గ్రంథకర్త

పళ్ళె పూర్ణప్రజ్ఞాచార్యులు

గర్తపురోన్నతపాఠశాలా

ప్రధాన సంస్కృతోపాధ్యాయులు.



ఇయ్యది

గుంటూరులోని సుప్రసిద్ధ న్యాయవాదులగు

శ్రీయుత ఏకా దండయ్యపంతులుగారి

పరిపూర్ణ ద్రవ్యసాహాయ్యమున

బెజవాడ

వాణీ ముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడినది.

1931



కాపీరైట్ రిజర్వుడ్ ]


[ వెల రు 1-4-0.

# ఆశీస్సు

(కృతిసమర్పణ సభాంతమున శ్రీకృతిపతులును సభాధ్యక్షులు నొసర్చిన యాశీస్సులు.)

శా॥ పూర్ణప్రజ్ఞుఁడవౌదు నీవనుచుఁ గాబోలీ్నకు మీయయ్య
మ్మర్, "పూర్ణప్రజ్ఞ" యటంచు నామకరణంబుం జేసె,
మైత్రికృతలోఁ, బూర్ణప్రజ్ఞుఁడవైతి మా హృదయ
మామోదంబునుఁజెందె నో, పూర్ణప్రజ్ఞుఁడ! నీకుఁ
జేకుఱుత సంపూర్ణాయురారోగ్యముల్.

క॥ కాదంబ్రుడు కృతులు పేయము
కాదంబరి, దానిఁగొల్చు ఘనులు నిపుడు మే
లాకాదంబ్రుడు వత్స! నా కా
కాదంబరి మెడకు నంటఁగట్టితి వౌరా.

సీ॥ శబరి యెంగిలిపండ్లు చవిగొన్న శ్రీరామ
చంద్రుఁడే మపకీర్తిసాంద్రుఁడాయెఁ
గుబ్జాకృతిని గోరుకొన్న శ్రీరుక్మిణీ
విభుఁడేమి ప్రేలు వంపించుకొనియెఁ
గుమ్మరిమట్టిపూ ల్గొన్న మాకొండవెం
కన్నకేమి కళంక మంటుకొనియె
వ్యాధుఁడిచ్చినమాంస మంది యానందించు
సింగప్పకీర్తి కేచేటు గలిగెఁ

గీ॥ గాన భక్త్యర్పితంబెల్ల గ్రాహ్యతమమె
యనుచు శిష్యవతంసభక్త్యర్పితాంధ్ర
లలితగీర్వాణవాణీవిలాసవతిని
కృతిని గైకొన్న నే నతికృతిని గానె.

సీ॥ కాదంబరీరసాస్వాదంబు లేకున్నఁ
కవియౌనె వాఁడు కాకవియెగాని
కాదంబరీరసామోదహీనుఁడు పండి
తుం డౌనె యొకబండితుండెగాని
కాదంబరిని గ్రోలక సురోక్తి బలరాముఁ
డౌనె సాపాత్రాముఁ డౌనుగాని
కాదంబరీసేవ గల్గక యక్షరా
స్యుం డౌనె జననిరస్యుండెగాని

గీ॥ కానఁ గాదంబరీకృతిఁ గాంచు టెంతొ
కవికిఁ గృతిభర్తకును గీర్తికర మటంచుఁ
దలఁచి శిష్యార్పితాంధ్ర కాదంబరీను
కృతికిఁ బతినౌట కంగీకరించినాఁడ.

అవధాని శిరోమణి కాశీ కృష్ణాచార్యులు,
కృతిపతులు.

---

శా॥ పూర్ణప్రజ్ఞుఁడు మున్ను బాణుఁడు జగత్పూజ్యప్రభావుండు
వి,ద్యార్ణోరాశి రచించెఁ గావ్యమును గద్యస్ఫూర్తి నీనాఁ
డు మా, పూర్ణప్రజ్ఞుఁడు పద్యకావ్యముగ నింపుల్ మీఱఁ

గా మార్చి వి,ద్యార్ణోరాశికిఁ గృష్ణతీర్థునకుఁ దానర్పించె
భక్త్యున్నతిన్.

ఉ॥ మామకుఁ గన్య నిచ్చితివి మామకు మామవునైతి వెంత
యున్, నీమహనీయచేష్టితము నేఁ గడుమెచ్చితిఁగాని వృ
ద్ధుఁడై, నేమములందు బ్రుంగుకవి నేతకుఁ గన్య నొసంగి
నాఁడ వీ, ధీమహితాత్ముఁ డెక్కుడగుతేజము నాయువు
నందుఁ గావుతన్.

క॥ కాదంబరీప్రియత సం
పాదించిరి పెద్ద లొక్క బలరామునకే
కాదంబరీప్రియత సం
పాదించెను గృష్ణునకును మన పూర్ణుఁ డహో.

క॥ జామాతకు మధుపర్కము
మామ యొసఁగునపుడు మున్ను మాంసము ముఖ్యం
బై మలసె నిపుడు తత్సఖి
నీ మన పూర్ణకవి యొసఁగె నేనియుఁ దోసఁగే.

గీ॥ ఇట్టి యుల్లేఖములకేమి కృతికృతీశ
కృతిరచయితల కాయురభీష్ట భాగ్య
భోగ్యములు గల్గఁజేయ నాభోగిశయనుఁ
గడఁగి ప్రార్థించి దీని నింక విరమింతు.

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి,
శతావధాని,
కృతిసభాధ్యక్షులు.

ఓమ్

శ్రీ హయగ్రీవాయ నమః.

# ఉపోద్ఘాతము.

---

శ్లో॥ జయంతి తే సుకృతినో । రససిద్ధాః కవీశ్వరాః ।
నాస్తి తేషాం యశఃకాయే । జరామరణజం భయమ్॥

భాషాప్రపంచమున బాణభట్టారకుని నెఱుంగనివా రుండరు. ఈ విద్వన్మణి బ్రాహ్మణుఁడును వాత్స్యాయనాన్వయ సంజాతుఁడును సాంగవేదవిదుఁడును శాస్త్రనిష్ణాతుండు నైన స్వేతత్కృత హర్షచరిత్రమువలనఁ దెలియవచ్చెడిని. ఈ మహానుభావుఁడు క్రీ॥7వ శతాబ్దంబుపూర్వభాగమందు శ్రీహర్ష చక్రవర్తి యాస్థానకవియై యున్నట్లు చరిత్రపరిశోధకుల యాశయము. ఇతనికిఁ బాండిత్యమునందేగాక కవిత్వమునందును ననన్యసామాన్య ప్రజ్ఞావిశేషంబు కలదనుటకు

శ్లో॥ శ్లేషే కేచన శబ్దగుంఫవిషయే కేచి ద్రసే చాపరేఽ
లంకారే కతిచి త్సదర్థవిషయే చాన్యే కథావర్ణనే ।
ఆః సర్వత్ర గభీరధీరకవితావింధ్యాటవీచాతురీ
సంచారీ కవికుంభికుంభభిదురో బాణస్తు పంచాననః॥

అను సూక్తియే ప్రబలప్రమాణము. ఈ మహాకవి తన పూర్వవయస్సునఁ జండీశతక పార్వతీపరిణయంబుల

రచించి యుత్తరవయస్సున "బాణోచ్ఛిష్ట మిదం జగ త్తను నాభాణకంబునకు గుఱియై "కాదంబరీ రసజ్ఞానా మాహారోపి నరోచతే" యను ప్రశంసకుఁ బాత్రమై గద్య కావ్యంబులలో నిట్టిది "నభూతో నభవిష్యతి" యని ప్రసిద్ధి వహించిన కాదంబరీ పూర్వభాగంబును రచించెను. ఇప్పుడు నే రచించిన యీ 'యాంధ్రకాదంబరి' శ్రీ బాణకృత కాదంబరి కాంధ్రీకరణంబు.

నే నీయాంధ్రీకరణంబునఁ బాటించిన నియమములు ప్రథమాశ్వాస పీఠికలోని

మ॥ సమతాపోషణదృష్టి యౌచితియు మించ న్గొన్నిచోట్లఁగ
నవీ, నములఁ జేర్చితిఁ గొన్నిచోటులఁ గథానందాను
భూతిత్వరా, సమువేతాత్మత వర్ణనల్ విడిచితిఁ శబ్దాది
సంశుద్ధికిఁ, బ్రమితంబుల్ సుకవిత్రయీతదితర ప్రౌఢోక్తి
సందర్భముల్.

అను పద్యంబునఁ గొంతవఱకుఁ దెలిపియున్నాను.

నే నీ పొత్తమును రచించి దాదాపు తొమ్మిదివత్సరము లాయెను. అప్పటికి మా స్కూలు (గుంటూరు టౌన్ హైస్కూల్) నందుసంస్కృతప్రధానోపాధ్యాయులుగానున్న మద్గురువరేణ్యులగు కాశీ కృష్ణాచార్యులవారిచేబాలురభాషాభివృద్ధికై మాపాఠశాలయందే నెలకొల్పఁబడిన మాతృభాషా సమాజమునకుఁ జైత్ర శుద్ధ నవమినాఁడు శ్రీరామకళ్యాణముతోఁబాటు మహావైభవముగా వార్షికోత్సవముజరుగుచుండెడిది. అందు శ్రీ ఆచార్యులవారి సెలవు ప్రకారము నేను

మూఁడువత్సరము లవధాన మొనర్చితిని. అవధానములు ప్రేక్షకులకుఁ దాత్కాలికానందజనకము లయినను భాషా ప్రపంచమున స్థిరస్థాయులు కామింజేసి యాపై వార్షికోత్సవమునకు 'శ్రీ రామకళ్యాణ'మను కావ్య మొండు రచించి శ్రీరాముని కంకిత మొనర్చి యందుఁబఠించితిని. ఆపై వత్సరమున కస్మద్గురువులగు మధ్వశ్రీ కాశీ కృష్ణాచార్యులు గారి కంకిత మొసంగఁదలంచి కించిదూనముగా నీ యాంధ్ర కాదంబరిని విరచించితిని. కాని మద్గురువు లప్పటికిఁ బాఠశాలనుండివిశ్రాంతిఁగైకొనుటచే సమాజవార్షికోత్సవములు జరుగమింజేసి నాకోర్కి వెంటనే కొనసాగినదికాదు.

ఇటీవల నేను మత్కృతగ్రంథంబుల నన్నింటిని శుద్ధప్రతులఁ జేయుచుఁ గాదంబరికిఁ గల యాకొఱంతఁ దీర్పనొక సభ గావించి యం దీకావ్యము గుర్వంకితముసేయు తలంపుతో నుదారులును భాషాభిమానులును నగు మహారాజరాజశ్రీ రావుసాహెబు జూలూరి వెంకటరత్నముపంతులు గారితో హెచ్చరింప వారు వెంటనే యీ కృతిసమర్పణ సభను నే నేర్పాటుగావించెదనని వాగ్దాన మొనర్చి శ్రీ కింకవీంద్రఘటాపంచానన నేత్యాదిబిరుదాఢ్యులగు బ్రహ్మశ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి శతావధానిగారి నధ్యక్షులుగాఁబిలిపించి కృతిపతులగు నస్మద్గురువర్యులను సగౌరవముగా రప్పించి ప్రజోత్పత్తిసం॥ చైత్ర॥ శు॥ దశమినాఁడు గుంటూరు టౌన్ హైస్కూలునందేయాకృతిసమర్పణ మహోత్సవసభను జయప్రదముగా జరిపించిరి. ఇట్టి విద్వత్ప్రకాండుల సన్నిధిని పౌరజనసమక్షమునందు మద్గురువర్యులకు 'నాంధ్రకాదంబరి'

సంకితముచేయు మహాభాగ్యము నాకుఁగల్గించినందులకు శ్రీ పంతులుగారి కనేకవందనశతంబు లర్పించుచున్నాను.

క॥ రత్నము సంఘాతయు బుధ
రత్నము కృతిభర్త సుకవిరత్నము విద్వ
ద్రత్నము సంసన్నేత య
యత్నత బహురత్నయోగ మబ్బెన్ నాకున్॥

ఈయుదారులవలన నెగదా నాకీబహురత్నయోగమబ్బినది.

మఱియు నాయందవ్యాజానురాగముచే నేను గోరక మునుపే యీ సభాసన్నివేశమునకుఁ గావలసిన యేర్పాటులన్నియుఁ గావించి నా కెంతయుఁ దోడ్పడిన యస్మత్పాఠశాలాప్రధానోపాధ్యాయులును భాషాభిమానులును మత్కవితాప్రోత్సాహకులును నగు మహారాజరాజశ్రీ బుద్ధిరాజు రామచంద్రరావుగారికిని, నా కీసభాప్రయత్నంబున మొదటినుండియు సహాయులైన యస్మత్పాఠశాలా ప్రధానాంధ్రోపాధ్యాయులును, ఉభయభాషావిశారదులును, కవులునగు బ్రహ్మశ్రీ శిష్ట్లా హనుమచ్ఛాస్త్రిగారికిని నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఏతద్గ్రంథముద్రణమునకుఁగారణభూతుండును మచ్ఛ్రేయోభిలాషియు నగునొకమహాపురుషునింగూర్చి ముచ్చటించుట యయ్యుదారున కసమ్మతమైనను మత్కృతజ్ఞతాలవప్రదర్శనమున కావశ్యకమగుటచే నొకింత ముచ్చటింతు.

జాగైనను కృతిసమర్పణమహాసభ జయప్రదముగా జరిగినందులకు నే సంతసించుచుండ నొకనాఁ డుదయమున,

సీ॥ ‘*నిండుమనంబు’లో నెగడు ద్విజాతి ల
క్షణమునకుఁ నిదర్శన మెవండు
ఎవ్వాని వినుతింతు రెల్లవారును బట్టు
దల భగీరథుఁ దలఁదన్ను ననుచు
ఎవనితో భాషించు నెడఁ గుమార్గులును స
న్మార్గు లౌదురు కొన్ని నాళ్ళలోన
ఎవనికై యేతెంతు రేఁటేఁట వార్షిక
ధనముఁ జేకొనఁగ నధ్యయనపరులు
గీ॥ అతఁ డాత్రేయగోత్రుఁ డేకాన్వయుండు
వాసిగన్న సుబ్రహ్మణ్య వరసుతుండు
రుక్మిణీగర్భభవుఁ డుదారుండు శ్రీను
వన్నపూర్ణాధిపుండు వంద్యబుధుండు. 1
మ॥ ‘అతిరిక్తం’డను నస్మదీయమగు పద్యంబందునఁ శ్లేషగ
ర్భితమౌ భావముఁ దత్ప్రభుఁ వినుటముద్రింపంగ లోనెంచిమ
త్కృతి, మాయింటికి వచ్చి తెల్ప నది యెంతేఁ గంటి
మోదం’ బనూ, చిరలబ్ధంబగు తత్సహాయమును వాసిం
బేర్కొనం జెల్లదే. 2
ఉ॥ ఎంతటివాఁడ నేను తమరేయిటు మద్గృహ మేగుదెంచి మీ
యంతటమీరె మత్కృతికిన య్యెడువిత్త మొసంగియిచ్చు వే
యింతునటంచుఁ బల్కితి రిదేకద దాతకుఁ జిహ్న మర్థితా
నింతయుఁ గోరకేయుసనియిష్టముఁ గూర్చుటదండయాగ్రణీ॥

---

*ఉ॥ ‘నిండుమనంబు నవ్యనవనీతసమానము, పల్కు దారుణా
ఖండలశస్త్రతుల్యము జగన్నుత విప్రులయందు........’
మహాభారతము – ఆదిపర్వము.

మ॥ సిరి చెన్నారెడువారు లేరె ధరణిన్ జేసాఁచి యర్థించినన్
సరిపోండితరుణంబు కాదనుచుఁ బశ్చాచ్ఛబ్ధులౌచుందు రి
క్కరణిన్ గోరకమున్న యర్థమిడఁగాఁ గాంక్షింత్రె మీదా
తృతా, గరిమం బెన్నఁగ నాకు శక్యమొకో యే కావంశ
రాకాశశీ. 4

శా॥ లోకజ్ఞుల్ భవదీయవంశజులు మీలో నొక్కవిజ్ఞాని ధీ
ప్రాకట్యంబలరార లెక్కల జమాబందీకి నొక్కాకులో
సాకల్యంబుగ వ్రాసి యీ నృపతియాశ్చర్యంబు రేకెత్తఁగా
'నేకా'వార నెసంట నేఁటికిని మీకీయింటిపేరో బుధా! 5

క॥ తత్తాదృగ్వంశంబున
నుత్తములు జనించి రెందఱో నీ వల వి
ద్వత్తా గుణవత్తా ధీ
మత్తల నవ్వారిలోన మణిపూస వహో! 6

మ॥ ధనమందుర్ గతతృష్ణులెవ్వరిల నేతన్మాత్రమే చాలునా
కని యార్జించెడి శక్తియున్న విడితౌరా! న్యాయవాదిత్వవృ
త్తిని, దద్ద్రవ్యము ధర్మకార్యములయందే యుంచితౌ
నీ ప్రవ, ర్తన మెన్నంగఁ దరంబె యెల్లరకు నాదర్శంబవై
తెంతయున్.

సీ॥ తావక గర్తపత్తనసత్రరాజమే
తమధర్మబుద్ధి కుదాహరణము
జీర్ణదేవాలయ శిథిలత మాన్పుటే
తమదైవభక్తి నిదర్శనంబు
విద్యార్థులకు మాసవేతనా లిడుటె మీ
విద్యాభిమాన ప్రవృత్తి కిరవు

ఏకాదశీవ్రతాస్తోకదీక్షయ భవ
ద్భక్తినాచారాదరణకు గుర్తు
గీ॥ ప్రతిపాటను ధర్మసత్రంబు వైచి
యొక్క విద్వత్కుటుంబ మందుంచి ప్రత్య
హము పురాణంబుఁజెప్పించు టదియ మీదు
పండితాదరతన్ దెల్పు దండయార్య! 8

ఆ॥ వె॥ మీకలార్థు లెల్ల మెఱికలు మీపరి
శీలనంబొ మీదుసిరివిధంబొ
అగును మీరు తలఁచునవియెల్ల సంకల్ప
బలమొ పట్టుదలయొ తెలియ మనఘ. 9

చ॥ వెలసిరి నీకతాననతివేలగుణుల్ సుకృతంపుఁ బుత్త్రికల్
కలదు యశస్తనూజ కలకాలము పేర్నిలఁ బెట్టువారు నె
వ్వాలవిడనట్టి రిట్టి సదపత్యని నిన్ననపత్యుఁగా మహిన్
దలఁతురుమాటదెచ్చునదల్ సుతులా?జనులెంత వెఱ్ఱులో.

మ॥ తొలుతన్ మీరలె గర్తమండలమునందున్ వేద వి
ద్యా పరీ, క్షల నుత్తీర్ణుల సత్కరించితిరి సత్సంకల్పతన్
వారి కా, వల మేలయ్యెను వేదపోషకసభల్ వర్ధిల్లి యం
దం, దనా, విలమా మీధన ముత్తరోత్తరమహావృద్ధిన్
బ్రసాదింపదే. 11

ఉ॥ కంటెఁ బదేపదే తమరుకార్యముపట్టుల బీదసాదులన్
గుంటుల గ్రుడ్డులన్ బిలిచి కుత్తుకబంటిగఁ బిండివంటతోఁ
దింటకుఁబెట్టి వల్వాలుపదించుట, కొందఱదే మెుమెప్పుగై
కొంటకు గొప్పవారలకె గూర్చెద;రిట్టిరుగెంటి వేయుచున్

సీ॥ చెప్పినయట్టుల చేయఁజాలుదు వీవు,
చెప్పుదు రన్యులు చేయలేరు
నా విధియంచు దానం బొనర్చెద వీవు,
పెఱవార లిత్తురు పేరు కొఱకు
వినుతి యేమాత్రంబు విననొల్ల వీ, వారుల్
కొనియాడుమందురు ధన మొసంగి
కఱప నీతిని మోముకడనె యందువు నీవు,
పరు లనెదరు చాటుపాటుఁజూచి

గీ॥ దైవ మతిధన మిడుట పేదల భరింప
నని తలంచెద వీ, వన్యు లాత్మ కొఱకె
యంచుఁ దలపోసికొంద్రు; నీ కన్యులకును
దారతమ్యం బదింతెపో దండయార్య! 13

ఉ॥ శ్రీమహితుండు లౌకికుఁడు శేముషిగాంచిన న్యాయవాది
యుం, చే మిముఁగూర్చివింటి మును పిప్పుడొగంటి భవ
ద్గుణంబులున్, నేమము లీవులున్ మదిగనెన్ ముదమూ
జనకాదులిట్టి రే, కోమలకీర్తి! మీసుగుణకోటికి దాసుఁడ
నేఁటినుండియున్. 14

మ॥ తిరమా కూరిమి మత్కృతిన్ దమరు ముద్రింపించుటన్
దీనిలోఁ, గొఱవన్ దీరిచి పూర్వభాగమయినన్ గూర్పంగ
నాకాయెను, త్తరభాగంబునుగూడ వ్రాయుటకుఁ బ్రోత్సా
హించినా రెంతయున్, మఱవన్ జాల భవన్మహోపకృతి
సన్మాన్యా! వదాన్యాగ్రణీ. 15

గీ॥ ధర్మకార్యైకరతుల నుదారమతుల
మిమ్ము మఱియును మీకుటుంబమ్ము సతము
ఆయురారోగ్యభాగ్యంబు లందఁ జేసి
మనుప సర్వేశ్వరునకు నమస్కరింతు. 16

"ప్రమాదో ధీమతామపి" బుద్ధిమంతులకు సైతము పొరపాటులుండునన్న నాబోటి మందబుద్ధులమాట యేమి చెప్ప నలయును. నా కావ్యంబునం దేవేని నెరసులున్న బుద్ధిమంతులగు సహృదయులు నాకవి యెఱింగించినచో వారికిఁ గృతజ్ఞుఁడనై మరుముద్రణంబున సవరించుకొనఁ గలవాఁడను.

మ॥ తలయూఁచెన్ బుధమౌళి దేశికుఁడు, మోదంబందె వైదుష్యని । స్తులుఁడౌ వేంకటశాస్త్రి సత్కవి, సదస్యుల్ మెచ్చి రెంతేనియున్। వెలయించె నిను దండయార్యుఁడు గుణోద్వేలుండు, మద్గ్రంథముల్। కల వెన్నో సుకృతంబు నీయది యహో కాదంబరీకావ్యమా!

ఇట్లు బుధజనవిధేయుఁడు,

గ్రంథకర్త.

ఓమ్

శ్రీ హయగ్రీవాయ నమః.

# ఆంధ్ర కాదంబరి

## ప్రథమాశ్వాసము.

శ్లో॥ శ్రీమ ద్వాజిముఖం త
ద్ధామ భజేఽభీష్టవస్తు భక్తానామ్
యదనుగ్రహా దభూవన్
ప్రఖ్యాతా వాదిరాజయతిముఖ్యాః. 1

శ్రీరామామణి జానకీరమణియై
సేవింప, భవ్యుల్ మహో
దారుల్ తమ్ములు భ్రాతృభక్తి దళుకొ
త్తం గొల్వఁగా దుష్టసం
హారంబున్ మఱి శిష్టరక్షణముఁ జే
యన్ రాముఁడై పుట్టి లో
కారాధ్యత్వముఁ గన్న దేవు సతతం
బర్చింతు నిష్టాప్తికై. 2

ఉ॥ నేరము వెట్టి నన్నుఁ బరుషా! యలయింపకు నాదు కౌఁగిటన్
జాఱెనె నీకు చోపరిల సన్మకరుల్ మరలన్ లిఖింతుఁబో
యూఱడుమంచుఁ బల్కు దయితోక్తికి మోమున లేఁత నవ్వు చె
న్నారు మదంబ యా జనకనందన మమ్మనయమ్ము ప్రో
చుతన్. 3

శా॥ తల్లిందండ్రియు నాకు శంబలె మహాత్మా! యేరి నీకంచుఁ
ద, న్నిల్లా లుల్లసమాడ నాకుఁబలె నీకెంక త్తమూపల్
నవో, త్ఫుల్లాబ్జాక్షి! యటంచు వక్రగతి నప్పూఁబోణి
కన్నట్టురా, యల్లుం డెప్పుడు మాకుఁగూరుచుత భవ్యంబుల్
మహైశ్వర్యముల్. 4

సీ॥ కలికి! నీమెయి స్వేదకణము లేమిటి కన్న
నీకంటిసెగచేఁ బినాకపాణి!
చంపకగంధి! యీకంప మేమిటి కన్న
నీపాఁపపేరుచే నీలకంఠ!
అలివేణి! రోమాంచమయ్యె నేమిటి కన్న
నీగాంగలహరిచే నాగభూష!
వనజాయతాక్షి! వైవర్ణ్య మేమిటి కన్న
నీవిభూతిస్ఫూర్తి నిర్మలాంగ!

గీ॥ అనుచుఁ బ్రియసన్నిధానసంజనితసాత్త్వి
కోదయము తెలియంగ రాకుండునట్లు
పర్వతకుమారి పన్ను నపహ్నవంబు
శుభము లొనఁగూర్చి మముఁ గృపఁజూచుఁగాత. 5

క॥ చతురాననముల వేలుఁగఁ
జతురాగమతత్త్వబోధ సలుపుచు మునులన్

జతురాననుల నొనర్చెడు
చతురాస్యుఁడు మాకొసఁగు వచశ్చాతురులన్. 6

చ॥ అరుణనఖాంశుసంవలిత మాత్మకరస్ఫటికాక్షమాల నం
తరమున రక్తిమన్ దలఁచి దానిమగింజల పేరుగా నిరం
తరమునులాగుచిల్కఁ జిలుకనవ్వునదవ్వునమందలించుమా
సరసిజగర్భురాణి కృప సాఁకుత మత్కవితాకుమారికన్.

మ॥ మొనగాఁడై తనుఁగొల్చువారిదురితంబుల్ పాపుచున్ శ
క్తిమై, జనవంద్యుండగుతండ్రి మించి మునుమున్ సర్వత్ర
కెక్కొంచుఁ బూ,జను దానెల్లరఁదన్నుఁబుత్త్రిఁడును మిం
చన్ జెల్లునన్నాస్తిక గీ,శుని చేతన్ దలపింపఁ జేయు ద్విరదా
స్యుం గొల్తు నిష్టాప్తికిన్. 8

క॥ అనితరసాధ్యము లవణాం
బునిల మోల్లంఘున మొనర్చి భూతనయానం
దనవర్ధనుఁడగు ధీయుతు
ననఘున్ బవనాత్మజున్ మహాత్ముఁ దలంతున్. 9

గీ॥ ధీసముద్రుల నాకుజవ్యాసభాస
కాళిదాసాదిగీర్వాణకవుల కెఱఁగి
ఆంధ్రకవులందునఁ గవిత్రయంబు సోమ
నాథు శ్రీనాథముఖ్యుల నతి యొనర్తు. 10

గీ॥ ఆంధ్రకవితాపితామహు నభినుతింతు
సూరనార్యునికవితాకుమారి సారె
సారెకుం బ్రస్తుతించి జోహారొనర్తుఁ
దక్కువిద్వత్కవులకు వందనము లిడుదు. 11

క॥ శతలేఖిన్యవధానుఁ
గృతభరతాభ్యుదయరమ్యకృతి నభినవపం
డితరాయనిఁ గొల్తు గుణా
న్వితు శ్రీమన్మాడభూషి వేంకటసుకవిన్. 12

మ॥ తనరారుఁ బ్రతిసద్మమింక భువి సిద్ధన్యాత్ముఁ పేరంచు నే
ఘనుభాషాకృషి మెచ్చి పల్కె, కవితాఽఽకారాదులం
దెన్న నే, రనిసామ్యంబున భారతాద్యతన"బర్నార్డ్షా"
గఁగొండాడె, నే, యనఘుఁ "నిర్మలభాగి"కొల్తుఁగవిఁగా
నాకృష్ణ విద్వన్మణిన్. 13

గీ॥ తిరుపతివేంకటకవు లటు
సరసపుఁబోకడలు, ఘనతి, జంటగఁ బేరుల్
వరలుటఁ గవులకు నిప్పుడు
తిరుపతివేంకటశకంబు తెలుఁగుకవితకున్. 14

వ॥ కావున. 15

చ॥ ధరణీజనుల్ నుతింపఁగనిదంయుగ దైవమునాఁ బ్రసిద్ధుఁడౌ
తిరుపతివేంకటేశునకు దేవునకట్ల శకాధినాథులౌ
తిరుపతివేంకటేశకవిధీరులకున్ గవితాప్రగల్భవా
గ్గురులకు మద్గురుప్రియులకున్ మనుప్రమొక్కుల నందఁ
జేయనే. 16

సీ॥ నాటకాలంకారపాటవం బొసఁగిన
ఘనుఁడు కాశీకృష్ణ కవివరుండు
ప్రకరణపాండితీప్రాభవం బొసఁగిన
గురుఁడు రామబ్రహ్మకోవిదుండు

కౌముది సాంగంబుగా నాకుఁ జెప్పిన
నయభాషి పేరి పేరయమనీషి
అటుపైన దానివ్యాఖ్యలు పఠింపించిన
నోరి సుబ్రహ్మణ్య సూరివరుఁడు
గీ॥ వేదులాన్వయవారాశివిధుఁడు బుధుఁడు
సూర్యనారాయణప్రథాశోభితుండు
లోనుగాఁగల విద్యాదీక్షానులైన
యస్మదాచార్యవర్యుల నభినుతింతు. 17

గీ॥ ఎన్న రపశబ్దముల నర్థ మేగుఁగాక
కలఁగ రింతయు వృత్తభంగముల కాత్మ
వెఱవరు లవంబు ధరణి దుర్విటులు వోలెఁ
గుకవిజనములు, వారలగోడవ యేల. 18

ఉ॥ పండితరాజహంసములప్రాపునఁ గావ్యసరోవరంబు స
న్మండనమూనెదుర్ బదనిధానముతోన, కుదృష్టిదుష్ట వే
దండపుఁదండమో కలఁచుఁ దద్రస; మిందది చేరకుండఁగా
నండజవాహురాణిఁగుశలాంకుశపాణి నమస్కరించెదన్.

వ॥ అని యిట్లు దేవతానతియుం బూర్వకవినుతియు నాధు
నికకవినతియు గురుస్తుతియుఁ గుదృష్టినిక్కృతియుఁగావించి
యెద్దియేని యొక ప్రబంధంబు నిబంధింపఁ జూచునాకు.

సీ॥ వాత్స్యాయనాన్వయవారాశిశీతాంశుఁ
డనిమిషవాణీస్వయంవృతుండు
రాజదేవీగర్భరత్నంబు శ్రీచిత్ర
భానువిద్వద్రత్నభాగ్యఫలము

హర్షవర్ధనరాణ్మహాసభాభరణంబు
విదితాఖిలుఁడు సాంగవేదవేత్త
విద్వత్కుమారభావితకీర్తిజనకుండు
గద్యప్రబంధప్రగల్భతముఁడు
గీ॥ భట్టబాణుండు గీర్వాణభాషఁ దొల్లి
చేసె నెద్దాని జగము స్వోచ్ఛిష్టమనఁగ
అట్టి కాదంబరీకావ్య మాంధ్రభాష
సలుపుతలఁపు మనంబులోఁ దాలకరించె. 21

ఉ॥ అంబరవాహినీవికచదంబుజచుంబిరసంబు మించు కా
దంబరి కేమి యొక్కఁడవిదగ్ధుఁడు మెచ్చకయున్న నేమి లో
పంబు బుధాళికిన్ శ్రవణపర్వమయై దలలూఁపఁ జేయు వా
టంబగుపాట యొక్కచవటన్ జెవిటిన్ గరఁగింపకున్నచో.

క॥ వాణీపుంరూపంబని
బాణు వచింతురు తదీయభావంబులు గీ
ర్వాణస్తుత్యము లంత
ర్వాణులఁ జేయింపవే శిరఃకంపంబుల్. 23

సీ॥ కొనగోటితోడ మీటినవిచ్చు జవరాలి
జిగి గబ్బిగుబ్బల బిగువుకంటె
దొరగాఁబండిన దొండపం డట్టి క్రొ
న్ననబోఁడి మోవిపానకముకంటె
అలరువిల్తుని మోహనాస్త్రమా యననొప్పు
వాల్గంటి క్రీఁగంటి వాఁడికంటె
దిరిసెనలో లోటు దిద్దఁగాఁజాలిన
పువుఁబోఁడి మేని మార్దవముకంటె

గీ॥ బిగువుఁ దియ్యందనంపుఁ గ్రొంజిగియు వాఁడి
తనము మఱిపోయిఁగూర్పు మెత్తందనంబుఁ
గానరాకుండఁబో వనుమాన మేల
సరసులకు భట్టబాణ వాక్సరణులందు. 24

గీ॥ ఆత్మయే పుత్త్రుఁడని శ్రుతి యనుటఁ జేసి
భట్టబాణుండ భూషణభట్టు, భేద
మేమి పితృభాషణములట్ల యేతదీయ
భాషణంబులు బుధకర్ణభూషణములు. 25

వ॥ కావున నేతన్మహాప్రబంధంబ యాంధ్రీకరణయోగ్యం
బుగా నెంచి యయ్యది విశేషజ్ఞాననిర్వాహ్య మగుట
గుర్తెఱింగి ప్రకృతకాలంబు తదనుకూలంబుగామిం జేసి.

శా॥ జ్ఞానాంభోనిధులన్ గురూత్తముల నిచ్చల్ గొల్చి గై
కొన్న వి, జ్ఞానంబుం దిలకించు నాథుఁ డొకఁడైనన్
లేఁ డిసీ, రాజసం, స్థానంబుల్ బడు లిప్తు పండితులకున్
సంస్కార మిం కేటి కీ, 'ఓనామాల'కు, మాసె మాచ
దువు లీయుద్యోగపుంగోష్ఠిచే. 27

గీ॥ నిర్ణయము చేయుదురు పఠనీయములుగ
నుత్తమగ్రంథములె పెక్కు లున్నతంపుఁ
గక్ష్యలకుఁ గాని లో తండుఁ గానరాదు
పల్లవగ్రాహిపాండిత్యపటిను దక్క. 28

చ॥ గురుకృపఁగొన్న జ్ఞానము నకుంఠ మొనర్పఁగ శిష్య
కోటికిన్, గఱపుచుఁ బెంపుసేఁత కధికారులు సైఁపరు;
శక్తి దానిచేఁ, దఱుఁగునటంద్రు; వేతనము తక్కువ వా

రఱకడ్పుగాఁదిరన్, దఱుఁగదె వారిశక్తియు? నదభ్రము
చేయ రదేల జీతముల్ ? 29

గీ॥ ప్రకృత విద్యావిఘులు నధిపతులశాస
నములుఁ దోడ్పడలేవు జ్ఞానంబుఁబెనుప
అనిననొప్పరు నేఁటి విద్యాలయములు
తత్త్వము విమర్శచేయ విద్యా లయములు. 30

ఉ॥ ఏయదియెట్టులుండిన నహీనతరంబగు భక్తియుక్తియున్
గాయువునుం గృతజ్ఞతయు గర్తపురోన్నతపాఠశాలపై
ధీయుతులార! నాకెనఁగుఁ; దెల్పున నాకిదియేగదా యుపా
ధ్యాయి, యిటన్ వసించియ రహస్యములన్నియు నే నె
ఱుంగుటన్. 31

వ॥ అని కొంత యోజించి. 32

మ॥ కవితాభ్యాస మొనర్తుమన్న సరియౌ కాలంబు మాకుం
డ దు, న్న విశేషంబుగ ఖండకావ్యములె సందర్భించు
నకాలమం, దవియుం బెద్దలు వచ్చునప్పు డెవరో
యర్థింప నెల్లెట్లో యా, శువుగాఁజెప్పిన పంచరత్నము
లెటుల్ శోభిల్లు మా పద్యముల్. 33

వ॥ ఇట్లభ్యాసవైధుర్యంబునం జేసి పద్యనిర్మాణంబున కొ
క్కింత జంకుచు. 34

గీ॥ కవిగణనలోఁ గనిష్ఠికాగ్రంబు నెక్కి
సకవిలేమి ననామిక సార్థకాఖ్యఁ
జేసినట్టిఁడుకద కాళిదాసు; తత్కృ
తులనె లాక్షణికుల్ దోషముల వచింత్రు. 35

మ॥ అనవద్యప్రతిభాధురంధరుఁడు శ్రీహర్షుండు తా నైషధం
బను కావ్యంబును జూప మమ్మటబుధుం డాద్యంతముం
జూచి తో, ల్తనె నాకీకృతిఁజూపియుండునెడ మత్కావ్య
ప్రకాశంబునం, దునఁగ్లేశంబును జెందకుండుదుఁగదా
దోషాళి కంచాడఁడే. 36

గీ॥ ఎవరితరమౌను దోషంబు లెనయకుండఁ
గృతుల రచియింపఁ గలమని ప్రతినఁబూన
భారత విరాటపర్వాదిభాగమందుఁ
గ్రమముఁదప్పిరి తిక్కన్నగారెయనఁగ. 37

క॥ లాక్షణికాగ్రేసరుఁడు వి
లక్షణుఁ డడిదముకులుం డలఁతియే! యొకచో
లక్షణపద్యంబునె యప
లక్షణమొనరించె; భ్రమ మలంఘ్యముకాదే. 38

చ॥ ఎసఁగిన నర్థసంపద రహింపదుపో పదశుద్ధి, యద్దితాఁ
బొసఁగినరీతిసున్న;యదిపొల్చినమృగ్యముకూర్పు నేరుపుం
బస, యదియున్న వక్రగతి పాఱదు, పాఱిన వ్యర్థమే
యగుఁ, రసములరారకున్న; గహనంబుగదా కవనంబు
ధాత్రిలో. 39

వ॥ అట్లగుట సలక్షణకావ్యనిర్మాణంబు దుష్కరంబుగా
నెంచియుఁ గాదంబరీరసాకృష్టహృదయుండనై తన్ని
ర్మాణంబునకుఁ గడంగితి. 40

క॥ ఎక్కడ! బాణతదాత్మజు
లెక్కడ! తత్కావ్యరత్న మెక్కడ! దీనిఁ

చిక్కఁగఁ దెనిఁగించెడి నా
తిక్క, బళీ! నిండమునిఁగితిఁ జలి యేలా? 41

మ॥ భవసంతాపహరంబులౌట హరిసంబంధిప్రబంధంబులే
యవు సత్కావ్యములంచు నెన్నుదురు మోక్షాసక్తిమైఁ
గొండఱై, న, విసర్జింతురె తక్కఁగబ్బముల, బాణప్రోక్త
కాదంబరిన్, గవితాదృష్టిని జూచుచో నిది యసత్కా
వ్యంబునా, శక్యమే. 42

క॥ సద్యఃపరనిర్వృతియే
హృద్యఫలము కావ్యమున కహీనంబది యీ
గద్య ప్రబంధమున సం
సద్యోగ్యమ కాక యిది యసత్కావ్య మెటో. 43

క॥ చండాలాదిక వర్ణన
ముండెనని యయోగ్యమందురో? కావ్యంబున్
గొండొక ప్రపంచమే, యిటఁ
జండాలాంగనయుఁ బద్మసంభవ కాదే. 44

గీ॥ కొంద ఱలరంగ రాట్ఛందమందుఁ గేత
నార్య కాదంబరీపద్య మనుచు లక్ష్య
మొందు పరఁగుట నభినవదండి దీనిఁ
దెలుఁగుఁ గావించెనందురు తెలియ మద్ది. 45

క॥ కేతనసత్కవివర్యుం
డే, తెన్నుఁ గొనరించెనేని యేతత్కృతి, భా
షాతరుణీయదృష్టమకద
నాతరమా యంతకున్ ఘనంబుగ వ్రాయన్. 46

గీ॥ ప్రౌఢభావంబులను దేటపఱచువేళ
నుచితశబ్దంబులెన్నని యుండవలయు
నల్లయింద్రాదులకె దాఁట నలవిగాని
శబ్దవారాశిఁ గడవ నాశక్యమగునె? 47

ఉ॥ తప్పులలోపలన్ మొదటి తప్పొకటాంధ్రము సేయుటందు
లోఁ, దప్పొకభట్టబాణరచితంబని యెంచియుఁ దెల్గుసేఁ
త పైఁ,ద ప్పొకటేల యన్నియును దప్పులె పండితులార!
దీనిలోఁ,దప్పులుపట్టుటెల్లఁ దమతప్పులె గుట్టుగనూరకుం
డుఁడీ. 48

మ॥ ఒకచోటన్ విడఁదీయరానియటు శ్లేషోక్తుల్ విరాజిల్లెడిన్
బ్రకటాభిజ్ఞత యెంతయున్నఁ దెలిఁగింపన్ శక్యమే యెట్టి
వా,రికి నప్పట్టున సాహసించితినిటుల్ శ్రీనాథముఖ్యా
ఢ్య పూ, ర్వకవుల్ తెల్గొనరించినట్టి పెనుత్రోవల్ మాకు
నాదర్శముల్. 49

గీ॥ సరసగీర్వాణభావసంభరితమగుట
నా కవన మెల్లవారి కానందమొసఁగు
సరసగీర్వాణభావసంభరితమగుట
నాకవన మెల్లవారి కానంద మిడదె ? 50

శా॥ అర్థంబీకృతి సాంతముం దెనుఁగుసేయన్ గొంత విశ్రాంతి
య,భ్యర్థింతున్ శుభశీఘ్రుతోక్తి నిపు డీయర్థం బెయర్పిం
తు గు,ర్వర్థం బర్థమకాయటంచు బుధులారా! దీనినెగ్గిం
తురే?, యర్థేందుం దలపై ధరించుకొనఁడే? యజ్ఞుండె
సర్వజ్ఞుఁడున్. 51

మ॥ సమతాపోషణదృష్టి యౌచితియు మించఁ గొన్నిచో
 ట్లన్ నవీ,నములన్ జేర్చితిఁ గొన్నిచోటులఁ గథానందాను
 భూతిత్వరా,సముపేతాత్మత వర్ణనల్ విడిచితిన్ శబ్దాది
 సంశుద్ధికిన్, బ్రమితంబుల్ సుకవిత్రయీతదితరప్రౌఢోక్తి
 సందర్భముల్. 52

వ॥ అని యిట్లు ప్రసక్తానుప్రసక్తంబుగాఁ గొండొకవచించి
 గ్రంథాదియందు వంశవర్ణనంబు శిష్టాచారంబుగాన
 నస్మద్వంశం బొక్కింత వాక్రుత్తు. 53

సీ॥ పున్నామ నరకంబు పో మరీచి హృదంత
 రమునుండి కన్న గారాబుసుతుఁడు
 దక్షేశుచే నిజాత్మజల కర్హుండని
 ఎంచి యీఁబడినట్టి పెండ్లికొడుకు
 స్వారాజ్యము చ్చెర్వ నీరుద్రావించిన
 గరుటాలమంతుని గన్నతండ్రి
 అశ్వమేధాంతంబునందు భార్గవునిచే
 ధరణి దక్షిణగొన్న తపసిమిన్న

గీ॥ పొట్టఁబదునాల్గు జగములున్నట్టివాఁడు
 పొట్టివాఁడు కుమారుఁడైనట్టివాఁడు
 కశ్యపుండను విఖ్యాతిఁగన్నవాఁడు
 మాదుగోత్రంబునకుఁ దలమానికంబు. 54

శా॥ ఈదృగ్గోత్రముగల్గి మాధ్వమతమందెంతేని మాన్యంబు
 బు, గ్వేదోపేతము పళ్ళెవంశమమరున్ విఖ్యాతు లైరిం
 దు స, ద్వైదుష్యంబున మాదుతాత లలఘుల్, దైవా

రుదుర్నాకు న, న్నాదమ్ముల్ హనుమద్రఘూత్తములు
మాన్యల్ సోదరీ రత్నముల్. 55

గీ॥ సాధుమతి, తండ్రి యల జగన్నాథబుధుఁడు
తల్లి కావేరి సాధ్వీమతల్లి వినుఁడు
పెట్టుపేరో యెఱుంగను బుట్టుపేరో
పూర్ణప్రజ్ఞుండటందురు బుధులు నన్ను. 56

సీ॥ ప్రవహించుఁ బెన్నాతరంగిణి యేయూర
ధరణికి ముత్యాల దండవోలె
నెలపూవు లేఁత వెన్నెలగాయ నెందుండు
నెలనాగతో సంగమేశ్వరుండు
లక్ష్మీతనూజాతులా యననొప్పి యె
చ్చోట నుందురు పాకనాటిరెడ్లు
ఏయూరి కామడ కింతయై పిల్చినఁ
బలుకును నెల్లూరు పట్టణంబు

గీ॥ దేన మత్పితృపాదప్రతిష్ఠితాంజ
నేయదేవాలయం బొందు నెగడుచుండు
సంగమద్ది త్రివేణికాసంగమంబు
సరసగుణులార ! మామక జన్మభూమి. 57

సీ॥ కాపురంబా, ధనశ్రీపరిభూతాల
కాపురంబగు గర్తికాపురంబు
దేశికుండా, స్వర్ణదీహసద్వాగ్ఝరీ
మండితుం డగు కృష్ణపండితుండు
అభిమానశాస్త్రమా, యఖిలవిద్వద్వచో
భూషణం బగు ఫణిభాషణంబు

నిజదైవతంబా, వినిర్దగ్ధభక్తాఘ
కాననం బగు తురంగాననుండు
గీ॥ గోష్ఠియా కావ్యనాటక కోమలోక్తి
పఠనపాఠన కౌతుకపరవశంబు
వృత్తియా సంస్కృతాచార్యవృత్తి కర్త
పత్తనస్థాపితోన్నతపాఠశాల. 58
క॥ శతలక్షణియను వ్యాకృతి
కృతి కావ్యాలోకమనఁగఁ గీర్తితము నలం
కృతికృతి యీరెండును ధీ
యుతులార! మదీయకృతుల నుద్గ్రంథంబుల్. 59
వ॥ తక్కుఁగృతు లెవ్వియన్న. 60
సీ॥ రచియించితిని మెచ్చ రసికులు శ్రీరామ
కల్యాణమనుమహాకావ్య మొకటి
తెలుఁగుగా మాఱ్చితిని బౌద్ధబంధ మీ
కాదంబరీమహాకావ్య మొండు
ఆంధ్రీకరించితి నభినవంబుగ బుధ
గణనీయములు నాటకములు పెక్కు
చేసితిఁ గైకసౌశీల్యంబునాఁ గ్రొత్త
పోకలుగల చిన్నిపొత్త మొకటి
గీ॥ ద్విపదఁగూర్చితి మేఘసందేశ, మాశు
సరణి వ్రాసితిఁ బార్వతీపరిణయాది
ఖండకృతు, లెన్నొ చాటువుల్ కలవు ప్రాయ
మిప్పటికి ముప్పదేనింటె కించుమించు. 61
వ॥ ఈ నేను. 62

గీ॥ జానకీజాని సత్కటాక్షంబు కలిమి
మున్ను శ్రీరామకల్యాణమును రచించి
యమ్మహాత్మునకే, యంకితమ్మొనర్చి
ప్రథమయత్నంబు సార్థకపఱచుకొంటి. 63

వ॥ అట్లె యేతద్ద్వితీయ ప్రయత్నంబును. 64

క॥ గురుఁడే హరికంటెం బర
తరుఁడని శాస్త్రంబులే సదా పల్కఁగదా
గురునకు మృదుమధురసువా
గురునకు నర్పించుకొనుట యుచితముగాదే. 65

వ॥ కావున. 66

క॥ విష్ణ్వాత్త మత్వచిద్వ
రిష్ఠునకున్ శాస్త్రవిదరిష్టసభా భ్రా
జిష్ణునకున్ శ్రీకాశీ
కృష్ణకవీంద్రునకు నాదు కృతి నర్పింతున్. 67

క॥ ప్రతికృతిఁ గృష్ణార్పణ ము
న్నతు లొనరించెద రకామనంబుగ, నే నీ
కృతికతన వెలసితిని, స
త్కృతి మత్కృతిఁ జేయనొకొ? కృష్ణార్పణమున్. 68

వ॥ అదియునుంగాక. 69

శా॥ వాసిన్ విద్యయొసంగినాకుఁ బెనుపొప్పం జేయ నీమాదృగ్వి
ద్యాసంబంధము **వేంకమాంబ** యను విద్యాశాలినిం బు
త్రి నెంతో సంతోసముతో నొసంగ గుణభద్రుం డీగురుం
డాకె పుత్రీసంతానము దక్కఁ, దుర్భర శుగబ్ధిన్ ముంచి
పోయెన్ ననున్. 70

మ॥ గతశోకంబునఁ గార్యమేమి గురుసంకల్పంబు నీడేర్చుటే
మతిమచ్ఛాత్రుల ధర్మమౌ గురునకున్ మామామ కేనుం
జమ,త్కృతిమన్మత్కృతిపుత్రి నిచ్చి భువినెంతే మాదు వి
య్యంబు శా,శ్వతమున్ శ్లాఘ్యముఁ జేయు టొప్పుఁగద,
యాచంద్రార్క-సంశోభిగన్. 71

ఉ॥ కోమలచారుసత్కవితకున్ సఖినా, నిజపుత్రి కామణిన్
ప్రేమనొసంగి నన్ను గృహమేధినొనర్చిన పుణ్యమూర్తికిన్
మామకవృద్ధికామునకు మామకు మత్కృతిపుత్రినిచ్చి నే
మామకుమామనౌటబహుమానపదంబుగణించుటేగదా.

శా॥ అతిరిక్తుండ నొసంగఁజాలను సువర్ణానర్ఘముద్రాద్యలం
కృతు లోకావ్యకుమారిరో! కినియఁబోకీపై పటారంబు
తోఁ, గుతుకంబేమిటి వన్నెవాసిఁ గనునీకున్ నాథుఁగా
నేర్చి కూ, ర్చితిఁదల్లీ! కవిరత్నమున్ బుధమణిన్ శ్రీకృష్ణ
గుర్వగ్రణిన్. 73

గీ॥ మామక గురూత్తముని వర్తమానకాల
మం దెఱుంగనివారు లే రెందు నైన
ఉత్తమగుణానువాదంబు చిత్తశుద్ధిఁ
గూర్చుఁ దద్వంశమిందు వాక్రుత్తుఁగొంత. 74

క॥ యాజుషశాఖము భార
ద్వాజసగోత్రమ్ము మాధ్వధరణీసురమున్
రాజార్చితంబు విద్వ
ద్భ్రాజిష్ణువనగుచుఁ గాశివంశము వెలయున్. 75

క॥ గణనీయగుణులు విద్వ
న్మణులు మతగ్రంథములకు మాన్యములౌ టి

ప్పణులను రచియించిన తి
మ్మణబుధు లీవంశమునకు మండనభూతుల్. 76

వ॥ ఇట్టి విద్వదవతంసంబగు కాశీవంశమునకు భారద్వాజస
గోత్రులు నాపస్తంబసూత్రులు నకి్కవంశధుర్యులునగు
శ్రీ పిచ్చమాంబా లక్ష్మణాచార్యవర్యులు జననీజనకులుం
గాఁగల మద్గురువరేణ్యులు దత్తపుత్త్రులై కాంచనంబు
నకు మణిసమాగమంబుంబలె వన్నె దెచ్చిరి. 77

సీ॥ ఎవనిప్రాశస్త్యంబు నెఱిఁగించునల్లము
క్కంటియూరౌ కాశియింటిపేరు
ఎవనిగానాభిజ్ఞత వచించు భగవద్వ
తారవాచకతఁ జెన్నారుపేరు
ఎవనికౌముద్యభినవకీర్తిఁ బ్రకటించి
నెగడుబిరుదు కళానిధిపదంబు
ఎవనిబోధకతావిభవముఁ బేర్కొనుఁ గీర్తి
ధుర్యంబు మాన్య మాచార్యపదము
గీ॥ ఎవనియవధానశక్తి వైభవము సతముఁ
జాటుఁ దిరుపతి వేంకటశాస్త్రి దత్త
మానితవధాని సచ్ఛిరోమణి యటన్న
బిరుద మా కృష్ణబుధు నెన్నఁదరమె నాకు. 78
సీ॥ గోవర్ధనోద్ధారకుం డెన్న నాతండు
గోవర్ధనోద్ధారకుం డితండు
సత్యభామాసమాసక్తుఁ డెన్న నతండు
సత్యభామాసమాసక్తుఁ డితఁడు

శంఖచక్రాదిలక్షణుఁ డెన్న నాతండు
శంఖచక్రాదిలక్షణుఁ డితండు
సాధుకలాపభూషణుఁ డెన్న నాతండు
సాధుకలాపభూషణుఁ డితండు
గీ॥ మధ్వహితుఁ డాతఁ డీతండు మధ్వహితుఁడు
వేణువిదుఁ డాతఁ డితండు వేణువిదుఁడు
నామమునఁగాదు సుగుణగణములఁగూడఁ
గృష్ణసదృశుండు కాఁడె మాకృష్ణబుధుఁడు. 79

చ॥ సరసవచోభిరామ, గుణసంగత, భావసమేత, చార్వలం
కరణవిరాజమాన, బుధగణ్య, ననుంగరఁగంగఁ జేసె; సుం
దరియొకో? కాదు, కృష్ణకవితల్లజసూక్తియటంచుఁ దప్పి
కొం, దురఁట విదగ్ధు, లెన్నరె బుధుల్ భువిఁ దత్క
వితామహత్త్వముల్. 80

మ॥ అకలంకంబగునిమ్మహామహు నుపన్యాసప్రవాహంబులో
సుకవీశుల్ మఱిరాజహంసలెపుడుఁ శుద్ధాత్ములై తేలుచు
త్సుకులౌదుర్ తలఁబూనిదానిసకలజ్ఞుల్ సైతమాచంద్రుదే
శికతంగాంతురు, శక్యమే పొగడఁగా శ్రీవారిసామర్థ్యముల్

గీ॥ కృష్ణుబలె ధర్మసత్యపకృతికరిష్ణు
రూక్షదుశ్శాసనప్రతిరోధి యగుచుఁ
దనదునామంబుసార్థకత్వంబుఁగాంచ
ధార్మికహితంబొనర్చె నీధర్మబుద్ధి. 82

వ॥ ఇట్టి యనన్యసామాన్యంబులగు పాండితీప్రతిభాబలంబు
లచే దశదిశావిశ్రాంతయశులగు మద్గురుచరణులకు. 83

ఉ॥ మానితశీల సర్వగుణమాన్య కలార్థుల మమ్ము బోటులన్
సూనులమాడ్కిఁ బ్రేమమెయిఁ జూచెడితల్లి సతీమతల్లి ల
క్ష్మీనరసాంబ పత్నియయి చెన్నుదలిర్పఁగఁ గాంచె
నొక్కస,త్సూను,మదంగనామణికిఁ దోడికుమార్తెలనింక
నిర్వురన్. 84

వ॥ అందుఁ బుత్త్రుండు. 85

క॥ వ్యాసుం డాతఁడు విద్యా
వ్యాసంగము కలుగువాఁడు వంశకరుఁడు నా
తోసహపాఠియు మానస
వాసమునకు శ్రీరసీరవర్తన మెనయే. 86

ఉ॥ పండితపుత్త్రులన్న నొకపాటిగఁజూచెదులోక మేలనాఁ
గొండొక దూరు వీరు తమకో తమతండ్రికొ గూర్చుకొం
దు రీ, తం డటుగాక మేలన సుధామధురంబులు కావ్య
రత్నముల్, పాండితిఁగూర్చి యిర్వుర కభంగురకీర్తి
ఘటించె నున్నతిన్. 87

వ॥ ఇట్లు శ్రీబాణభట్టారకుం బలె విద్వత్కుటుంబవిరాజమా
నుండై విద్యాగోష్ఠుల నెఱపుచు నమందానందంబునఁ
గాలంబుఁగడపు నఖండపాండితీధుర్యులగు నస్మద్గురు
వర్యుల కభ్యుదయాభివృద్ధిగా నేను సమర్పించెడు కాదం
బరీ మహాగ్రంథంబునకుఁ గథాక్రమం బెట్టిదనిన. 88

# కథాప్రారంభము.

సీ॥ వనజసంభవునికై వడి విమానీకృతో
న్మదరాజహంసైక మండలుండు
కమలనాభునిమాడ్కిఁ గరసరోజాతోప
లక్షితశంఖాదిలక్షణుండు
తరుణశశాంకశేఖరునిలాగునఁ దృణీ
కృతసముద్ధతమీనకేతనుండు
బాహులేయుఁడువోలెఁ బరభూభృదప్రతి
భటసముద్భటశక్తిభాసురుండు

గీ॥ వనధివలె లక్ష్మికిం దావు, వైనతేయు
వరుసఁ గడు వినతానందవర్ధనుండు
వరలుఁ గళలకునెల్ల నివాసగృహము
సకల గుణపూర్తి శూద్రకచక్రవర్తి. 1

ఉ॥ రాజరమాలలామ సుచిరంబుగ రాజుల నాజినిర్గళ
త్తేజులనాశ్రయింపఁజనుదెంచిన యంకముఁబాయ క్షాళన
వ్యాజముచే నజస్రమనవద్యతరంబగు తత్కృపాణధా
రాజలమందునిల్చెనన రాజిలు నాతఁడుదగ్రతేజుఁడై. 2

ఉ॥ ఆయనఘుండునెమ్మొగమునందున, వాక్యవిలాసమందు,
రూ,పాయతిఁ, బాయకున్నతుహినాంశునిచే విధిరాణిచేఁ
బ్రసూ,నాయుధుచే, విరాట్పురుషుఁడౌతటి దైవతమూర్తి

యైన నా,రాయణమూర్తితో సమతనందినయట్లు సెలం
గునెంతయుఁ. 3

ఉ॥ అంబుజమిత్రతుల్యుఁడగు నాతఁడు రాజ్యము నేలఁ జిత్రక
ర్మంబుల వర్ణసంకరము, మత్తమహాద్విరదేంద్రగండభా
గంబులయందునఁ మదవికారము, స్వప్నములందు విప్ర
యో, గంబును గబ్బమందు దృఢబంధముఁ గల్గిచరించి
రెల్లరుఁ. 4

గీ॥ ఆనృపుఁడు శాస్త్రములఁ జింతనూనుకతనఁ
బరమనఁగ నాత్మలో భయంపడుటకతనఁ
జెప్పఁబడఁడయ్యెఁగాని నిశ్చింతుఁడనుచు
నిర్భయుండంచుఁ, గాఁడె ధీనిధి యతండు. 5

గీ॥ మఖదహనపూతహోమధూమంబువలన
శ్రావ్యకావ్యోక్తిపారవశ్యంబుచేతఁ
దప్ప, ధారుణిఁ గారణాంతరముచేత
నశ్రుపాతం బెఱుంగఁ డాయలఘుగుణుఁడు. 6

వ॥ అమ్మహానుభావునకు. 7

చ॥ కరముమనోజ్ఞమౌచుఁ ద్రిజగంబులకుం బ్రసవావనింబలె
న్బఱపయి మాళవైణదృగభంగఘనస్తనఘట్టనాతిజ
ర్జరితతరంగరంగయయి క్రాలెడు వేత్రవతీతరంగిణీ[చుఁ.
పరిసరమందుఁ బొల్చునొకపట్టణమిందిరాపురంబుఁబోలు

సీ॥ ధర్మదేవత కెద్ది తగు నివాసంబన్న
నామూల యని జను లనుటకతన
శౌర్యాదులకు నెద్ది జన్మభూమియటన్న
నామూల యని జను లనుటకతన

లక్ష్మికి నెద్ది లీలామందిరంబన్న
నామూల యని జను లనుటకతన
విద్యానిధుల కెద్ది విశ్రామగృహమన్న
నామూల యని జను లనుటకతన

గీ॥ దాతృతాశ్రీకి నెద్ది యాస్థానమన్న
నర్థులెల్లరు నామూల యనుటకతన
విదిశపేరిట సర్వ సద్విభవములకుఁ
గాఁపురంబయి చెన్నారు నాపురంబు. 9

గీ॥ తత్పురవతంసమే మరతకముగాఁగ
వలయముంబోలె ధారుణీ వలయమెల్లఁ
గరమునం దాల్చి విక్రమక్రమసమృద్ధి
నామహీపాలకుండు గాపాడుచుండు. 10

వ॥ అట్టిమహీపాలుండు సమస్త సామంత నృపశిరస్సమభ్యర్చిత నిజశాసనుండగుచుఁ బాకశాసనుండుంబోలె విబుధజన జేగీయమానుండై, సూర్యుఁడుంబోలెఁ బ్రతిదినోపజాయమానోదయుండై, దిగ్గజంబుకరణి ననవరత ప్రవృత్తదానార్ద్రీకృతకరుండై, మిత్రమండలంబున కుదయశైలంబుపగిదిఁ బ్రవర్తిల్లుచు నవజితాశేషభువన మండలుండగుటచే విగతరాజ్యచింతాభారుండై యిష్టగోష్ఠీవిలాసంబులఁ గలాసమంచితులతో నంచితాలాపంబు లొనర్చుచు. 11

సీ॥ దశదిశాకర్ణావతంసిత సుయశోర
మణులైన కవిశిఖామణులతోడ

వేదవేదాంగాది విద్యారహస్యవి
త్తములైన పండితోత్తములతోడఁ
గుటిలశత్రుక్షితీట్కుంభికుంభనిర్ధళన కే
సరులైన రాజకేసరులతోడ
విశ్రాణనక్రియా విధురీకృతామర
గవులైన మంత్రిపుంగవులతోడఁ
గీ॥ గావ్యనాటకసత్ప్రసంగములతోడ
రసములొలికెడు మృదుపద్యరచనతోడ
అనిశమును గాలమునుబుచ్చు నర్థిహృదయ
పద్మవనహేళి యానరపాలమౌళి. 12

ఉ॥ ప్రాయముగల్గియుఁ గనులపండువుగాఁ దనరారియుఁ
బ్రసూ, నాయుధు నవ్వఁజేయఁగల యందము చందము
గల్గియుఁ జగీ, పాయుతుఁడై యతండు ఘనసత్వుఁడు
గావున స్త్రైణముం దృణ, ప్రాయతఁజూచు బారితె
బలవంతుల కాయబలాబలోద్ధతుల్. 13

క॥ రాగాదుల కాకరము, దు
రాగతములకెల్ల మందిరం, బుద్యోగ
త్యాగైకమూలమని స్త్రీ
భోగపరత్వం బతండు బుద్ధిం దలఁచుఁ. 14

సీ॥ ఒకమాఱు గాయనోత్సుకతమై వీణ కైఁ
బూని వాయించుచుఁ బ్రొద్దుఁబుచ్చు
ఒకసారి హితుల యంతికమందు సరస స
ల్లాపమ్ముతోడఁ గాలమ్ము గడపు

ఒకతూరి పండితప్రకరమ్ముతో శాస్త్ర
పరతచేఁ గాలయాపన మొనర్చు
ఒకపారి నికటంబునకు వచ్చు యతులతో
నతులితోక్తుల సమయమ్ము పుచ్చుఁ

గీ॥ గాని యనుకూలవతులు సంతానవతులు
రూపవతులైన యయ్యవరోధసతుల
రక్తిఁజూడండు వదననిరాకృతేందు
మండలుండైన యానృపాఖండలుండు. 15

ఉ॥ నీరజమండలీహితుఁడు నింగిఁ గనంబడునంతఁ దత్సభా
గారముఁ జేరియున్న నృపుఁ గన్గొని పన్నగయుక్తమైన పా
టీరమనోజ్ఞవల్లరియకే భయమంజులరూపయై ప్రతీ
హారి కృపాణపాణి పతి కంజలి వే ఘటియించి యిట్లనున్.

గీ॥ కుపితశతమఖహుంకార ఘోషమునకు
బ్రమసి యిలఁ దూలిన త్రిశంకురాజ్యలక్ష్మి
కరణిఁ జెలువొందు చండాలకన్య యొర్తు
చెంతఁ బంజరమందునఁ జిలుక గులుక. 17

గీ॥ అంబునిధిభంగి రత్నాకరంబు ఱేఁడు
సకలభువనైకరత్న మీశుకముఁ గానఁ
దెచ్చితినటంచుఁ దమ్ముఁ బ్రార్థించుచుండె
ధరణినాయక! తమదు చిత్తంబు పైన. 18

క॥ అనిపల్కి యాపె విరమిం
చిన నంతట నానృపాలసింహుఁడు తద్ద
ర్శనలాలసైకతృష్ణా
జనితద్విగుణప్రమోదసంభ్రమముఁ దగుచున్. 19

కం॥ చండాల కన్యయని నృప
మండలముం జూచి, వారి మనముఁ దదీక్షా
ఖండంబగుటం గని, క్రొని
రం డిందేమిటి మహాపరాధం బనినన్. 20

గీ॥ విని, వినయనమ్రగాత్రయై విభునిమాట
కలరుచుం జిత్తమని ప్రతీహారి ద్వార
సీమఁ దనరాకకై ప్రతీక్షించునబల
కంతయుం జెప్పి తెచ్చిన నదియు నెదుట. 21

సీ॥ బహుతరపరివారపరివృతాంగుండయ్యు
నద్వితీయుండుగా నలరువాని
శ్రవణాంతవితతవిశాలలోచనుఁడయ్యుఁ
గడుసూక్ష్మదృష్టియై క్రాలువాని
అనవరతప్రవృత్తాతిదానుండయ్యు
నిర్మదవృత్తియై నెగడువాని
విష్టపత్రితయైకవిదితదోషుండయ్యు
నఖిలగుణాఢ్యుఁడై యమరువాని

గీ॥ అశనిభయపుంజిత కులాచలాంతరాళ
గతసువర్ణాద్రివలె మహీపతులనడుమఁ
దనరుచున్నట్టివాని నాధరణిజానిఁ
గాంచెఁ గౌతుకమొదవ నక్కలువకంటి. 22

గీ॥ విమలమణికుట్టిమప్రతిబింబితాప
ఘనుఁడగుచు భర్తృవాత్సల్యమునను జేసి
ధారుణీకాంతచే మనోధార్యమాణు
పగిదిఁ జెన్నారు నృపుఁ గాంచి పద్మగంధి. 23

కం॥ అలఘుతరాత్మీయభుజా
బలనిర్దగ్ధారిధరణిపాలేంధనుఁడై
యలరియు జ్వలత్ప్రతాపా
నలుఁడగు నానృపతి నేర్పునకు విస్మితయై. 24

వ॥ రాజాభిముఖంబుగా నిలువ.

చ॥ హరునయనాగ్నికీలలకు నాహుతియైన మరుమేనిక్రొం
బొగల్, నెఱియుట చేతనట్లు మలినీకృతయైన రతిమాడ్కి
రేవతీ, వరహలఘాతభీతయయి వచ్చిన యయ్యమునన్
బలెన్ మహీ,శ్వరు నెదుటంజెలంగు చెలువం గని విస్మి
తులైరి భూపతుల్. 26

క॥ ఆతఱి శూద్రకనృపతియు
మాతంగనరోపదిష్టమార్గను బ్రచల
త్స్ఫీతేంద్రనీలమణిసుత
భాతిం జెన్నారునారిఁ బరికించి యెదన్.   27

సీ॥ యక్షేశునృపలక్ష్మి యట్లనవరతమ్ము
నలకాభిరామయై యలరుదాని
మదనునిపూవిల్లు మాడ్కి, ముష్టిగ్రాహ్య
మధ్యయై నిరతమ్ము మలయుదానిఁ
గమలాలయవిధంబుగా నెప్డు లీలార
విందహస్తాఢ్యయై వెలయుదానిఁ
బ్రావృడంబుజనేత్రపగిది నజస్రంబు
ఘనకేశజాలయై గ్రాలుదానిఁ

గీ॥ గ్రమతరరూపయామ్యచు నక్షత్రమాల
యట్లు శ్రవణాభరణయుక్తయైనదాని

దాని నూతనయౌవన యైనదానిఁ
గనియె ననిమేషదృష్టియై మనుజవిభుఁడు. 28

వ॥ ఇట్లు తదేకాయత్తచిత్తంబుతోఁ గొంతతడ వాలోకించి
యంతరంగంబున. 29

క॥ బహులావణ్యావని, నీ
మహిళారత్నంబు నేల మాలెంతగఁ బితా
మహుఁడు సృజించెనొ యని యా
మహిపతి డోలాయమానమానసుఁ డగుచున్. 30

శా॥ ఈలీలావతి నింతరూపవతిఁగా నేర్పాటుఁగావించుఁ బో
యేలా తాఁకఁగరానియీయాకులమునందీలాగు సృష్టించుఁ జం
డాలస్త్రీయనుశంక చేఁ గరముతో డందాఁక కేచేసెఁ గాఁ
బోలుం బద్మభవుండు లేనియెడఁ బూఁబోండ్లెవ్వరే నిట్టిరే.

ఉ॥ ఎక్కడిజవ్వనంపుఁబస యెక్కడి మేనివిలాస మెంతయున్
జక్కనిదయ్యె నీహరిణశాబవిలోచన నీచజాతియై
యక్కటనింద్యతత్పురతయైదనుజాధిపులక్ష్మిమాడ్కి నిం
పెక్కుడు ధాత నేమనుదు నిక్కృతికంచుఁదలంచు లోపలన్.

గీ॥ అవనిపాలకు నక్కన్య యరసి కించి
దవగళితకర్ణతలపల్లవావతంస
యగుచు మ్రొక్కుడు మాతంగుఁడుఁ గయిమోడ్చి
పంజరముఁ జూపి యిట్లనుఁ బ్రభువుతోడ. 33

సీ॥ సరసకావ్యరసప్రసారంబునకు వాఁక
శాస్త్రంబులకు సరసంపుఁడీక
ఆఖ్యాయికాఖ్యానకాదుల కాఖ్యాత
ధర్మరహస్యసంతతికి జ్ఞాత

ఆగమవేత్తృత కందెవేసినచేయి
నయవర్తనోల్లంఘనకు దురాయి
అఖిలలోకైకగూఢాంతరార్థవిమర్శి
మధురాక్షరములకు మార్గదర్శి
గీ॥ భాసురమహాపురాణేతిహాసవక్త
వేణువీణాది విద్యాప్రవీణతముఁడు
ప్రణయకుపితాంగనాకోపపర్యుదాస
దక్షుఁ డీశుకవంశావతంసుఁ డధిప. 34

గీ॥ సత్పురాణకథనసరణి వైశంపాయ
నుండటంచు వీని నండ్రు బుధులు
వక్తృతను సుధాప్రవాహవిస్మారయ
ద్గిర మిదిగో రాజకీర మధిప! 35

సీ॥ ఏవిషయంబేని యీరాజకీరంబు
నకుఁ దృణప్రాయంబు నరవరేణ్య
ఏపుణ్యకథయేని యీపతన్మణి కుగ్గుఁ
బాలఁబోసినదె భూపాలవర్య
ఏశాస్త్రమేనియు నీశుకభూపాల
కునకుఁగొట్టినపిండి కువలయేశ
ఏసుభాషితమేని యీ విహంగమునకుఁ
గరతలామలకంబు కాశ్యపీశ
గీ॥ ఎల్లసాముద్రికంబులు నీపతంగ
వంశభవునకుఁ గంఠోపపాఠ మధిప
కడమ యననేల యితఁ డెఱుంగనివి లేవు
చెప్పనేటికిఁ దెలియు నీచిత్తమునకె. 36

వ॥ అని యిట్లు శుకోదంతపథంబును దదానయన ప్రవృత్త
స్వస్వామి దుహితృమనోరథంబును దెల్లముగా వెల్లడించి
కొనుండని పంజరంబుఁ దెఱచిన నందలి సుందరాకా
రంబగు రాజకీరంబు రాజాభిముఖమై దక్షిణపాదంబు
నెత్తి జయశబ్దపూర్వకముగా. 37

కం॥ కందమ్ము లలితగతిఁబతి
కందమ్ములఁ గొలుపఁ గౌతుకాశ్రువివర్ష
త్కందమ్ములట్లు సభ్యుల
కందమ్ములుగాఁగ నిట్లుగాఁ బఠియించెన్. 38

కం॥ నీ రిపుకాంతల కుచయుగ
మారూఢవ్రతమువోలె నలరు విముక్తా
హారమయి హృచ్ఛ్రగనలాఽ
దూరంబయి యశ్రువారిఁదోఁగిన యదియై. 39

కం॥ అని చిలుకపలుకఁ బతి మన
మున విస్మయమగుడు నికటమునను మహోర్వా
సనగతుఁడగు ముఖ్యామా
త్యుని వృద్ధుఁగుమారపాలితునిఁ జూచి యనున్. 40

ఉ॥ ఈవునువింటిగాదె యిపుడీవిహగాధిపుసూక్తియెంత మో
దావహమై చెలంగెను స్ఫుటాక్షర మీనుడి పక్షులం దస
ద్భావము; యందుఁ బండితునిభంగి నిటుల్వచియించుటద్భు
తం; బీవిధి యెందు నేనిఁగలదే? యననవ్వి ప్రధాని యి
ట్లనున్. 41

గీ॥ అద్భుతంబేమి శుకశారికాదులనఁగఁ
గలవు విహగంబు లవి యథోక్తముగఁ బలుకు

నందు శుకములు మానవు లట్లు పలుకుఁ
దెలియవే భూప ! చిలుకలపలుకు లనుట. 42

వ॥ అదియునుంగాక యీవిహంగంబునకు నన్యజన్మోపాత్త సంస్కారానుబంధమ్ముచేఁ గాని పురుషప్రయత్నముచేఁ గాని సంస్కారాతిశయం బుద్భవిల్లుటయందుఁ జిత్రంబు లేదు. అదియునుంగాక తొల్లి మనుజులకుం బోలె వీనికి వాక్స్ఫుటత యొప్పెఁగాని యగ్నిభట్టారక శాపంబువల నఁజిలుకలకు నస్ఫుటవాక్యంబును గరులకు జిహ్వాభ్రమణంబును సంప్రాప్తమయ్యెనని యమ్మంత్రి సత్తముండు వచించుచుండ నంత మధ్యాహ్న శంఖధ్వానంబు కర్ణగోచరంబగుటయు నమ్మహీధవుండు విసృష్టరాజలోకుండై లేచుచు. 43

సీ॥ మణికుట్టిమప్రణమన్మహీంద్రణరణా
యితకర్ణపూరనిస్స్రుతరవంబు
ప్రచలితజనపాదబాధాప్రసూనాప
హాయముత్పతదళీడారవంబు
"జయతు రాజే"తి శంసద్వంది మాగధ
వ్యాహారజనిత కోలాహలంబు
సదనముఖీభవచ్చామరగ్రాహిణీ
మంజీరయుగళైక శింజితంబు
గీ॥ చారుతరగేహకలహంసికారుతంబు
భాసురంబయి దశదిశావ్యాప్త మగుచు
నేకకాలంబునం దుదయించి శబ్ద
మయముఁగావించె నాస్థానమండపంబు.

సీ॥ అంతనృపుఁడును మాతంగకాంత ననిచి
శుకము నభ్యంతరముఁ జేర్ప నొకకరండ
వాహిని నియోగముం జేసి దేహమట్లు
పొదలు కతిపయహితులతో సదనమేగి. 45

వ॥ అపనీతాశేషభూషణుండై విగళితకిరణుం డగు దివస
కరుండుంబోలె విరాజిల్లుచుఁ గృతవ్యాయాముండై కంఠ
దఘ్నంబగు జలద్రోణీసలిలమం దవగాహనముం బొవ
రించి నిర్వృత్త సకలక్రియాకలాపుండై మృష్టాన్నం
బులఁ గుడిచి కూర్చుండునంతఁ బ్రతీహారి కృతాహారం
బీకీరంబని పంజరంబుఁ దనముం దుంచి యేగిన. 46

కం॥ మనుజేశుఁడు చిలుకం గను
గొని యాహారంబు సిగ్గుఁగొనక కుడిచితే
యనుడు శుకం బను భోజన
మున సిగ్గా? కంఠదఘ్నముగఁ దింటి నృపా. 47

ఉ॥ త్రావితిఁ దృప్తితీఱఁగ ముదంబున జంబురసంబు ద్రా
క్షలన్, లావుగఁ గ్రోలితిన్ హరిదళత్కరికుంభజ రక్త
సిక్త ము, క్తావదతిప్రభంబులగు దానిమగింజల మెక్కి
తిన్ ధరి, శ్రీవర యొక్కటేమి! యిఁకఁ దింటి హితంబుగ
నున్నవన్నియున్. 48

వ॥ అని పలుకు చిలుక పలుకుల కడ్డంబుదగిలి యన్నరపా
లుండది యటుండనిమ్ము తావకాలాపంబులువినుకోలంది
నీవు నామనంబునకు విహంగమవేషధారివగు మహాపురు
షుండవుంబోలె దోఁచుచున్నాఁడవు. నాసంశయము
వారింపవే యని మెల్లమెల్లగ నిట్లనియె. 49

ఉ॥ ఎక్కడఁబుట్టితీవు, కులమెయ్యది శాస్త్రములెట్లువచ్చె నీ
కెక్కరణిఁ లభించె శ్రుతు లెవ్వరు నీతలిదండ్రు లేగతిఁ
జిక్కితి వీరిచే, నెటవసించెదు పూర్వమెఱుంగఁజెప్పుమా
పక్కలరేఁడ! ప్రాయమెదొ పంజరబంధమెటుల్ ఘటిల్లెనో

క॥ అనియిట్లు తేటతెల్లము
గనడుగ నరపాలుతో శుకంబను రాజా!
వినఁదలఁతువేని నుడివెద
వినుమాయని యిట్లు విన్నవింపఁ గడంగెఁ. 51

చ॥ వెలయు జగత్ప్రసిద్ధమయి వింధ్యమహాటవి యేలకీలతా
వలయితమై రమామణికి వాసగృహంబులభంగినొప్పు ని
స్తులఘనకుంజపుంజములతోఁ దులఁదూఁగుచునెప్పుడుఁ మునీ
శులకును నిల్వనీడయగుచుఁ ధరకుం దిలకంబుకై వడిఁ.

గీ॥ జానకియుఁబోలె యామినీచరగృహీత
యును ప్రసూతైకకుశలవయునుగఁ జూడఁ
దనరు నెంతయు నామౌనిజనవితాన
విమలసురవల్లి వింధ్యాటవీమతల్లి. 53

చ॥ అనుపమమైన యయ్యడవియందుఁ జెలంగుఁద దేకదేశమై
వనకరిదానతో యపరివర్ధితపాదపమౌచు దండకా
వన మలనందనంబుసరి వాసిగ నందున దూరతోఁ వ్రజ
త్కనదతిథిశ్రమంబగు నగస్త్యమహాశ్రమమొప్పునొక్క [డన్

సీ. దశరథునాజ్ఞ భూతనయతో నెచట సౌ
ఖ్యముగ రాముఁడు చిరకాలముండె
విటపాంతరితపాండువిహగసాలము లెందుఁ
దాపసానలధూమతతిగఁ గ్రాలు

సుమములు కోయుభూసుతపాణిరుచి సోఁక
నాఁగ నెఱ్ఱబాల రాగ మొప్పఁ
గుంభసంభవనిపీతాంభోధిజల మెందు
సమవాంతమన జలాశయము లమరు

గీ॥ ఊఱుము విని యెందు రామచాపోరురావ
మనుచుఁ దిరుగును దెసలఁగన్గొనుచుఁ దృణము
మెసవక యె సీతపెంపుడుముసలి లేండ్లు
తరమె యయ్యాశ్రమము నెన్న ధరణినాథ! 55

వ॥ అయ్యాశ్రమంబున కనతిదూరంబున. 56

కం॥ భాసుర శబరీ ఘనకుచ
వాసితచందనపరాగబహుసురభిళమై
వాసిఁ దనరారుఁ బంపా
కాసారము ఫుల్లకుముదకల్హారంబై. 57

గీ॥ వనధియని తోయముం ద్రావవచ్చినట్టి
నీలమేఘంబులట్లు కాన్పించు విపిన
మదగజంబులచేఁ బీయమానమగుచు
వరలుచుండెడు నాసరోవరము భూప. 58

గీ॥ అట్టి పంపకుఁ బశ్చిమమందు రామ
చంద్రబాణప్రహారజర్జరితతాల
సాలశకలంబుగల ప్రదేశంబుచెంత
వెలయు మినుఁదాఁకుశాల్మలీ వృక్ష మొండు. 59

కం॥ సకల మహీజములకు నా
యకమై యావృక్షమమరు నాశ్రితశుకజా

లకమై దుర్యోధనుగతిఁ
బ్రకటీకృతశకునిపక్షపాతంబగుచున్. 60

చ॥ గురుతరమైన యవ్విటపికోటరకోటులయందుఁ బల్లవాం
తరములయందు శాఖలవితానములందును సకంథ
సంధులం, దురువిడితో దిగంతములనుండి యటన్ జను
దెంచి డెందమం, దరమరికంబుఁజెందక విహంగము
లందు వసించు భూవరా. 61

ఉ॥ అందొక జీర్ణకోటరమునందు నిజాంగనతోడఁ గూడి
యా,నందముఁ జెందుచుండు శుకనాథున కే జనియించి
నాఁడ నే, మందును బైనివృత్తము జనాధిప! నన్ గను
దుం బ్రసూతిబా, ధం దలి వోయె; బాలుర కథోగతి
యింతటికన్న నున్నదే? 62

గీ॥ అభిమతనిజాంగనానాశ మమితదుఃఖ
జనకమయి బాధయిడిన నాజనకుఁ డెట్ట
కేల కది నిగ్రహించి యకించిదాత్మ
జాతవాత్సల్యమున నన్ను సాఁకఁ దొడఁగె. 63

కం॥ కదువృద్ధుఁ డగుటచే నె
క్కడకుం బోలేక శుకముఖంబులఁ గ్రిందం
బడిన ఫలశకలముల నా
కిడి మద్భుక్తావశిష్టమే తినుఁ దానున్. 64

వ॥ ఇట్లుండ నంత నొక్కనాఁడు. 65

గీ॥ ప్రాత రరుణితుఁడై నిశాపతియు గగన
కమలినీమధుర క్త పక్షపుటమైన

సవిరహాంసంబువలె నభ స్తటినిపులిన
తలమునందుండి యపరాబ్ధి తలము దిగుడు. 66

గీ॥ పద్మరాగశలాకికాభాసమాన
శోధినిం జిమ్మివేసిన సుమములట్లు
చండకిరణగభస్తి సంచయముచేఁ ది
రస్కృతంబయ్యె నంతఁ దారాగణంబు. 67

సీ॥ చక్రవాకంబులు సంతోషముంగాంచెఁ
జిల్లఁగాఁ దెమ్మెరల్ సంచరించెఁ
బంకేజములు ప్రభాభాసమానములాయెఁ
గుముదముల్ నిజకాంతిఁ గోలుపోయెఁ
గలకంఠకాకలీకలరుతుల్ విలసిల్లె
దెసలు దీర్ఘంబులై తేజరిల్లెఁ
జంచరీకంబుల ఝుంకారములు సాఁగె
ఘోరసంతమసంబు గుహల డాఁగె।

గీ॥ జారులకుఁ జోరులకు సంతసంబు మాసెఁ
గుక్కుటరూకూ యటంచును గోళ్ళు గూసె
రాజవీథి జనప్రచారంబు హెచ్చె
భానుబింబంబు నుదయాద్రిపైకి వచ్చె. 68

వ॥ అంత. 69

సీ॥ ఈప్రాంతముననుండి యేతెంచు గజయూధ
పతిలులితాబ్జినీ పరిమళంబు
ఇట వినవచ్చు మృగేంద్ర నఖచ్ఛిన్న
ఘనకుంభికుంభ ఘీంకారరవము

ఇటనుండి వెల్వడు నటవీలులాయ శృం
గాకులీభూత వల్మీకధూళి
ఈదారిఁ గనిపించు నియ్యదే మృగముఖ
విగళితరోమంథ ఫేనవితతి
గీ॥ అవిగో వనకిటియూథంబు లవిగో పులులు
సింగములు నవిగో విండ్లుచేతఁ గొనుఁడు
శుకకులను నుసిగొల్పుఁ డాదిక్కున కను
వేఁటరుల కలకలముల వింటె నృపతి. 70
చ॥ అనుపదమట్లు వారు మృగయారతులై తడవిండ్లుపూనియ
వ్వనకరులన్ మృగేంద్రముల వ్యాఘ్రములన్ బరిమార్పఁ
బూనుడున్, ఘనశరజాలపీడిత మృగధ్వనులన్ వనమెల్ల
మాఱుమ్రోఁగ,గిన యటులయ్యెఁబో యొక మొగిన్ గనువా
రికి విస్మయంబుగన్. 71
గీ॥ అంత నచిరంబులో మృగయావిహార
మంతమందుటయును మథనావసాన
వనధివలె నిశ్చలంబగు వనమునందుఁ
గలకలనిమిత్త మేమని కాంచునంత. 72
చ॥ అరుణభయాగతోరుతమమట్లు సెలంగుచు నాఁడు రా
ముచే, దురమున నీల్గినట్టిఖరదూషణముఖ్యులిటుల్ పిశా
చ భీ,కరతనులౌచువచ్చిరనఁగా నటువచ్చుపుళిందసైన్య
మున్, నరవర! చూచితిన్ భయమునన్!బయిప్రాణము
పైనఁబోవఁగాన్. 73
గీ॥ వారినడుమను నడియాడువాని బండి
కందెనకుఁదుల్యమా దేహ కాంతివాని

నతికిరాతబలాన్వితుఁ డైనశబర
రాజుఁగనుఁగొంటి యమధర్మరాజుఁబోలె. 74

క॥ జనదూషితు మాతంగకుఁ
డను పేరంబరఁగునామహాకిల్బిషునిన్
గనుఁగొనుడు నా కదేమో
మనమున నీలాగుదోఁచె మానవనాథా. 75

సీ॥ వ్యాపారమా? మృగవ్యాపాదనోద్యోగ
మశనమా? మద్య మాంసాదికంబు
మిత్రంబులా? యపవిత్రంబులౌ విండ్లు
రాజ్యమా? నిర్జనారణ్యసీమ
భార్యలా? బంధితపరకళత్రంబులు
సహకారులా? విషసాయకములు
సహవాసమా ? సింహశార్దూల యూధంబు
భూషలా ? భీషణ భోగిమణులు

గీ॥ పరిచితంబు వరాహకుక్కురకులంబు
కావ్యపాఠాధిగమము సృగాలరుతము
వీరిజీవిత మతిమోహవిలసితంబు
హో యనుచు నేను మదిఁ దలపోయుచుండ. 76

గీ॥ అవిరత వివృత్తచిరమృగయాప్రయాస
మపనయింపఁగ శబరసేనాధిపతియుఁ
జేరి యాశాల్మలిని బరివారసీయ
మానమృదుపల్లవాసనాసీనుఁడగుడు. 77

వ॥ అందొకశబరయువకుండు తదాజ్ఞప్తుండై జలంబు తేరఁ
బంపాసరోవరంబు దరిఁజేరి. 78

చ॥ కలువలఁదమ్మిక్రొవ్విరులఁ గన్నులపండువు సేయుచున్
విని, ర్మలమయి మౌక్తికప్రకరమా యనిపించెడు నమ్మ
హాసర, స్సలిలముఁ గ్రోలి యొక్కజలజంబుఁ బుటంబు
నుగా నొనర్చి త, జ్జలమును దెచ్చినన్ శబరసైన్యనియం
తయుఁ ద్రావి తృప్తుఁడై. 79

ఆ॥ అచటినుండి యెటకు నైనఁ బోవఁదలంచి
యుపగతక్షుధాప్రయాసుఁ డగుచు
నంతరితపిపాసులగు పుళిందులతోడ
నిష్టమైనచోటి కేగుటయును. 80

క॥ అందొక జరత్పుళిందుం
డందఱితోఁ జనక యామహాతరువునకుం
గ్రిందనె యుపవిష్టుండై
యందఱునుం జూపుమేర కరిగినపిదపన్. 81

గీ॥ వారు మాంసంబుఁ దనకీని కారణమున
నాఁకలికిఁదోడు నెండయు నధికమగుటఁ
గడుపులోనికిఁ బెండలకడనె చూచు
కొందమని యామహీజంబుచెంత మరసి. 82

ఉ॥ అంబరచుంబియై దెసలనాక్రమణం బొనరించు నమ్మహీ
జంబును నెక్కి యొక్కనిముసంబున నుత్పతనంబునందశ
క్తంబగు కీరసంతతి సుఖంబుగ గూండ్లనుగూరుకుపక్షిసం
ఘంబునపత్యముం బిశితకాంక్ష నసంఖ్యముగాఁగఁ జం
పుచున్. 83

క॥ చండబలుండై రెండవ
దండధరునివగిదిఁ బక్షితతిఁగూల్చుచు మా

దండకు నరుదెంచెదు నా
చండుంగని భయముఁజెంది జనకుం డంతన్. 84

సీ॥ ఎక్కడవచ్చె నీయుక్కువుండని యెంచుఁ
జేయునదేమని చింతఁజెందు
ఎటుచప్పుడైనను నిటునటు వీక్షించు
దైవవిధికి నాత్మఁ దల్లడిల్లు
ఎటుపోదు రక్షింతు రెవ్వరంచుఁదలంచు
దీనముఖంబుతో దెసలు చూచుఁ
బ్రాణభయంబుచేఁ బరువెత్త నుంకించు
నను నొంటరిగఁజేసి చనఁగ వెఱచు

గీ॥ అట్టు లేమియుఁదోఁచక యాలసించు
జనకుదరిఁజేరి యాజరచ్ఛబరుఁ డపుడు
దత్తచంచూప్రహారుఁడై తండ్రిఁ జంపి
భూమిపైఁబడ వేసె నధోముఖముగ. 85

వ॥ నేను నదివఱకే కిరాతుభయంబునఁ దండ్రిఱెక్కలనొదిఁ
గియుండుటంజేసి. 86

గీ॥ ఇంతకును భూతలంబునఁ గొంతకాల
ముండవలసినగీఁత నాకుండుకతన
వాఁడు గనకుండ నొకశుష్క పత్రరాశి
మీఁదఁబడితిని దండ్రితో మేదినీశ. 87

గీ॥ అట్లుపడి వాఁడు దిగివచ్చు నంతలోన
వచ్చిరానట్టిఱెక్కల వడి నెగురుచు
మృతుఁడయినతండ్రి వీడి దుర్మతివిధంబు
చేరితిఁ దమాలవృక్షంబుచెంత కపుడు. 88

చ॥ అతఁడు మహీరుహంబుడిగి యవ్విహగంబులఁ ద్రాటఁ గట్టి
యు, న్నతగతిఁ గొంచు నాశబరనాథుఁడు పట్టినదారిఁ
బట్టఁగా, బ్రతుకుము జీవుఁడాయనుచుఁ బ్రాణభయంబు
తొలంగఁగాఁ బిపా, సితుఁడయిపోతి నొక్కసరసీదరిసిం
చి జలంబుఁ గ్రోలఁగాన్. 89

ఆ॥ పడుచు లేచు చట్లు బాల్యంబుచే గడ్డి
పఱక చప్పుడైన నెఱుకు వచ్చు
ననితలంచునాకు నంతరంగంబున
గోచరింపఁదొడఁగెఁ గొంతయిట్లు. 90

క॥ ధర సర్వప్రాణులకుం
బరమాభీష్టంబులెన్నఁ బ్రాణంబులె యే
దురవస్థనేని జీవిత
నిరపేక్షత్వంబు గలుగనేరదు కంటే. 91

చ॥ ననుఁగని తల్లిపోయిన మనంబున శోకభరంబుడాఁచి నా
కునునయి యష్టకష్టములకున్ గుఱియయ్యును నాఁటి
నుండి యిం, దనుకను నన్నుఁ గాచినపితన్ ఖలుఁడొక్క
రుఁ డాగతిన్ వధిం, చిన మృతిఁ బొందకుంటి నిసి !
జీవితమే మది కిష్ట మయ్యెఁగా. 92

ఆ॥ తండ్రియగాను గన్న తల్లియే యగుఁగాక
గురుఁడెయగాను నిఁకెట్టి నరుఁడెయగాను
మఱవఁజేయు క్షణముమాత్రలో మనుజుల
జీవితాశ యేమి చేయనీదు. 93

ఉ॥ అక్కట యిట్టి కష్టదశయందున నన్నుఁ బిపాస యెక్కు
వై, స్రుక్కఁగఁ జేయుచున్నయది శోషయు వచ్చెదుఁ

గండ్లు గానరా, వెక్కడికేగుదుర్ సరసి యిక్కడికింకను దూరముండెనం, చక్కడికేగలేక తృష నక్కడనే పడి పోవనంతటన్. 94

కం॥ అచ్చటికిం జేరువ నొక
సచ్చారిత్రుఁడు తపస్వి జాబాలి జనుల్
మెచ్చ నొక యుటజమున న
భ్యుచ్ఛ్రయముగ మునులతోడ నుండు నృపాలా. 95

కం॥ ఆతనికిఁ బుత్రకుఁడు హా
రీతుఁడు మాసేంద్రసుతపరీతుం డాపం
పాతీరమునకుఁ జెచ్చరఁ
జేతమలర మజ్జనంబుఁ జేయఁగవచ్చెన్. 96

కం॥ హారీతుఁ డట్లు చనుచున్
దారిన్ ననుఁగాంచి కూర్మిదనర మునులతో
నీరీతి ననె; నకారణ
కారుణికంబులు దలంప ఘనులమనంబుల్. 97

చ॥ కనుగొనుఁడిద్ది శ్యేనముముఖంబుననుండియొ చెట్టునుండియో, మునివరులారక్రిందఁబడె మూలుగుచున్నది దాహమొందనో, పును,వివృతంబొనర్చు మొగముర్గొనయూపిరితోడనున్నటుల్, గనఁబడెఁ గాచుటొప్పు నుదకంబిడి ప్రాణము పోకపూర్వమే. 98

కం॥ ఆపన్నులెందు ననుకం
పాపాత్రము లెవ్వరను వివక్షయొనర్పం
బాపంబు గాన దీనిం
జేపట్టుటె మనకు మంచిచెయిదం బనుచున్. 99

కం॥ పరిసరకాసారమునకుఁ
దర్వరఁ దర్వర నను గొంచు నరిగి తత్తోయ మిడన్
ధరణీశ! యేమిచెప్పుదు
నరిగిన ప్రాణములు వచ్చినట్లయ్యెసుమా. 100

శా॥ అంతన్ వారు శ్రమంబుపండెనని యత్యంతమ్ము హర్షించి యా,చెంతన్ నన్నొకచెట్టుక్రిందనిడి నిశ్చింతాత్ములై యందు వి,శ్రాంతిన్ స్నానమొనర్చి సల్పిరి యథాశాస్త్రంబుగా నష్టశ్రీ,మంతంబై తనరారు తత్తటమునన్ మాధ్యాహ్నిక ప్రక్రియల్. 101

వ॥ ఇట్లు హారీతుండును నివృత్తక్రియాకలాపుండై ధౌతవల్కలంబులం గొంచు మునికుమారులు వెంటనంటిరా నన్నుం గొనిపోవుచుండ. 102

ఉ॥ ఏలకు లల్లిబిల్లిగొని యెల్లెడలన్ దడిగట్టఁ దాలహింతాలతమాలమాలికలు దట్టములై దెస లావరించుచున్ నాలుగువైపులందుఁ దపనద్యుతి సోఁకఁగనీక క్రాల నింపైలసమానమైన యొకయాశ్రమమున్ గనుగొంటి నచ్చటన్. 103

సీ॥ మలినత హోమధూమంబులందునఁగాని
చరితలం దెందు గోచరముకాదు
రాగంబు రాజకీరముఖమందునఁగాని
పరకళత్రములపై నరయరాదు
పక్షపాతము కృకవాకులందునెకాని
వాదంబులందున వలనుగాదు

కుచము లంటుట హోమగోవులందునె కాని
కామినీమణులందుఁ గానరాదు
గీ॥ శకునివధ భారతంబునఁ జదువఁబడునె
కాని యీభూమియం దెందుఁ గానరాదు
మానవాధీశ! యీ యాశ్రమంబుమహిమ
స్తుతియొనర్తునె పక్షిమాత్రుండ నేను. 104

ఉ॥ ఆలలితోటజంబున మహామహులుత్తము లెందఱెందఱో
యోలి మునీశ్వరుల్ గొలుచుచుండఁ దపంబొనరించు
చుండు జా, బాలి నిరంతరార్చితకపాలిఁ బదాంబురు
హాఽఽపతజ్జటా, మాలి దయోర్మిమాలి వనమాలిని
గన్గొంటి భూవరా. 105

కం॥ ఎల్లమునుల్ గొలిచెడు ముని
తల్లజు జాబాలిఁగన్న తత్క్షణమే నా
తల్లిం దండ్రిం గనిన
ట్లుల్లంబునఁ దోఁచె మిగుల నుర్వీనాథా. 106
గీ॥ తలఁప భావిశుభోదయాదర్శనములు
ప్రాగ్జనుష్కృత పుణ్య సంస్పర్శనములు
మానసోత్సాహ రుచిపరామర్శనములు
ధరణిలోపల సజ్జనదర్శనములు. 107
సీ॥ సంసార జలధికి సంతరణోడుపం
బాశాంబుధికి బడబానలంబు
మోహాగాధధ్వాంతమునకు మార్తాండుండు
క్షమకు సత్యమునకు జన్మభూమి

విస్తృత తృష్ణాటవికి గండ్రగొడ్డలి
ధర్మంబులకు మార్గదర్శకుండు
శాస్త్రరత్నములకుఁ జక్కని యొరరాయి
యహితగ్రహముల కస్తాచలంబు

గీ॥ మూల ముపశమమను మహాసాలమునకు
సంశ్రయం బార్జవమునకు సత్వమునకు
వధనమం దేమి యీబ్రహ్మ వర్చసంబు!
సము లె తక్కొరు లీమునిచంద్రమునకు. 108

కం॥ ఏమీ వీరిమహత్త్వం
బామోదాకరము నద్భుతాకరమును నౌ
నీమహి సహజారిమృగ
స్తోమంబులు నిందుఁ బరఁగు సుహృదుదయముతోన్. 109

మత్త॥ మూఁగియొక్కెడ బెబ్బులుల్ ద్వీపముల్ మృగంబులు
నాడెడున్, నాగముల్ మృగరాజజూలు మృణాలబుద్ధిని
లాగెడున్, వీఁగియాడక మౌనముంగొని వీఁకవల్కల
మూనుచున్, యోగివృత్తిని బొల్చుచుండు ననోకహం
బులు సైతమున్॥ 110

వ॥ అనితలపోయుచుండఁగనే హారీతుండు నన్నొక తరు
చ్ఛాయయందు డించి తండ్రికిఁ బ్రణమిల్లి తదనతిదూరం
బునందు కుశాసనంబునఁ గూర్చుండ నందలిమునిమండ
లంబు మదుదంతశ్రవణకుతూహలంబై యెక్కడి
దీ శుకశాబకం బనుడు. 111

శా॥ హారీతుం డను నేను నీవటులు స్నానార్థంబుగాఁ బద్మాకా
సారంబుం దఱియంగఁ బ్రాంతధరణీజభ్రష్టమై క్లిష్టమై

దూరాపాతవిశీర్ణసంధియుతమై దోదూయమానాంగమై
నోరున్ విప్పుచు దప్పిసొలసి కనుఁగోనయ్యె మాకయ్యెడన్.

ఆ॥ దానిదప్పి దీర్చి తద్భూరుహము దురా
రోహమగుట గూడు రోసి యంద
చేర్చ నలవికామిఁ జేకొనివచ్చితి
దీనరక్షణంబు తెరువటంచు 113

కం॥ అక్కలు వచ్చుదనుక నీ
చక్కన మునిసుతులు ఫలరసంబులఁ బెనుపన్
రెక్కొని యట్టిపై ననువగు
నిక్కకుఁ జనుఁగాక యనుచు నిటఁ జేరిచితిన్. 114

ఆ॥ అనుచుఁ జెప్పుచుండ నాలించి జాబాలి
మౌని నన్నుఁ జూచి మరల మరల
ఆత్మకృతమయైన యవినయఫలమిది
యనుభవించుచుండె ననుచుఁ బలికె. 115

చ॥ అతఁడు తపఃప్రభావయుతుఁ డద్భుతశక్తి త్రికాలవే
దియున్, గతము వచించు భావిగతిఁ గన్గొనినట్టులె
సెప్పు నామహా, మతికిఁ గరస్థలస్థము సమస్తము కావున
మౌనిబృంద మా, కత మొదలంట వింట కతికౌతుకియై
ముని వేఁడ నిట్లనున్. 116

కం॥ ఈకథ యత్యద్భుత మిపు
డో కాలములేదు స్నానమొనరింపఁగనౌ
మీకు మునులార హరిపూ
జా కాలము మించుచుండె సలుపుఁడు విధులన్. 117

శా॥ మీయుత్సాహము వ్యర్థపుచ్చఁ జనుఁడీ మీయాహ్నిక
ప్రక్రియల్, చేయుం డీశుకవృత్త మాపయి నితిశ్రీదాఁక
విన్పింతువి, చ్చేయుండోగిర మిందుచిల్కకిదియుఁ జిత్తం
బులోఁ బ్రాగ్జనుః, స్వీయోదంతము సాంతముం దలఁచు
వాసిఁ స్వప్న వృత్తంబటుల్. 118

వ॥ అని పల్కుచునే భగవంతుండగు జాబాలి లేచి మునుల
తోన స్నానాదికం బాచరించి యుచితదినకృత్యము
లొనర్ప నంత దివసంబు పరిణతమయ్యె. 119

గీ॥ మౌని జనములు కొలఁకులఁ దానమాడి
యర్ఘ్యవిధియందు నర్పించినట్టిరక్త
చందనంబును మేన నలందికొనియె
నేమొ యన భానుమండల మెఱ్ఱఁబాఱె. 120

గీ॥ ఆననము లెత్తి సూర్యు నేకాగ్రదృష్టిఁ
గనెడు నూష్మపులా తపోధనులచేతఁ
బీయమానప్రభాసముదాయుఁడనఁగ
హేళి విరళాతపుండయి తూలెఁ గాంతి. 121

గీ॥ భానుకిరణంబు లప్పు డంబరము వీడి
పద్మినీకాననంబులఁ బాదువెట్టి
శకునిగణమటు దివసావసానమందుఁ
జేరెఁ దరులయు గిరులయు శిఖరములను. 122

గీ॥ పర్వి జరఠారుణాతపప్రభలతళుకు
భూరుహము లాశ్రమములఁ దపోధనావ
లంబితకషాయవస్త్రంబులఁ ధరించి
క్రాలెనోయన నొక క్షణకాల మొప్పె. 123

గీ॥ అంతటన్ సూర్యభగవానుఁ డస్తమింపఁ
బశ్చిమాంభోధిఘనతటభాగమందు
నుల్లసిలువిద్రుమద్రుమ వల్లినాఁగ
సంధ్య లోచనపర్వంబు సలుపఁదొడఁగె. 124

వ॥ అప్పు డయ్యాశ్రమంబు. 125

కం॥ ఆరచితధ్యానపర
స్త్రీరంబున్ దుహ్యమానధేనూరుపయో
ధారాధ్వానము మునిబృం
దారక కృతదిగ్బలీడితమునై యొప్పెన్. 126

ఆ॥ పోయి యెటకొ ప్రొద్దు పోవ నింటికిఁ బారు
దెంచుకపిలహోమధేనువట్ల
లోచనములు దనియ లోహితతారక
యైనసంధ్యఁ గాంచి రఖిలమునులు. 127

చ॥ ఇనుఁడు ప్రవాసియౌట వగ హెచ్చఁగఁ బద్మిని పద్మకు
ట్మలం, బను జలకుండిఁబూని భ్రమరావళిపేరిటి యక్ష
మాల కైఁ,దనర మరాళధౌతపరిధానయు బాలమృణాల
యజ్ఞసూ, త్రిణియుఁగఁ జూడనొప్పెను బతిన్ గలయన్
వ్రత మూనెనోయనన్. 128

గీ॥ భానుఁ డపరాబ్ధిఁ బడుడుఁ దత్పతనజవస
ముత్థితాంభఃకణములట్టులొప్పి మింట
వెలసెఁ దారలు విప్రోర్ధ్వవిప్రకీర్ణ
వారి నన సంజకెంజాయ జారె నంత. 129

వ॥ అంతఁ గ్రమంబుగఁ జంద్రోదయమగుడు. 130

క॥ వరచంద్రభాసి నభమును
పరమేశ్వరు శిరమునుండి పాఱెడుగంగా
ఝరియన జలధుల నింపుచు
విరివియయి మరాళధవళ వెన్నెల యొప్పెన్. 131

వ॥ అప్పుడప్పుండు వెన్నెలలో నర్ధయామమాత్రన్యూనంబగు రేయి హారీతుండు కృతాహారంబనగు నన్నుఁగొని మునిమండలంబు వెంటరా రేయెండగాయు తత్తపోవనైకదేశంబున వేత్రాసనోపవిష్టుండును జాలపాదుండను ఛాత్రునిచే ధవిత్రోపవీజ్యమానుండునగు జనకుఁజేరంజని నమస్కరించి. 132

క॥ జనకా! మునిమండల మిదె
చనుదెంచెను శుకచరిత్రసంశ్రవణేచ్ఛన్
గొనెఁ జిలుకయు నాహారం
బనఘా! యేతచ్చరిత్ర నానతియీవే. 133

వ॥ అనుటయు. 134

క॥ అథరాపుర వంశాంబుధి
విధుసదృశశ్రీనివాసవిద్వత్స్రమా
దధిగతసాహిత్యా! సుదృ
ఙ్మధురాధరసమతిశాయి మంజులఫణితీ. 135

మ॥ మతివాచస్పతి! ధీరతావసతి! ధీమన్మౌళిగోష్ఠీసువ
ర్ణితలోకేశసతీపుమాకృతి! హయగ్రీవప్రసాదాత్తశా
స్త్రతతీ! చిత్రశతావధానకలనాసంతోషితానేకభూ
పతీ! విద్వద్వరవిద్విషత్కకవిదృప్యత్కుంభిహర్యద్ధతీ!

మాలిని॥ మహితగుణధురీణా! మధ్వశాస్త్రప్రవీణా!
కుహాకజననివర్తీ! కుందమందారకీర్తీ!
బహుజననుతిపాత్రా! భాసురాంచచ్చరిత్రా!
విహితమహితపుణ్యా! విద్వదీశానగణ్యా! 137

గద్య॥

ఇది శ్రీకాశ్యపగోత్ర జగన్నాథాచార్యపుత్త్ర
సకల విద్వద్విధేయ పూర్ణప్రజ్ఞ
నామధేయ ప్రణీతం బగు
నాంధ్రకాదంబరియందుఁ
బ్రథమాశ్వాసంబు
సంపూర్ణము.

ఓమ్

శ్రీ హయగ్రీవాయ నమః.

# ఆంధ్ర కాదంబరి

## ద్వితీయాశ్వాసము

శ్రీనిలయ విజయనగర మ
హీనాథానందగజపతీంద్ర సభాస
మ్మానితభీమాచార్యా
హీనకృపాపాత్ర సంగమేశ్వరశిష్యా ! 1

వ॥ దేశికోత్తమా ! అవధరింపుఁడు. జాబాలి మునీంద్రుండు తక్కుమునులకు విన్నవించినలాగున వైశంపాయనుండు శూద్రక మహారాజుతో నావలి కథ యిట్లు నుడువఁ దొడఁగె. 2

శా॥ సిప్రాశైవలినీతటాంతికమునం జెన్నొందు వైమానిక
క్షిప్రత్వప్రతిబంధకీభవదురుశ్రీకాలయానీకమై
సుప్రాభాతికవాతపోతచలనాస్తోకంబు నభ్రంకష
ద్వప్రం బుజ్జయినీపురంబు గిరిజావామాంగు నావాసమై.

క॥ అందుం బూర్వ నృపతులకు
సిందూరపుఁదిలక మట్లు చెన్నొందెడు సం
క్రందనతుల్యుం డొక నృప
నందనుఁ డున్నతికి నంగనందనుఁ డగుచున్. 4

శా॥ కావేయంబున భర్తపై రతి కడుం గన్నీరు మున్నీరుగా
వాపోవం గరుణార్ద్రచిత్తుఁడయి యాభర్గుండు తత్కాంత ని
స్తాపం జేయఁగ నవ్యసృష్టసుమకోదండుండునా నొప్పు నా
భూపాలాభరణంబు సద్గుణవయోభూషావిశేషాదులన్. 5

క॥ పోఁడిమి నీ నరపాలుని
యీడెవ్వ రనంగ ధాత్రి నెసఁగుచు తేఁడై
తేఁడులు గొలువన్ దారా
పీడుం డన నొప్పు నతఁడు భీమబలుండై. 6

గీ॥ అతఁడు రాజ్యంబుఁ జేసెడు నవసరమున
నేమియననొ వయః పరిణామునందు
దండధరణంబు మాటి భారతంబునందుఁ
దప్ప దుశ్శాసనాపరాధంబు లేదు. 7

గీ॥ ఆగుణాబ్ధికిఁ గుడిభుజం బట్లు తనరి
శైశవమునుండి యుపజాతసౌహృదుండు
అమరపతికి బృహస్పతి యట్టివాఁడు
చెలఁగు శుకనాసుఁ డను మంత్రిశేఖరుండు. 8

ఉ॥ ఆ మహినేత బాల్యమునయందె మహాబలుఁ డౌచు రాజ్య
ల, క్ష్మీమహితోపధానమయి మించుభుజాయుగళంబు
తోడ నీ, భూమిసమస్తముం గెలిచి భూరిగుణుండును

గార్యనిర్ణయో, ద్దాముఁడు నొ ప్రధాని కిడి తా నల
సర్వము రాజ్యభారముఁ. 9

గీ॥ ప్రశమితాఖిలశత్రుఁ డ ప్పార్థివుండు
ప్రజల ననురక్తు లగునట్లు పరిఢవిల్లఁ
జేసి తాఁ గృతకర్తవ్యశేషుఁ డగుట
ననుభవింపఁగఁ బూనె యౌవనసుఖంబు. 10

చ॥ ఉరుగతినొక్కవేళను బయోధరచందనచూర్ణతత్పితో
త్తర ఘనవీచిమాలము, నితంబమహోదృఢఘట్టనాతి జ
ర్జరితతరంగ రంగమును సల్పెను దీర్ఘికలందు నీరముఁ
గరము నిదాఘకాలములఁ గాంతలతో జలకేళిఁ దేలుచుఁ.

గీ॥ రమణి గండూషశీధుధారల నొకప్డు
డావకుళ మట్టుల వికాస మంది వెలయు
నొకపరి యశోక మట్లు లక్తకరసాఢ్య
కామినీపదహతిని రాగము వహించు. 12

సీ॥ పంచాస్యమ ట్లొక్కపరి లంబకేసర
మాలుఁడై గిరులందుఁ గేళి సలుపు
మధుకరమ ట్లొక్కమాఱు ఫుల్లసుమాభి
రామ లతామందిరములఁ దిరుగు
మత్తేభమ ట్లొక్కమాటు గండోత్ప్లుత
త్కర్ణపల్లవుఁ డౌచుఁ గానఁ జొచ్చు
అంచయై వడి నొక ప్డా క్వణన్నూపుర
స్వననందియై పద్మవనుల నడుచు

గీ॥ బహుళపారావతాంచితవలభు లైన
సౌధతలములఁ గతిపయచతురమిత్ర

జనములం గూడి ప్రేయసీజనము మెచ్చ
వేణువీణాది గానముల్ విను నొకప్డు. 13

గీ॥ పరిసమాప్తాఖిలావనీభారుఁ డగుటఁ
జీఁకుఁ జింతయు లేక యా క్షితివరుండు
ఏది యభిమతమో మది కేది యింపొ
యట్టి భోగంబు లన్నియు ననుభవించె. 14

క॥ పరితోషిత లోకునకుం
గరముఁ బరిసమాప్తరాజ్యకార్యుం డగు నా
నరపతికి విషయభోగ
స్ఫురణంబులు భూమలగుచుఁ బొలుచుం గాదే. 15

గీ॥ ఎంత భోగేచ్ఛ కలవాఁడయేని నతఁడు
నరుల యనురాగవృద్ధికై నడుమ నడుమ
నెల్లవారికి దర్శన మిచ్చుచుండు
నక్కఱల సింహపీఠిపై నెక్కుచుండు. 16

మ॥ శుకనాసుండును స్వీయబుద్ధిబలముం జూపించి నానానృపా
లక దీవ్యత్కమనీయ మౌళిమకుటాలంకారరత్నచ్ఛటా
ప్రకటాత్మీయపదాంబుజాతుఁ డయి భూభాగంబునుర్జ
గీరుతుల్, కకుబంతంబులు నిండ నేలె ధరణీకాంతుండు
లో మెచ్చఁగన్. 17

వ॥ ఈపగిది మంత్రినివేశిత రాజ్యభారుండై యౌవనసుఖంబు
లనుభవించు నా రాజన్యునకు. 18

సీ॥ ఇట్లు చిరకాల మొకరీతి నేగుపిదప
నఖిల సౌఖ్యంబులకు నంతమయ్యెఁ గాని

తనయవదనాంబుజాత సందర్శనా త్త
కుతుక మొక్కటియే సమకూరదయ్యె. 19

ఆ॥వె॥ నిష్ఫలప్రసూన నిత్యదర్శన మైన
శరవణంబు పగిది ధరణిపతికి
ననుదినానుభూత మయ్యె నంతఃపురం
బధిక తాపహేతు వయ్యె నంత. 20

సీ॥ ధరణీపతి సహస్రపరివారయుతుఁ డయ్యు
నసహాయునిగఁ దన్ను నరసి కుందు
శ్రవణాంతవిస్తృత చక్షురంబుజుఁ డయ్యుఁ
దన్ను జాత్యంధుఁగాఁ దలఁచి రోయు
అఖిలలోకాధారుఁ డయ్యు నిరాధారుఁ
గాఁ దన్నుఁ దలపోసి కడుఁ దపించు
నిత్యలక్ష్మీసమన్వితుఁ డయ్యుఁ దన్నుఁ దా
గతిలేనివానిఁగా మతిఁ దలంచు

గీ॥ బ్రతికియుండియు జీవచ్ఛవంబ ననుచు
మనసులోఁ బ్రత్యహం బనుకొనుచు నుండు
నట్ల యనిపించుఁ బో జగమందు నెందు
నైన ననపత్యుఁ డైనట్టి వాని కకట!॥ 21

గీ॥ మానససరస్సునకు హంసమాలపగిదిఁ
బంకజారికిఁ గౌముదిపగిది భూప
ణంబు నంతఃపురప్రధానంబు నగుచు
వరలు నాతేనికి విలాసవతి యొకర్తు. 22

వ॥ ఒక్కనాఁ డా ధరారమణుండు తదావాసంబున కేగిన
వాఁడై శోకమూకంబగు పరిజనంబుచేఁ బరివృతయును

సమీపమందు వృద్ధాంతఃపురాంగనలచే నాశ్వాస్యమాన
నయు ననవరతాశ్రుబిందుపాతార్ద్రీకృతయు ననలంకృ
తయు నగుదేవింగనుంగొని యవిదితశోకవృత్తాంతుండై

గీ॥ అరసి తన్నుఁ గృతోత్థాన యైనతరుణి
నానిబిడ మైన పర్యంకమంద యునిచి
తుడుచుచుఁ గపోలముల నశ్రుతోయములను
బలికె మెలమెల్ల నిట్లు భూపాలకుండు. 24

ఉ॥ మాటికి వామహస్తమున మస్తముఁ జేరిచి చన్నుఁగట్టుపైఁ
గాటుకవర్షముం గురియఁగాఁగనుఁ దామర లేలయేడ్చె దో
పాటలగంధ, లాక్షపదపద్మములందిడ, వేయలంక్రియా
కోటిధరింప, విట్లు మదిఁగుందుటకుం గతమేమి సుందరీ.

గీ॥ కంపితపయోధరాగ్రాంశుకంబు లగుచు
మలయు నీ దీర్ఘనిశ్వాస మారుతములు
రాగి యా పల్లవునిఁబోలె రమణి నాదు
మానసంబును వణఁకింపఁ బూనె నిపుడు. 26

ఉ॥ నేరము నేన చేసితినొ నీయెడ, నా యుపజీవివర్గమే
నేరమొనర్చెనో దెలియనేరకయుంటిని దీర్ఘదృష్టితో
నారయుచున్ననిక్కమిది యంబుజలోచన నీకు దుఃఖ
మే, తీఱునఁ గల్గెఁ దెల్పు త్వదధీనము సర్వము నాకుఁ
బ్రేయసీ. 27

వ॥ అని యిట్లు శోకనిమిత్తం బడిగియు నప్రాప్త ప్రతివచ
నుండై యా నృపాలుండు వెండియు నంతికంబున నతి
దీనాస్యలై యున్న ప్రియావయస్యలంగని తద్వృత్తాంతం

బడిగిన వారిలో మకరిక యను నొక తాంబూలకరండ
వాహిని తేనికి మందమందముగా నిట్లనియె. 28

క॥ దేవా! దేవరవలనను
నేవిధ మగు తప్పిదంబ యెఱుఁగదు మీకుం
దేవేరి యైన యీమెకు
నేవారికిఁ దప్పుసేయ నెంచెద రన్యుల్. 29

గీ॥ కాని యీ రాజవదనకుఁ గలదు చింత
యఫలభూపాలసంగమ నైతి నంచు
నెంతకాలంబునుండియో యింతకన్నఁ
గలిమి కల స్త్రీల కన్యదుఃఖంబు గలదె. 30

గీ॥ శయన మజ్జన భోజనాసనములందు
నైన మతికష్టమున వయస్యా ప్రవర్త్య
మాన యగుచుండియును భవన్మానసంబు
చింతఁగొను నంచు వెల్లడిసేయ దెపుడు. 31

వ॥ నేఁడు చతుర్దశీ తిథియగుటంజేసి మహాకాళు నీక్షింప భర్తృదారిక యట కేగుటయు నందు మహాభారతమున.

గీ॥ "నాస్తి సౌఖ్య మపుత్త్రస్య నాస్తి పుణ్య
గతి రపి శుభాశ్చ దివ్యలోకా న సంతి
అమనంతి హి జగతి ఘన్నామనరక
త్రాణనా త్పుత్త్ర"యని యిట్లు రాణి వినియె. 33

క॥ అది విని యేతెంచి గృహం
బెది చెప్పినవినద యన్నమేనిఁ దినద యే
సదలంకారము లొల్లద
బదులాడద యమిత దుఃఖపరవశ యగుచుఁ. 34

వ॥ అనియిట్లు మకరిక కలతెఱంగు విన్నవించి యనంతరంబు
దేవర చిత్తంబని విరమించిన నా నృపాలుండును ము
హూర్తకాలంబు తూష్ణీంభూతుండై వేఁడి నిట్టూర్పునిగు
డించి దేవివలను మోమై యిట్లనియె. 35

ఉ॥ మానిని యేల యేడ్చెదవు మాటికి మాటికి నెందు దేవతా
ధీనములైన కార్యములఁ దేఁకువ వీడి యిటుల్పొనర్తురే
నూనము పూర్వజన్మమున నోఁచఁగ లేదు కుమారుఁ జూడఁగా
దానికి నేమి చేయుదువు దైవము దాఁటఁగ నేరి శక్యమా॥

వ॥ ఐనను మనుష్యప్రయత్నంబునఁ జేయఁదగిన కార్యంబుల
నిర్వర్తించుట యస్మత్కర్తవ్యంబు గాన. 37

సీ॥ దేవతాపూజల ద్విగుణంబుగా సల్పు
తాపసార్చనల నాదరముఁ జూపు
గురువులపై భక్తిగుదిరి వర్తింపుము
సద్ద్విజశ్రేణుల సత్కరింపు
ఉపవాసములను యథోక్తంబుగాఁ జేయు
సుతదర్శనాప్తికై వ్రత మొనర్చు
బీదసాదల కెల్ల నోదనంబును బెట్టు
సూర్యగ్రణులకు శుశ్రూష సల్పు

గీ॥ అతిథులేతేర వేళకు నన్నమిడుము
అర్థిజనముల సంతోష మందఁజేయు
మానివర్యుల నెపుడు సన్మానపఱుపు
మిట్టులుండిన నిష్టమీడేఱవచ్చు. 38

గీ॥ వినమొకో చండకౌశికు వీక్షణమున
నల్ల మగధేశ్వరుండు బృహద్రథుండు

ఇందిరాప్రాణనాథు జయించునట్టి
సత్త్వవంతుని సుతు జరాసంధుఁ గనుట. 39

గీ॥ పరిణతవయస్కుఁ డయ్యును బార్థివుండు
దశరథుండు విభాండకతనయుకరుణ
విష్ణుభుజముల కైవడి వెలయు సుతుల
నలువురం గాంచి సుఖయించు నలరలేదె. 40

క॥ కాన నమోఘఫలంబగు
మానిజనపదార్చనంబు మానిని! చేయం
బూనుము జాగేటికి నీ
మానసమున నున్న కోర్కె మఱి యీడేఱున్. 41

ఉ॥ ఎప్పుడు గర్భభారమున నింపెసలారెడు నిన్నుఁ జూతు
నో, ఎప్పుడు పుత్త్రకుండు తొడనెక్కఁగఁ గాంతుక మంద
నేర్తునో, ఎప్పు డభీష్టసిద్ధియగు నెప్పుడు దుఃఖము తీఱిపో
వునం, చిప్పగిదిన్ సతంబు జపియించెదు నాకు గతించు
యామినుల్. 42

గీ॥ నన్నుఁగూడను దహియించు నిన్నెగాద
యకట యనపత్యతాభవమైన శోక
పావకం బేమిచేసెడి వాఁడ నైనఁ
బంకజాక్షిరో దైవమే ప్రతిఘటింప. 43

కం॥ కావున ధైర్యంబూనుము
వేవేగన్ మదిని జింత విడువుము ధర్మ
శ్రీ వెలయ నడుము ధర్మో
ద్భావుల కిష్టములు హస్తతలసంస్థంబుల్. 44

వ॥ అని యిట్టు వలికి యానరపాలకుం డభినవపల్లవముం
బోని నిజకరంబున జలంబుం గొని యాయిందీవరాక్షి
ముఖమార్జనంబుం జేసి వెండియు ననేకప్రియశతమధురం
బులును శోకాపనోదనచతురంబులును ధర్మోపదేశ
గర్భంబులును నగు కథలచే నామె నోదార్చి చిరకాలం
బందుండి చనిన విలాసవతియు నందీభూతశోకవేగయై
దివసకృత్యంబులం దీర్చి యదిమొదలు దేవబ్రాహ్మణ
పూజలయం దత్యంతబద్ధానురాగ యై. 45

క॥ ఎవరేమి చెప్పినను దను
భవత్తృష్ణం గష్ట మాత్మఁ బాటింపక యా
పువుఁబోఁడి చేసెఁ జెప్పిన
యవి యెంతురె కార్యదీక్షు లాయాసంబుల్. 46

సీ॥ బహుళగుగ్గులు ధూప పరమాంధకారమౌ
చండికాలయ మందుఁ బండుకొనియె
సకలరత్నచ్ఛటాసముపేతసౌవర్ణ
తిలపాత్రములు భక్తి ద్విజుల కొసఁగె
అశ్వత్థముఖ్య మహావనస్పతులకుఁ
జెలఁగి నిత్యముఁ బ్రదక్షిణ మొనర్చె
వాయసశ్రేణికి స్వయమ హస్తన్యస్త
పాత్రయై దధ్యన్నబలి యొసంగె

గీ॥ దివ్యసలిలంబులందునఁ దీర్థమాడె
ఓషధీసూత్రములఁ జేతి కొనరఁ దాల్చె
నొకటి యన నేటి కింకఁ బుత్రోపరిస్థ
మమత సర్వ మొనర్చె న మ్మచ్చకంటి. 47

వ॥ ఈరీతిఁ గొంతకాలంబు గతించిన నంత నొక్కనాఁడు,

గీ॥ మింటఁదెలవోయి చుక్కలు మిణుకుమిణుకు
మనుచు నుండఁగ నట్టి యల్పావశేష
మైన యామినిఁగలను భార్యాముఖంబుఁ
జొచ్చు సంపూర్ణచంద్రుని జూచె ఱేఁడు. 49

క॥ చూచి ధరణీమహేంద్రుం
డా చిత్రమ్మునకు నాత్మ నలరుచు మంత్రిన్
వే చేరఁగొని సుధాస
ధ్రీచీనోక్తులను గలను దెల్లముసేయన్. 50

వ॥ అతఁడును సంతుష్టాంతరంగుండై, 51

చ॥ అమలిన తేజ! మాకుఁ బ్రజ కభ్యుదయంబు ఘటిల్లె నేఁటికి
న్గొమరు ముఖాంబుజంబుఁ గనుగొందువు నీవిఁకఁ గొన్ని
నాళ్ళలో, సమయమువచ్చె నేను నొక స్వప్నముగంటి
ద్విజుండు నామనో, రమ తొడమీఁదఁ బెట్టె నొక రమ్య
తరంబగు పుండరీకమున్. 52

గీ॥ భావిఫలసూచకంబులు గావె ముందు
గలుగు స్వప్నంబు లెందును గాశ్యపీశ!
అందులోన నిశాంతంబునందు వచ్చు
స్వప్నము లమోఘము లటంద్రు శాస్త్రవిదులు. 53

వ॥ కావున నవశ్యము విలాసవతి గుణధారేయుండగు కుమా
రుం బ్రసవించు మీ యభీష్టంబు లీడేఱునని వచించు
నమ్మంత్రిసత్తముం గేలఁగొని యభ్యంతరంబుం బ్రవే
శించి యానృపాలుండు విలాసవతిన్ విదితస్వప్నవృత్తాం
తం జేసిన నామెయు సంతుష్ట యయ్యె. 54

ఉ॥ అంతటఁ గొన్నినాళ్ళు చనునంత విలాసవతీలతాంగికిన్
జింత తొలంగిపోవ సరసిన్ బ్రతిమాశశి చొచ్చినట్టు లా
యింతికి గర్భమయ్యెఁ బరమేశ్వరు సత్కృపచేత దాన న
క్కాంత వెలింగెఁ గౌస్తుభవికాసితవిష్ణు నురస్థలిం బలెన్ 55

వ॥ అంతనన్నపానాదులనాదరంబుగలదియువర్షాకాలంబుం బోలె శ్యామాయమానపయోధరముఖియుఁ గేతకింబోలె గర్భపాండురయు నగు నక్కాంత నంతర్వత్నిగ నెఱింగి యవ్విలాసవతీ సర్వపరిజన ప్రధానభూతయు రాజసమీప సంచారచతురయు నగు కులవర్ధన యేతద్వృత్తాంతంబు ఱేని కెఱింగింపఁ దలఁచినదై యొక్కనాఁడు ప్రదోషసమయంబునఁ దైలాభిషేక ప్రజ్వలితదీపికాసహస్రపరివృతుండై తారకామధ్యస్థితుండగు పున్నమనాఁటిచందురుంబోలె వెలుఁగుచు రాజనికరంబు పరివేష్టింప నభ్యంతరమండప స్థితుండై శుకనాసునితో నిష్టగోష్ఠిలోనున్న ఱేని సమీపించి రహస్యమున విదితవిలాసవతీ గర్భవృత్తాంతునిగాఁ జేసిన 56

గీ॥ ఆ యపూర్వపుఁ దద్వచనామృతమునఁ
బులకితశరీరుఁడై యంత భూవరుండు
హర్షబిందుతరంగిత మైన యక్షి
నించుక ప్రధానిపైఁ బ్రసారించుటయును. 57

వ॥ ఆతండును. 58

గీ॥ అధిపుఁడు హాసోత్కుతూహలుఁ డగుటఁజూచి
తెలిసి కులవర్ధనాముఖదీధితియును

ఇంత సంతోషమున కన్యమేమి లేమి
యెఱిఁగి శుకనాసుఁ డను ధరణీంద్రుతోడ. 59

ఉ. ఈకులవర్ధనాముఖము నెంతయు సస్మితమౌ భవన్ముఖ
శ్రీ కనుగొన్నఁగౌతుకముచేఁ దులఁదూఁగెడు నేమికారణం
బో కనఁజాల స్వప్నమె శుభోదయమయ్యెనొ లేకయన్య
మో, నాకెఱిఁగింపు చిత్తము వినఁగోరెడుఁ దత్తఱమందు
చుండెడున్. 60

గీ॥ అనిన నృపుఁడను నీయూహ యదియ నిజను
టంచుఁ గులవర్ధన వచించె నైన నమ్మ
నేల మాయట్టి వారల కిట్టి భాగ్య
మిట్టి సుఖవచన శ్రుతులెట్లు గలుగు. 61

వ॥ ఐన స్వయముగఁ జని కనుంగొనియెదఁగాక యని
కొలువుసాలించి తన యంగంబులనుండి యాభరణంబు
లఁ దీసి కులవర్ధన కొసంగి శుకనాసద్వితీయుండై యంతః
పురంబుఁ బ్రవేశించి యందు పారూఢగర్భ యగుటచే
నంతర్నిమగ్నైరావతం బగు మందాకినింబోలె నుదయ
గిరితిరోహితశశిమండల యగు విభావరింబోలె శయన
మందున్న దేవిం గనుంగొనుడు నామెయు ససంభ్రమపరి
జన ప్రసారితకరతలయై వామజానువిన్యస్తహస్తయై లేచు
చున్నంత ఱేఁడు నివారించి యామె నంద యుపవిష్టం
జేసి తాను నుపవిష్టుండై శుకనాసుండు సమీపశయనం
బునఁ గూర్చుండుడుఁ బరిహాసంబుగా దేవిం గనుంగొని
నృపాలుం డిట్లనియె. 62

క॥ దేవీ కులవర్ధన మా
తా వున నన్నట్టిమాట తథ్యం బౌకో
ఈవిధి శుకనాసుండను
నావుడు సతియుం ద్రపాతినమ్రాననయై. 63

వ॥ ఈరకుంఠియుఁ బునఃపునారాజానురుధ్యమానయై నన్నేల లజ్జాపరవశంజేసెదరు నాకేమియుం దెలియదనినఁ దిరిగి నృపాలుం డిట్లనియె.

గీ॥ అతివ నావాక్యములనె సిగ్గయ్యెనేని
నూరకయ యిప్పగిది నిప్పుడుండుఁగాని
పంకజసదృక్ష నేత్రరో యింక నేమి
ప్రతివచించెద వీపాండువర్ణమునకు. 65

గీ॥ ఏమిప్రత్యుత్తరం బిప్పు డిచ్చెదీవు
లలనరో గృహీతనీలోత్పలంబు లౌచు
మలయు జక్కవ లట్లు శ్యామాయమాన
చూచుకము లైన నీదు వక్షోజములకు. 66

గీ॥ ప్రత్యహంబును గాఢతాపన్నమయి
మగువ త్వన్మేఖలాదూయమాన మగుచు
నిర్యదుధరిత్రి రేఖమై నివ్వటిల్లు
త్వదవలగ్నంబునకు సమాధాన మేమి. 67

వ॥ ఇవ్విధముగాఁ బలుకు నృపాలకుఁ గనుంగొని శుకనాసుం డంతర్ముఖవినిగూఢహాసుండై రాజా యేల దేవి నాయాసపెట్టెదరు? ఈపె యేతద్వృత్తాంతంబుచే సిగ్గుచెందుచున్నయది. కులవర్ధనా కథితవృత్తాంత మింతటితో విరమింపుఁ డని యిట్లు పెక్కుతెఱంగుల నర్మోక్తులాడు

కొనుచుఁ జిరకాలముండి శుకనాసుం డేగిన తేఁడును నా
రేయి యంద విలాసవతియింటనుండి యేగె. 68

గీ॥ క్రమముగా నంత దోహదకాండ మెల్ల
సలుపు పైనను నవమమాసంబునందు
శుభముహూర్తమునందు నా సుదతి సర్వ
జన నయనకౌతుకప్రదుఁ దనయుఁ గాంచె. 69

క॥ ఇటు నటుఁ దిరిగెడు పరిజన
పటలముచేఁ గదలె భూమి పార్థివుఁడు మహో
త్కటసౌఖ్య మందె మంగళ
పటుతరవాద్యములు మ్రోఁగెఁ బట్టణ మెల్లన్. 70

గీ॥ హర్షమున నప్పు డున్మత్తు లట్లు యాడి
రెల్లజనులును వేయేల యిందు నుదయ
మునఁ గడలి యట్లు కలకలోన్ముఖము నగుచు
నొప్పెఁ బుత్రోదయమున నుహోత్సవంబు. 71

గీ॥ తనయుఁ గను వేడ్క మదిలోనఁ దత్తఱింప
విభుఁడు మౌహూర్తికాదిష్టవేళయందు
మంత్రి యరుదేరఁ జనెఁ బుష్పమాలికాది
బహువిధాలంకృతంబగు ప్రసవగృహము. 72

వ॥ అందు విలాసవత్యుత్సంగంబున. 73

గీ॥ గర్భరాగంబువదలని కారణమున
నుదయదరుణారుణుం డట్టు లొప్పువాని
నపరసంధ్యారుణుండైన యంబుజారి
పోలె వెలుఁగొందుచున్న యర్భాలుఁ గాంచి. 74

క॥ అనిమేషలోచనంబులఁ
దనయుని మాటాడునట్లు ద్రాగుచు నున్న
ట్లును, దాఁకునట్లు నరపతి
కనుఁగొనుచు నమందమోదకలితుం డయ్యెన్. 75

క॥ అంత శుకనాసుఁడును భూ
కాంతునితో నర్భకునకుఁ గల లక్షణముల్
వింతగొలుపంగ నెంతయు
సంతుష్టస్వాంతుఁ డగుచు సమ్యక్ఫణితిన్. 76

సీ॥ లేఁతచందురుఁబోలు నీతని నుదుటిపైఁ
గడుసూక్ష్మమై యూర్ణ గానిపించుఁ
బుండరీకంబులఁ బోలునీతని యక్షి
యుగ మిల్లు తెలసేయుపగిది వెలయు
ఎఱ్ఱఁదామరకాంతి నెల్లెడఁజల్లునా
నరుణమై యీతని కధర మొప్పు
సర్వేశునకుఁ బోలె శంఖచంద్రాభిరా
మమ్ములై యితని హస్తమ్ము లమరు

గీ॥ దుందుభిధ్వానమట్లుగాఁ దోఁచుఁ జెవికి
నెంతొ గంభీరమై యొప్పు నితని కంఠ
రావ మని చెప్పు నావసరమునఁ ద్వరిత
గమనుఁడై వచ్చి పతికి మంగళకుఁడనియె. 77

గీ॥ విజయ మగుఁగాక నీకుఁ బృథ్వీబిడౌజ
రేణుకాదేవి భార్గవురీతి నొక్క
నందనుని గాంచె మన శుకనాసు జ్యేష్ఠ
భార్యయైన మనోరమాపల్లవోష్ఠి. 78

వ॥ అని చెప్పిన యమృతవర్షోపమానంబగు నవ్వాక్యంబునకు నపరిమితానందుండై, 79

గీ॥ ఇంత సంతోష మొక్కమా టెపుడు గలిగెఁ
గష్టములమీఁదఁ గష్టముల్ గలుగుచుండు
భద్రములపైన భద్రముల్ పరిఢవిల్లు
ననెడు లోకోక్తి నిక్కమ మయ్యె నేఁడు. 80

వ॥ అని ప్రీతివికసితలోచనుండై సరభసంబుగా నాతనిఁ గౌఁగిలించి స్వయముగాఁ దాన శుకనాసు నుత్తరీయంబు పూర్ణపాత్రముగా నొసఁగి తానును సంతోషంబునకుఁ దగిన ట్లతనిని సమ్మానించి వేణువీణాదిగానంబులు బోరుకలంగ వారవిలాసినీనృత్యంబులు సెలంగ నమందానందంబుచే నున్మత్తలట్లు పాడుచు నాడుచు నంతఃపురాంగనలు వెంటరా శుకనాసగృహంబుఁ జేరి ద్విగుణతరోత్సవంబుఁ గావించి యంత. 81

శా॥ భూపాలాభరణం బిటుల్ పదిదినా లొప్పెఁ గాంతనక్త్రింబు రా, శాపద్వారి ప్రవిష్టుఁడౌటఁ గలలోఁ గన్గొంటచేఁ బుత్త్రిఁ జం, ద్రాపీడాభిధుఁ జేసె మంత్రియును మర్యాటం బొనర్చెన్ నిజా, శాపూర్తిం బొనరించు పుత్త్రునకు వైశంపాయనాఖ్యన్ దగన్. 82

వ॥ అంత నృపాలుండును దత్తత్కాలం బతిక్రమింపకుండఁ జౌలకర్మాదులఁ గావించి యాఱవయేఁ డరుదెంచుడుఁ గుమారునకు మనంబు చలింపకుండుటకుఁగా శిప్రాతటంబున. 83

గీ॥ అర్ధక్రోశమాత్రాయత మైన యొక్క
పాఠశాలను నిర్మించి ప్రథితు లైన
బుధులఁ బిలిపించి సుముహూర్తమునఁ గుమారు
సచివపుత్త్రిఁడుతోడుగాఁ జదువఁ బనిచె. 84

వ॥ తానును బ్రత్యహంబు విలాసవతితోఁ బరిమితపరిజనుండై చూచుచుండెఁ జంద్రాపీడుండును నిజకౌశలంబుచే గురూపదిశ్యమానంబులగు విద్యల నచిరకాలంబున గ్రహించె మణిదర్పణంబునందుంబోలె నాతనియందు సర్వకళలుఁ బ్రతిబింబితంబులయ్యె నంతఁగొలఁదికాలంబులోనే యా రాకొమరుండు. 85

సీ॥ పదవాక్యములయందుఁ బాండిత్యము గడించె
ధర్మశాస్త్రమున విద్వాంసుఁ డయ్యె
రాజనీతుల సమర్థతఁ గాంచె వేణువీ
ణాముర జాదుల నాణె మెఱిఁగెఁ
గరిశిక్షలఁ దురంగమవయోజ్ఞానంబు
నందుఁ జిత్రాదుల నధికుఁ డయ్యెఁ
జక్రచాప కృపాణ శక్తి తోమర గదా
ప్రభృతులందున మహాప్రథితుఁ డయ్యె

గీ॥ వాస్తువిద్యల వ్యాయామవైఖరులను
నవ్యకావ్యపురాణ సన్నాటకముల
నొకట నననేల మహి నున్న సకల కళల
సర్వతోముఖపాండిత్య సరణిఁ గాంచె. 86

సీ॥ చెవిఁబట్టుకొన్నచో సింహార్భకక్రమా
క్రాంతంబులటు కరుల్ కదలలేవు

అసిఁగొన్నచో నొక్క హరికిఁ దామరతూండ్లఁ
బోలెఁ దాళముల వేవేలఁ గూల్చు
బాణంబుఁగొన్నచో భార్గవుండుంబోలె
గోత్రశిలాతలుల్ గూలఁజేయుఁ
బదిమందికేనియుఁ గదలకుండెడు నాయ
సంపుదండము గొని సామొనర్చు

గీ॥ ఏమిచెప్పుదు నాతఁ డహీనశక్తి
చేత నెంతయు వర్ణనాతీతుఁ డయ్యె
సచివపుత్రుండు నొక సాహసమునఁ దక్క
నన్నిటను రాకుమారునే యనుకరించె. 87

క॥ తన రెండవహృదయం బగు
ఘను మంత్రికుమారుఁ బాసి క్షణముండఁడ రా
తనయుఁ డతఁ డట్ల యుండున్
దినకరు విడనాడకుండు దివసముభంగిన్. 88

గీ॥ అబ్జవనముల కరుణోదయంబు మాడ్కిఁ
గల్పవృక్షంబునకు సుమోద్గమము పోల్కి
యౌవనంబు ప్రవేశించి యంత నతని
యందమున కింక మఱి యంత యంద మిచ్చె. 89

చ॥ నికటమునందునే నిలువనేరిచె నంతట మన్మథుండు నే
వకు నటులా నృపాలునకు వక్షము తా సిరితోడ విస్తృత
త్వకలనఁదాల్చె శాత్రవవితానముతో నడుముందనుత్వ
మొ, ప్పి కొమరు మీఱెఁ జిత్తము గభీరతఁ గాంచె
స్వరంబుతోడనే. 90

గీ॥ ఆత్త యౌవనుఁడై సుతుం డలరుటయును
బండితుం డయ్యె నని గురుల్ పల్కుటయును
రాజు దలపోసి సుతుఁ గొనిరాఁగ నొక్క
భటు వలాహకనామకుఁ బంపుటయును. 91

వ॥ అంత నాతండును గతిపయబలాధికృతుండై విద్యాగృ
హంబుఁ జొచ్చి ద్వారపాలురచే నివేదితుండై యభ్యం
తరంబు ప్రవేశించి కృతసాష్టాంగుండై సవినయంబుగాఁ
జంద్రాపీడునకుఁ దండ్రివాక్యములుగా నిట్లనియె. 92

చ॥ చదివితి సర్వశాస్త్రములు శస్త్రకళాదుల మించి తెంత
యున్, సదనముఁ జేరఁగా గురులె సమ్మతిఁ జూపిరి వచ్చి
నీ విటన్, బదియవవర్ష మిప్పటికి బాల్యమునుండియు
నింతదనక నీ, వదనముఁ జూడఁగా మొగమువాఁచిన
యెల్లర కోర్కెఁ దీర్పుమా. 93

గీ॥ అధిగతకలాకలాపుఁడ వైన నిన్నుఁ
బౌర్ణమాసీశశాంకుని పగిదిఁ గూర్మిఁ
గాంచి లోకుల లోచనకైరవంబు
లెల్ల నొకమాఱుగా వికసిల్లుఁగాత. 94

గీ॥ వచ్చె నీకిప్డు షోడశవర్ష మింక
సదన మేతెంచి తల్లుల సంతసింపఁ
జేయు, ప్రజలను గాపాడు, శ్రితులఁ గావు,
మనుభవింపుము రాజ్యయౌవనసుఖముల. 95

క॥ అని యిట్లు పలికి వాకిటఁ
దనరారుచునున్న దదిగొ ధాత్రీవరుఁ డం

పిన త్రిభువనైకరత్నం
బనఁదగు నింద్రాయుధాఖ్య మగు హయ మధిపా. 96

చ॥ ఇది గరుడానిలంబులకు హెచ్చైడు వేగమునన్ సలక్షణం
బుదధిజలోత్థితంబును నయోనిభవంబని నీదు తండ్రికిన్
ముదమునఁబారసీకనృపముఖ్యుఁడు పంపెను భక్తిమై మ
హా,పదయుఁగ, నిర్జరేశ్వరుని వాహనమున్ దిగదుద్దు
దీనికిన్. 97

వ॥ అని వచించి విరమించిన నా రాకొమరుండును మాల్యం
బునుంబోలె జనకునాజ్ఞ శిరసావహించినవాఁడై యింద్రా
యుధంబుం గొనిరమ్మనుడు నాతండుఁ గొనివచ్చిన సర్వ
లక్షణసంపన్నంబును నతిప్రమాణంబును నూర్ధ్వకరపురు
షప్రాప్యపృష్ఠభాగంబును గలిగి మూర్తిమంతంబగు రహ
స్సంఘాతంబునుంబోని యా హయరాజంబుం గనుంగొని
విస్మితహృదయుండై యాత్మగతంబున. 98

చ॥ సరభసవృత్తిమై జలధి సర్వముఁ గవ్వపుఁద్రాడుఁ జేసిమం
దరమునఁ జిలుకు వేళఁ బ్రథితంబగు నీతురగంబుదప్పని
ర్జరులకు నేమియబ్బెను బురందరుఁడా తెలవారువంబుచేఁ
బొరపడె దీనినెక్కకయ ముజ్జగమేలిన నేఫలంబగున్. 99

గీ॥ వారిజాక్షుండు విష్ణు పీ వారువంబు
నెక్కఁగకుండంగవలయుఁబో నింతదనుక
నెక్కఁగియేయున్న నేఁటికి నేల విడఁడు
వైనతేయాధిరోహణ వాంఛితంబు. 100

గీ॥ సిశ్చయముగఁ నిరాకృతనిర్జరేంద్ర
రాజ్యలక్ష్మియ నాతండ్రి రాజ్యలక్ష్మి

యీదృశంబులు లోకత్రయీదురాప
రమ్యరత్నంబు లనుభవార్హంబు లిందు. 101

మ॥ అతితేజస్వితచేత సాహసబలవ్యాపార వత్త్వంబుచే
క్షితినేతత్తురగాకృతిం గన స్ఫురించెన్ దైవతాధిష్ఠిత
ప్రతిరూపంబని దీని నెక్కుటకు భావంబొప్ప దేమందు నీ
యతిలోకంబగు రామణీయకము నే యశ్వాళి నేఁ
గంటిమే. 102

క॥ ఎందఱొ మునిజనశాపా
స్పందితులై వేలువేలు వపువుల వేల్పుల్
పొందుట వినియే యుంటిమి
సందేహమువలద యిట్టి సందర్భములన్. 103

గీ॥ స్థూలశిరుఁడను మునిచేతఁ దొల్లి రంభ
శప్తయై యశ్వహృదయ నా జగతి వెలసి
బాడబాకృతి శతధన్వతోడఁ గూడి
చాలకాలంబు ధాత్రిలోఁ గ్రాలలేదె. 104

వ॥ నిక్కువంబుగా నియ్యది యొకమహాత్ముండు గానోపు నని
చింతించుచు నెక్కఁదలంచినవాఁడై యాసనంబు డిగి
హృదయంబున నోమహాత్మా! యెఱుంగక నాచేయు నా
రోహణాతిక్రమంబు సైఁపుమనుచు నయ్యశ్వమున్ విది
తాభిప్రాయముంబోలె ననుమతిగా హేషారవంబుగావిం
చినఁ జంద్రాపీడుండు హయంబు నధిరోహించి యాశ్విక
సేనలు వెంటనంట నహమహమికతో రాకొమారు లొ
క్కరొక్కరు వలాహకునిచేఁ బేరుపేరున నివేదింపఁబడి
నవారై నమస్కరింపుచుండ వారలగౌరవించుచు వైశం

పాయనుండు వేఱొకహయంబు నెక్కి వెంటరాఁ బరివారంబులు ఛత్రచామరాదులు పట్ట వందిమాగధులు కైవారంబు లొనర్ప నగరాభిముఖుండై వెడలుడు.

ఉ॥ కొందఱు మోముఁజూచుకొనుకోర్కిఁ గయింగొను దర్పణంబుతోఁ, గొందఱు పాదపద్మములకర్హ వడిఁబూయు నలక్తకంబుతోఁ, గొందఱు కంఠమందిడుటకుం గయిఁ బూనిన హారయష్టితో, సుందరు లెల్ల రాకొమరుఁ జూడఁగవచ్చిరి దొడ్డసందడిన్. 106

గీ॥ సౌధచయమంత నొకనిమేషంబులోనఁ
గామినీమయమాచును గానవచ్చెఁ
గాళ్ళకుం బూసిన యలక్తకంబుతోడ
క్షితియుఁ గన్పడెఁ గడుఁ జిగిర్చినది పోలె. 107

గీ॥ అతిముదంబున నిశ్చంచలాక్షులగుచుఁ
దత్పరతఁజూచు సతుల చిత్తంబులందు
సలిలములయందు స్ఫాటికస్థలములందు
ముకురములయందుఁ బోలెఁ దన్మూర్తి సొచ్చె. 108

వ॥ అంత. 109

సీ॥ కనువేదు రింతేల కలికి! జాఱెడు నుత్త
రీయమైనను సవరించుకొనుము
నల్లురుఁ జూచుచున్నారు తొలగెడు పైఁట
చెఱఁగు నింతీ! సరిచేసికొనుము
ధవళాక్షి! యింక నెందాకఁ జూచెదు నీదు
కందోయికిం దృప్తిగలుగదొక్కొ

తరుణిశిరో ! నీవొక్కదానవే వాతాయ
నం బాక్రమింపఁగా న్యాయ్యమౌనె

సీ॥ ఏటి కనురక్తిఁ జూచెదే యిగురుఁబోఁడి !
యిచట నెచ్చెలు లున్నది యెఱుఁగకుండ
ననుచుఁ దద్దర్శనోన్మత్తలయిన సతులు
మాటలాడంగఁ జొచ్చిరి మ్రొక్కి నపుడు. 110

వ॥ ఇట్లు సాదరంబుగాఁ జూచు నాకలభాషిణులభూషణ రవంబులచే నాహూయమానుండుం బోలె హృదయపద్మంబులచే ననుగమ్యమానుఁడు బోలెఁ బోయి పోయి రాజద్వారంబుఁ జేరి తురంగంబు డిగి వైశంపాయనుం గరంబునం గొని పురఃప్రస్థితుం డగు వలాహకునిచే సాదరంబుగ నుపదిశ్యమానమార్గుండై ఖడ్గపాణులగు ద్వారపాలురచే రక్ష్యమాణద్వారదేశంబు గలదియు నభ్రంకషంబులును నిర్మలంబులు నగు మహాప్రాసాదంబులచేఁ నొప్పునదియు బహువిధాలంకారశోభితంబును నగురాజకులంబుఁ బ్రవేశించి కృతప్రణాములగు ప్రతీహారులచే నివేద్యమానమార్గుండై సప్తకక్ష్యాంతరంబులదాఁటి యభ్యంతరస్థితుండును శరీరరక్షాధికారనియుక్త పురుషులచేఁబరివృతుండును నిరుపక్కల వారవిలాసినులచేనుద్ధూయమానధవళచామరుండును హంసధవళంబగు శయ్యాతలంబున నుపవిష్టుండునై యున్నతండ్రిం గని నమస్కరించిన. 111

ఉ॥ దూరమునందె తన్నుఁ గని దోసిలియొగ్గిన యాత్మజాతునిఁ, రార కుమారకా! యని కరంబులు చాఁచి కవుం

గిలించి యు, శ్రీరమణుండు మంత్రినుతు పీడనికూర్మి
బహూకరింపఁగా, వారును గొంతదనక నట వర్తిలి
యాపిదపఁ నృపాజ్ఞమై. 112

వ॥ విలాసవతిమందిరంబుఁబ్రవేశించి యామెచే లాలితులై
కొంతవడి నందుండి యనంతరంబు శుకనాసదర్శనోల్లా
సులై చని సామంతరాజమండలంబుచేతను గార్యాయాత
సకలజనంబులచేతను రథ తురగ గజాదులచేతను నిరం
తరముగా నొప్పు శుకనాసుని ద్వారదేశంబు ప్రవేశించి
సామంతమండలంబుచేఁ బరివృతుండై సింహాసనంబున
నుపవిష్టుండై యున్న మంత్రిం గాంచి సవినయంబుగా
నమస్కరించిన నాతండును గాఢానురాగంబున రాకొమ
రునిఁదన కొమారునిఁగౌఁగిలించి యానందబాష్పములు
రాల నిట్లనియె. 113

గీ॥ పుత్త్రివంతులలో మహాపుణ్యుఁడగుచు
నేఁడుగా నీదు జనకుండు నివ్వటిల్లె
సకలశాస్త్రంబులందునఁ జతురతముఁడ
వైన నినుఁ బోటి పుత్త్రకుం డలరుకతన. 114

క॥ ఎక్కడ నీ యీ ప్రాయం
బెక్కడ నమనుష్యమైన యీశక్తి భవా
దృశులకె భరతాదిమహీ
భుజులకు వతి పీవు జనుల పున్నెము కాదే. 115

వ॥ అని తదీయాతిశయం బభివర్ణించి. 116

గీ॥ దంష్ట్రిసాయంబుగా ధరాతలముఁగల్ప
కోట్లు దాల్చిన య య్యాదిఘోణిమాడ్కి

నీవు నీబావాలు వ్రా(ంతగా నీదు తండ్రి
తోడ( జెక్కెండ్లు ధాత్రి( గాపాడుమయ్య. 117

వ॥ అని యాశీర్వదించి యాభరణవసనకుసుమాంగరాగాదు
లచే నర్చించిన నాతండు నంతఃపురంబు ప్రవేశించి మం
త్రిభార్యయగు మనోరమను దర్శించి నమస్కరించి యిం
ద్రాయుధం బెక్కి గృహంబు( జేరి దినాంతకృత్యంబు
లొనరించి శయనగృహముకడనే యింద్రాయుధంబు కట్టి
యుంచె నంత దినంబును బరిణతం బయ్యె. 118

గీ॥ దివమునందుండి యేతెంచు దివసలక్ష్మి
భూరితర పద్మరాగ నూపుర మనంగ
నాత్మరుక్ఛన్న నిజరంధ్ర మాచు( దనరి
పడియె రవిబింబ మున్మత్తపాద మాచు. 119

గీ॥ క్రమముగా నంత( బశ్చిమాంగనకు( గర్ణ
పూరరక్తోత్పలం బౌచు( బ్రొద్దు క్రుంక
నభ్రశైవాలినీవికచాబ్జిని యన
జగతి నెల్లెడ సంజకెంజాయ దనరె. 120

గీ॥ క్రమముగ( బ్రదోషమగుడు నా రాసుతుండు
నడచియే తల్లి దండ్రుల కడకు( బోయి
మణికిరణజాల దేదీప్యమానమైన
భర్మశయనీయమందున( బవ్వళించె. 121

మ॥ తెలవాఱంగనె యాతఁడంతఁబిత్రానాదేశంబుచే మంజులో
జ్జ్వలజాంబూనదదివ్యశృంఖలలతో శ్వానంబులన్ లాగువ్యా
ధులతో నేర్పరులైన వేఁటరులతోఁ దోడ్తో వనంబేగి బె

బ్బులులన్ సింగములన్ మహామృగచయంబుం గూల్చి
యుత్సాహియై. 122

గీ॥ సాహసముఁ గల్గువాఁడౌటఁ జావకుండ
నుండఁగనె కొన్ని మృగముల నోర్చి పట్టె
నంత మధ్యాహ్నమగుటయు నాత్మగృహముఁ
జేరె హాయి మెక్కి పరిజనశ్రేణితోడ. 123

వ॥ ఇట్లు గృహంబుఁ జొచ్చి హయంబు డిగ్గి తురంగాధిరోహ
ణోచితవేషం బుజ్జగించి ప్రచలితతాళవృంతానిలాపనీ
యమానశ్రముండై కనకకలశసహస్రాంచితంబును నంత
ర్విన్యస్తకాంచనపీఠంబును నగు స్నానభూమిం జొచ్చి
నిర్వర్తితాభిషేక వ్యాపారుండై కులవర్ధనాముఖాంతః
పురపరిచారికాదత్త వస్త్రమాల్యాభరణుండై మొదటఁ
దా ధరించి పదపడి వైశంపాయనున కొసంగి తకుఁవా
రల ధరింపంజేసి కుథాసనోపవిష్టుండై యిది వీని కియ్యు
దివ్యానికని పరిజ్ఞాతసేవారసుండై యాహారాదుల నొసం
గుచు నెల్లరతో నభ్యవహారకృత్యంబుఁ దీర్చి తాంబూల
చర్వణంబుఁ జేసి యింద్రాయుధంబు సమీపించి పరిజ
నంబున్నను దాన హయంబునకు యవసంబువేసి రాజగృ
హంబుఁ జేరి తండ్రిం జూచి గృహమేగుదెంచి యారేయి
గడపి మఱునాఁడు. 124

సీ॥ బాలారుణాతపప్రభలచే నొప్పారి
తేజరిల్లెడు పూర్వదిక్కనంగ
రాహుగ్రసనభీతి రజనీకరుని వీడి
యిలఁజేరినట్టి వెన్నెల యనంగ

దేహంబు ధరియించి దీపించు నుత్తమ
క్షితిపాలవంశదేవత యనంగఁ
క్వణితనూపురపాద కమలయాటను రణ
చ్ఛ్రిహంసయుత సరోజిని యనంగ

గీ॥ ఈషదంచిత యౌవనోన్మేష యైన
సుదతి నోర్తుకఁ గొని రాజసుతునిఁ జూచి
యువని విన్యస్తదక్షిణహస్తుఁ డగుచు
ననియెఁ గంచుకి, కైలాసుఁ డనెడువాఁడు. 125

ఉ॥ మున్ను కులూతదేశమును ముట్టడి వేయఁగనీదు తండ్రి యీ
కన్నియ పత్రలేఖ త్రిజగన్నుత! తేఁబడె భృత్యకోటిచే
అన్నరపాలపుత్రి యని యప్పు డపత్యము లేక పోవుటం
గన్నకుమార్తెకన్న నధికమ్ముగఁ బెంచితి దీనిఁ బుత్త్రికా.

వ॥ కాన నిద్దానిఁ దాంబూలకరండవాహినిఁ గాఁ గొనవలయు
మఱియు. 127

గీ॥ బాలఁబోలెను లాలింపవలయుఁ జుట్ట
మట్లగౌరవముం జేయనగును జెలియ
మాడ్కి నరయంగ నగు బహుమానమునకు
రాజకన్యక యిది యర్హురాలు తనయ. 128

మ॥ చిరకాలంబును బెంచు ప్రేమయిటు నాచేఁజెప్పఁగాఁ
జేసెఁగా, ని రుచుల్ గొల్పుచు వెన్నకేని బలువన్నెల్
చిన్నెలుఁ దిద్దు ని, ర్ఝరమౌమార్దవమొప్పి, మాధురి
మెయిఁ ద్రాక్షాగుళుచ్ఛంబుతో, సరితూఁగంగల యీత
దుక్తులె భవత్స్వాంతంబు రంజింపవే. 129

వ॥ అని జననీవాక్యంబులుగాఁ జెప్పినఁ జంద్రాపీడుండు నని
మేషదృష్టితో ముహూర్తకాలం బక్కన్యక నీక్షించి తల్లి
యాజ్ఞ యెట్లో అట్లే యనిన నతం డరిగె నంత. 130

గీ॥ పత్రలేఖయు నది మొదల్ ప్రత్యహంబు
నీడవలె ఱేనిపార్శ్వంబు వీడలేదు
ఆ లతాంగినిఁ జూచినదాది దాని
ఱేఁడు హృదయాతిరిక్తగాఁ జూడలేదు. 131

వ॥ ఇట్లు కొంతకాలముగడచన నద్ధరాకాంతుండు కొమరు
నికి యౌవ రాజ్యాభిషేకంబు సేయ నుపకరణ సంభార
సంగ్రహార్థంబు ప్రతీహారుల కాజ్ఞాపింప వారును దత్కార్య
వ్యాపృతులై యుండిరి. అంతనొక్కనాఁడు నిజదర్శనార్థ
మేతెంచిన చంద్రాపీడుని వినీతతముంజేయ శుకనాసుండు
సవిస్తరంబుగా నిట్లనియె. 132

కం॥ చదివితివి పెక్కుశాస్త్రము
లిది యది యననేల సర్వమెఱిఁగితి వెందే
కొదవయుఁ గానము నీకుఁ
విదితం బొనరింప నొండు విషయం బేదీ? 133

వ॥ ఐనను. 134

సీ॥ అదివాకరకరాపహార్యం బదీప ని
ర్వాపణీయంబు యౌవనతమంబు
అపరిణత్యుపశమం, బతిహేయ మరయదు
క్రిందును మీఁదు లక్ష్మీమదంబు
శిశిరోపచారంబుచేఁ దలంగదు తీవ్ర
మభిమాన తీక్ష్ణదాహజ్వరంబు

తెల్లవాఱినఁగూడఁ దెలివిరానీయదు
రాజ్యసౌఖ్యైక నిద్రావఘూటి
గీ॥ కండ్లఁగనఁబడనీయదు కాటుకలను
వత్తులంగూడ నెందు నైశ్వర్యతిమిర
సంభవంబగు నంధత్వసరణి గాన
నీకు నెఱిఁగింపవలసెను రాకుమార! 135

గీ॥ జననమాదిగ శ్రీమత్త, జవ్వనంబు,
నసదృశాకార, మమనుష్యమైన శక్తి,
యనెడు నాల్గింట నొకఁ డొకఁ డశుభములకు
నాస్పదం బన్న నాల్గున్న నడుగవలెనె! 136

సీ॥ శాస్త్రజలంబుచే క్షాళితంబయ్యును
బుద్ధికాలుష్యంపుఁ బుంతఁబోవు
అత్యక్తధవళిమ యయ్యును యువకుల
దృష్టి సరాగమై తేజరిల్లుఁ
బ్రకృతి యెప్పుడు శుష్కపత్రంబునుం గాలి
యటు పూరుషుని దూర మపహరించు
లేండ్లను మృగతృష్ణలీల దురంతమై
విషయేప్స యింద్రియవితతి లాగు 137

గీ॥ అనిశ మాస్వాద్యమాన మే యయ్యు విషయ
భోగములు నూత్నమాధుర్యపూరితములు
గాఁగ నప్పటి కప్పుడే గానిపించు
యౌవనారంభవేళలయందు మదికి. 138

గీ॥ కాన మీబోంట్ల యుపదేశకలన కర్హ
తములు, మాలిన్యశూన్యచిత్తంబులందు

సులభముగ నుపదేశంబు చొచ్చుఁగాదె
స్ఫటికమణులందు శశికరజాల మట్లు. 139

గీ॥ స్వచ్ఛమయ్యు గురూపదేశం బపాత్రు
శ్రవణసంస్థితమైనఁ గష్టంబుఁగూర్చు
అమలముం దాపవారక మయ్యు జలము
కర్ణసంస్థంబు శూలమై కలఁచుఁగాదె. 140

మ॥ ఉపదేశంబున కర్హమైన సమయంబూహింపఁగా నియ్యదే
యెపుడింకన్, గుసుమాస్త్రజర్జరితమై యెంతేమనంబొప్ప
నీ, యపమార్గంబుఁ ద్యజింపఁగా నెవరికే నౌనౌనొక్కో?
లేకున్న మా, యుపదేశంబులు భిన్నకుంభసలిలవ్యూ
హంబులై పోవొకో. 141

గీ॥ అల్పునకు నన్వయము విద్య యవినయంబె
పాదుకొల్పును, జందనప్రభవమైన
వహ్ని కాల్పదె ? మించదే ప్రశమజనక
మైన సలిలంబుచే బడబానలంబు. 142

ఉ॥ ఓనరపాలపుత్త్ర! వినవో యఘమూఢ్వ జలంబులేని సు
స్నానము, ధాత్రిలో ననుపజాతశిరఃపలితాదికంబు నై
కానఁగవచ్చు వార్ధకము, కర్ణములం దసువర్ణరత్న సం
ధానితమైన భూషణవితానముఁగాదె గురూపదేశముల్.

చ॥ జనపతులందునన్ హితముఁ జక్కఁగఁ జెప్పెడు వారె
సున్నను, న్ననిసి తథాస్తు దేవతలె న్యాయముగాదని
యెవ్వఁడేనిఁ జె, ప్పిన దురహంక్రియాతిశయవిహ్వలులై
విన, రొక్కవేళ వి, న్నను గజరాణ్ణిమీలితమునన్ బచ
రించి కలంతు రొజ్జలన్. 144

గీ॥ గర్వదుర్జ్వరమూర్ఛాంధకారయుతము
రాజప్రకృతి, ధనంబో నిరంతరంబు
ఘనతరాహంక్రియోన్మాదకారణంబు
రాజ్యలక్ష్మీసుఖంబుఁ గోరంగఁ జన్నె ? 145

గీ॥ ఇందునందుండి వక్రత, యింద్రుహాయము
నుండి లౌల్యంబు; మద్యంబునుండి మదము;
కౌస్తుభమునుండి కఠినతఁ,గాంచి తొల్లి
వనధిలోపలనుండి వెల్వడియె లక్ష్మి. 146

సీ॥ దృఢగుణసందాన దీవ్యమానంబయ్యు
గడియలోపలన యెక్కడికో చనును
భటసంవిదసిలతా పంజరస్థితమయ్యుఁ
గనుమూసి యెటొ పలాయనముసెప్పు
జలరాశిలోపల జన్మమందినదయ్యు
నెల్లరకుం దృష్ణ పెల్లొసంగు
ఆలేఖ్యగతమయ్యు నహరహం బటునిటు
కదలుచునే ప్రొద్దుఁ గడపుచుండు

గీ॥ శూరునిం గంటకంబట్లు చూచి విసుఁగు
దాత దుస్స్వప్నమట్లుగాఁ దలఁచదెపుడు
తాఁక దపవిత్రుఁడని గుణాతంద్రు నకట!
కలిమిఁబోలెడు వస్తువు కలదె? యెందు. 147

సీ॥ సకలాపదుద్దురదాశావిషవల్లరీ
సంవర్ధనమునకు సలిలధార
సాధునిందాతిరస్కారాది ఘోరాప
రాధంబులకును బురఃపతాక

ధనమదోన్మిషదనిద్రాణపిశాచికాఽఽ
వళులకు జీర్ణనివాసవలభి
భ్రూవికారాశ్రుతాపూర్వమహానాట్య
గతులకు దివ్యరంగస్థలంబు
గీ॥ సాధుభావంబునకు వధ్యశాల, కపట
నాటకమునకుఁ బ్రస్తావనంబు, ధర్మ
రజనికరమండలమునకు రాహుజిహ్వ,
సిరియ, దీనికి లోఁగని జెట్టి లేఁడు. 148
గీ॥ తలఁచినను జిత్తమునకుఁ దత్తఱముఁ గూర్చుఁ
దాఁకినను మోహమను సముద్రమునఁ ద్రోయు
నిట్టి సిరిచేత మత్తులై యెల్ల నృపులు
చెడిరి చెడుచున్నవారలు చెడఁగలారు. 149
సీ॥ అభిషేకసమయంబునంద, దాక్షిణ్యంబు
కలశోదకంబుచేఁ గడుగఁబడును
అగ్నికార్యముచేయు నప్పుడె పొగచేతఁ
జిత్తంబు మలినంబు చేయఁబడును
నిజపురోహితకుశాసికసమ్మార్జని
చేతనే క్షాంతియుఁ జిమ్మఁబడును
ఉష్ణీషపట్టబంధోద్యోగసరణిచే
ముదిమిరాకతలంపు మూయఁబడును
గీ॥ ఛత్రమండలసమ్యగాచ్ఛాదనమునఁ
దలఁగుఁబరలోక దివ్యసందర్శనంబు
చామరోద్ధూతవాతసంచారములను
సత్యవాదితయును బోవు క్ష్మాపతులకు. 150

గీ॥ మానవేశ్వరు లోకకొంతమంది ధరణి
మహితసౌభాగ్యసంపదున్మత్తు లగుచు
సన్నిధినినున్న బాంధవజనముఁగూడ
నరయఁజాలరు సంప్రాప్తమరణు లట్లు. 151

సీ॥ పరదారగమనంబె పాండిత్యకృతియంచు
జూదమాడుటయే వినోదమంచు
మద్యంబుఁద్రావుటే మఱి విలాసంబంచు
నాఖేటకంబె వ్యాయామమంచు
శత్రుతిరస్కారసహనమే యోర్పంచు
స్వచ్ఛందతయె ప్రభుశక్తియంచు
వందిమాగధులకై వారంబె యశమంచుఁ
దరళతయే మహోత్సాహమంచు

గీ॥ గణికలం దిచ్ఛయే రసికత్వమంచు
లేమ విడనాడుటయె చింతలేమియంచు
దైవధిక్కృతియే మహాధైర్యమంచుఁ
దలఁచి చెడుదురు కొందఱు ధరణిపతులు. 152

చం॥ జనులకు దర్శనంబిడుట సైత మనుగ్రహమంచు నెంత్రు
శా,సనమును సైతముం వరముసంగతిఁ జూతురు పారితోషి
కం,బునుగనె పల్కులుం సయితముం దలపోయుదు రెవ్వఁ
డుం హితం, బును వచియించునట్టిజనముం గన మందు
చు నుంద్రు భూపతుల్. 153

ఉ॥ వారిని జేరనిచ్చెదరు వారల నెప్పుడు గౌరవింతు ర
వ్వారికి విత్త మిచ్చెదరు వారల మిత్రులమాడ్కిఁ జూతు ర

వ్వారల మెచ్చుచుండెదరు వారలమాటల నాలకింతు రె
వ్వారలుతమ్మె దైవమని వారని భక్తినిగొల్చుచుందురో.

సీ॥ శిక్షావిధానమా ! శితతరనిస్త్రింశ
సాధ్యమా కౌటిల్యశాస్త్రసరణి
ఉపదేష్టలా ! శాస్త్రవోత్కరసంరోధ
తత్పరులయిన ప్రధానవరులు
ఆసక్తియా! యసంఖ్యాకమహానృపా
లక భుక్తముక్తయా లక్ష్మియందు
ఉచ్ఛేద్యులా ! సహజోల్లసత్ప్రేములై
పరగుచుండెడు నిజభ్రాతృమణులు

గీ॥ దారుణంబైన యీరాజ్యతంత్రమందు
నవనవంబైన యీజవ్వనంబునందు
జనులచే వ్రేలఁజూపించుకొనని యట్టు
లెట్టు మెలఁగెదవో గదో యీ కుమార ! 155

కం॥ ధీరుండవు పితృకృతసం
స్కారుండవు, ధన మధీరు సంస్కృతి దూరుఁ
గారించు నైన నీపయిఁ
గూరిమి నన్నిట్టు లనుటకుం బురికొల్పెన్. 156

గీ॥ చేయి పైకెత్తి పలుమాఱుఁ జెప్పుచుంటి
నిదియ బహులక్ష్యదృష్టితో నెఱుఁగవలయు
జ్ఞానిఁ బండితుఁ దుదకెట్టివానినైన
లక్ష్మి దుర్మార్గమునఁ బడలాగు ధ్రువము. 157

వ॥ కావున జాగరూకుండవై. 158

గీ॥ యౌవరాజ్య సుఖంబుల ననుభవింపు,
మరులఁ గెలువుము చుట్టాల నాదరింపు
నీదుజనకుండు గెల్చిన నీవు మరల
నవనిఁ గెలువుమ యభిషేక మైనపిదప. 159

వ॥ అని యిట్లు శుకనాసుండు పలికి విరమించినఁ జంద్రాపీడుండు తదుపదేశవాక్యంబులచేఁ బ్రక్షాళితుండును బవిత్రీకృతుండు నలంకృతుండునుం బోలెఁ బ్రీతహృదయుండై ముహూర్తకాలం బందయుండి గృహంబునకుఁ జనియె. 160

కం॥ భాగవతార్థవిశేష
ప్రాగల్భ్యసుసంవిదభినవవ్యాస! సుధీ
జేగీయమాన! సుగుణా
భోగా! భాషాద్వితీయభోగికులేంద్రా! 161

ఉ॥ బాలసరస్వతీబిరుదభాసుర! భూసురవంశముఖ్య! మో
చాలసమానవాచ! నుతసర్వకళాఽవరశిష్టు కృష్ణమూ
ర్తి! లలితోరుకీర్తి! సువిధేయకలార్థికలాప! న్యాయశా
స్త్రాలఘుపాండితీవిభవ హర్షితభూప! పవిత్రజీవనా. 162

వనమయూరము.

జ్ఞాననిలయాభవదఖండమతిసత్య
ధ్యానయతిరాజకరుణాదరణపాత్రా!
మానితచరిత్ర! యసమానయశ! సూరీ
శానసుకవీడ్గణలసన్వనమయూరా! 163

గద్య॥

ఇది శ్రీకాశ్యపగోత్ర జగన్నాథాచార్యపుత్త్ర
సకల విద్వద్విధేయ పూర్ణప్రజ్ఞ
నామధేయ ప్రణీతం బగు
నాంధ్రకాదంబరియందు
ద్వితీయాశ్వాసంబు

సంపూర్ణము.

ఓమ్

శ్రీహయగ్రీవాయ నమః.

# ఆంధ్రకాదంబరి.

## తృతీయాశ్వాసము.



శచరణాంబుజాత ని
వేశితచిత్త ద్విరేఫ! విద్వన్నుతమే
ధాశక్తియుక్త! అస్మ
ద్దేశికమణి! కాశి కృష్ణ ధీమన్మౌళీ! 1

వ॥ ఆచార్యవర్యా! ఆలకింపుఁడు. ఆవలి కథ శుకంబు శూద్రకునితో నిట్లు విన్నవింపఁగడంగె. 2

గీ॥ అంతఁ గొన్నాళ్ళ కొక మూర్తమందు ఱేఁడు
తనయునికిఁ బట్టబంధనోత్సవ మొనర్చెఁ
దన మహీజంబు విడ కన్య తరువుఁ బ్రాఁకు
లత వలెఁ గుమారకుని రాజ్యలక్ష్మి చేరె. 3

వ॥ అంత గద్దియ నెక్కిన కొంతసేపునకు దిగ్విజయ ప్రయాణ ప్రశంసియగు దుందుభిధ్వానంబు మ్రోఁగుడు.

కం॥ అది విని గద్దియ డిగి కడు
ముదమున జయజయనినాదములు చెలరేఁగఁ
గదలెఁ జంద్రాపీడుఁడు
కదలె నటఁ వైరి ధరణి కాంతుల లక్ష్ముల్. 5

గీ॥ అట్లు యువరాజు వేగ ప్రయాణ మగుడు
వసుధ కంపింపఁ జతురంగబలముఁ గదలె
కరి నధిష్ఠించి శుకనాసు వరసుతుండు
కదలె రెండవ యువరాజు కరణి నపుడు. 6

సీ॥ ద్వీపమయం బయ్యెను దిక్చక్రవాళంబు
తురగమయం బయ్యె ధరణి యెల్ల
ఛత్రమయం బయ్యెఁ జదలెల్ల వసుమతీ
పాలమయం బయ్యె బ్రహ్మసృష్టి
మాతంగమదగంధమయ మయ్యెఁ బవనంబు
భూషాంశుమయ మయ్యె భూరిదృష్టి
జయశబ్దమయ మయ్యె జగతీత్రయంబెల్ల
జనమయం బయ్యెను క్ష్మాతలంబు
గీ॥ దివ్యమకుటమయం బయ్యె దివస మెల్ల
ధ్వజమహావనమయ మయ్యెఁ దన్నభంబు
తద్దిశాజయదివ్యయాత్రావిధాన
సందిదృక్షాఽగతాఖిలజనముచేత. 7

వ॥ అంత.

గీ॥ విజయయాత్రాసముద్ధూత విపులధూళి
చేత దివసంబు మృణ్మయశ్రీ వహించె

దెసలు రేణుమయంబులై తేజరిల్లె
నేకభూతమయం బయ్యె లోకమెల్ల. 9

వ॥ అంత వైశంపాయనుండు పారావారంబుంబోలె నపారంబగు బలంబును, విజయలక్ష్మీలక్షితుండగు చంద్రాపీడునిం జూచి యువరాజా!

శా॥ ఏ దేశంబు వశంబుఁ జేసికొనఁడో యేద్వీపముల్ గెల్వఁడో
యేదుర్గంబుల ముట్టడింపఁడో, మఱింకేమన్న నల్ గాంచఁడో
యేదిక్కుల్ గెలువండొ నీదుజనకుండింకేమి శేషించె నీ
యూదోరాశి పరీతభూతలి నజయ్యంబేది యూహింపఁగాన్.

సీ॥ సేవకులట్టు లేత్క్ష్మావల్లభులు తలన్
సేవాంజలులు విరచింపలేదు
దాసుల క్ష్మాధరాతలపతుల్ శ్వేతాత
పత్రంబులన్ బేర్మిఁ బట్టలేదు
చామరగ్రాహుల చందాన నేనృపుల్
వింజామరంబుల వీవలేదు
వందిమాగధుల కైవడి నే నృపాలకుల్
కైవారములు సేయఁ గడఁగలేదు

గీ॥ రామ మాంధాతృ సదృశు లీరాజు లెల్ల
శ్రీకరాస్తోకపట్టాభిషేకసలిల
పూతశిరముల రక్షావిభూతిమాడ్కిఁ
దావకాంఘ్రిపరాగంబుఁ దాల్పలేదె. 12

గీ॥ వీరుఁ బుడమిని బాలించువారె యవ్వొ
వీరిబలములు నిన్ను సేవింపవచ్చె

ఏదెసకుఁ గన్నుఁ ద్రిప్పిన మేదినీశ
వసుధయీనినయటు గానవచ్చు బలము. 13

గీ॥ శిథిలిత మహాకులాద్రి విశీర్ణసంధి
యయ్యెఁ గ్రుంగదు వసుమతి యద్భుతంబు
బలభరనిపీడితావనీభారమునను
జెదరకుండంగవలయుఁబో శేషుతలలు. 14

వ॥ అనియిట్లు వైశంపాయనుండు వచించుచుండఁగనే సము
చ్ఛ్రితానేకతోరణాలంకృతంబును దృణమయప్రాకార
మందిర సహస్రభూషితంబును నుల్లసిత ధవళపటమండప
సహస్రశోభితంబును నగు నావాసభూమిం జేరి సకలసా
మంతులచే మంత్రులచే వివిధకథలచేవినోదితహృదయుం
డై యభినవపితృవియోగసంజాతశోకాయాస్యమానచేత
స్కుఁడై యాదిన శేషంబుంగడపి రాత్రిఁ దనశయనీయంబున
కనతిదూరమునంద వేత్రాకతల్పంబున నున్న వైశంపా
యనునితో సమీపకుథాసనసుప్తయగు పత్రలేఖతో
నడుమ నడుమఁ బితృసంబద్ధంబును మాతృసంబద్ధంబును
శుకనాసమయంబును నగునాలాపంబులతో నాతిజాతని
ద్రుండయి ప్రత్యూషంబున మేల్కాంచి యనవరతప్ర
యాణంబులచేఁ బ్రతిప్రయాణోపచీయమానబలుండై 15

సీ॥ గర్విష్ఠులగువారి గర్వంబడంచుచు
దీనులఁ గరుణార్ద్రదృష్టిఁ గనుచు
అరిజనత్రస్తుల కభయంబొసంగుచు
నృపులిచ్చు కానుకల్ నెమ్మిఁగొనుచు

జగతి నెల్లెడ జయ స్తంభముల్ నాఁటుచుఁ
బిన్న పెద్దల మొఱల్ పేర్మి వినుచు
శరణన్న వారలఁ గరుణఁ గాపాడుచు
స్థిరమైన కీర్తి నార్జించుకొనుచుఁ

గీ॥ పూర్వ దక్షిణ పశ్చిమంబులను నుత్త
రంబునుఁ గ్రమమ్ముగా విజయం బొనర్చి
వత్సరత్రితయంబులో వసుధ నెల్లఁ
దిరిగె నాత్మీకృతాఖిలద్వీపుఁ డగుచు. 16

వ॥ ఇట్లు జిగీషుండై భూప్రదక్షిణంబుఁ జేయువాఁ డొక్క నాఁడు పూర్వసముద్రమునకు నాతిదూరంబున హేమజ కూటనాములగు కిరాతస్వాములకు నివాసభూతంబగు సువర్ణపురంబు జయించి సైన్యవిశ్రాంతికై కొన్నిదినంబులు 17

ఉ॥ అన్నగమందయుండి మృగయారతి నెమ్మదిఁ జెంగలింప
నా, సన్నవనంబుఁ జేరి యట శైలము డిగ్గుచుఁ గంటి
కింపుగాఁ, గిన్నరయుగ్మమున్నఁ బరికించి గొనన్ బ్రయ
తించువానినా, సన్ను నపూర్వు భూపుఁ గని చక్కఁ
బలాయిత మయ్యె నద్దియున్. 18

మ॥ ఎదలో దానిని బట్టు పెన్ దలఁపు మైనింద్రాయుధం బెక్కి
బ, ల్పదసంఘట్టన చేతఁ దోలుచు వడిన్ బారించుచున్
బోవుచో, నదియున్ జిక్కనదై మొదల్ పిదప దవ్వై వ
యాపయిన్ జేరువై, పిదపన్ దూరమునై నృపాలుమది
నొప్పించెన్ నిమేషంబునన్. 19

చ॥ దొరకకపోయె నన్నవగతో ద్విగుణీకృతరోషవేషుఁడై
పరుగిడి దానివెంటనె నృపాలుఁడు కొండల నెక్కుచుం
మహో, తరువులు గుల్మముల్ లతలు దాఁటుచు నొక్క
నిమేషమంతలో, నురవడి నేగెఁ బంచదశయోజనమాత్ర
మహీతలం బటుల్. 20

వ॥ ఇట్లు చనిచని యమ్మిథునంబు గిరిశిఖరంబధిరోహించు
డు నృపాలుం డచలశిఖరప్రస్తరప్రతిహతప్రసరగమనుం
డై మరలి స్వేదార్ద్రీకృతశరీరంబగు నింద్రాయుధంబును
దన్ను నుపలక్షించి మనంబున. 21

ఉ॥ ఎక్కడఁబోయె నాతెలివి యెల్లనుగిన్నరయుగ్మమక్కటా
చిక్కిన నేమి యింక మఱిచిక్కకపోయిన నేమి వెఱ్ఱినై
యిక్కడికేలరావలయు నెక్కడ! యుజ్జయినీపురోత్తమం
బెక్కడ! యీసువర్ణపురి యెక్కడ! యీరజతాద్రిశృం
గముల్. 22

చ॥ ఎఱుఁగను సేన యిచ్చటికి నెంతటిదూరము నందునుం
డెనో, తురగముఖావలోకనకుతూహలదోహలచిత్త
వృత్తితోఁ, బరుగిడు నాకు దారియును బట్టదుఁ బోవుద
మన్నఁ దోఁపఁడీ, వసుసను జూచుచున్నను సువర్ణపురిం
జను పాంథుఁ డొక్కఁడుం. 23

వ॥ అదియునుంగాక. 24

గీ॥ కర్ణతాడితమయ్యె సువర్ణపురము
మేదినికి నుత్తరపుఁబొలిమేర దాని
పైన నిర్జనమా యరణ్యాని దాని
దాఁటి చన రావ్యథారుణీధర మటంచు. 25

వ. అట్లగుటం జేసి యిగ్గిరి కైలాసంబగు, దీనికి దక్షిణంబుగా
నేగవలయునని గుఱ్ఱంబుమరలించువాఁ డాత్మగతంబున.

మ॥ దివసశ్రీరశనామణింబలె నదే! దేదీప్యమానంబుగా
రవి ద్యోమధ్యమలంకరించెను మహారణ్యప్రదేశాటన
వ్యవసాయంబున డస్సె నీహయము దూర్వాపల్లవగ్రాస
ము, కఱవడింబెట్టుచు స్నాతపీతజలముంగాఁ జేయు
టర్హంబగుఁ. 27

వ. అని తలంచుచు సలిలమన్వేషించుచుఁ బోయిపోయి నలి
నీజలావగాహనోద్ధూత వన గజ చరణోత్థాపిత పంకపట
లంబుచే నార్ద్రీకృతంబును దత్కరాకృష్టకమలకలాపం
బుచేఁ గలుషీకృతంబును, నార్ద్రార్ద్రంబులగు శైవలప్ర
వాళంబులచే శ్యామీకృతంబును నగు నొక్క మార్గం
బుంగని జలాశయశంకియై పోయిపోయి యుద్గ్రీవదృశ్యం
బులును,పరిచ్ఛత్రమండలాకారంబులు నగు తరువరంబు
లుగల కైలాసతలంబు దారిగాఁ గొంతనడిచి తద్గిరీం
ద్రంబునకుఁ బూర్వోత్తరదిగ్భాగంబున నొక్క తరుఖం
డంబుం దిలకించి తన్మధ్యభాగంబున.

సీ॥ త్రిభువనలక్ష్మిచే దీపించు నిర్మల
రమణీయరత్న దర్పణమనంగ
విశ్వంభరాదేవి విడిదియై యలరారు
స్ఫాటికతలహర్మ్యకూట మనఁగఁ
గాసారరూపంబుగా బహిర్గతమైన
లోకత్రయీపుణ్యపాక మనఁగ

భూమి నొక్కెడ ద్రవీభూతమై యొప్పారు
శరదభ్రశకలసంచయ మనంగ
సీ॥ సప్తఋషి మండలోదయస్నానపావ
నీకృతంబును స్ఫురదబ్జినీకదంబ
సంచరద్భృంగఝంకారసంకులంబు
నైన నచ్ఛోదకాసార మరసె విభుఁడు॥ 29
సీ॥ బాహులేయు చరిత్రంబు పగిది నద్ది
క్రౌంచవనితాప్రలాపమై క్రాలు నొకటఁ
దనరు నొక్కెడ మఱి పాండు ధార్తరాష్ట్ర
పక్ష సంక్షోభితం బయి భారత మటు॥ 30
మ॥ సుమకోదండుసిడంబునా మకరసంశోభాయమానం బర
ణ్యమునా నుజ్జ్వలపుండరీకగణగణ్యశ్రీసమాలోకమా
న్య మసద్ధేతువుచంద మెంతయు నదృష్టాంతమ్ము సర్వానవ
ద్యముఁ గాసారముఁ గాంచి లోఁ దలఁచెఁ జంద్రాపీడుఁ
డిభ్భంగిగాన్॥ 31
క॥ అరరె నిరర్థక మయ్యెం
గరముగ సార్థకతఁ గూర్చెఁగా నాకీ కి
న్నరమిథునానుస్మృతి యన
ర్ఘరమాస్పద మీ సరోవరముఁ గన్గొంటన్॥ 32
ఉ॥ కాంచితి నేటికిన్ గనులుగల్గినదానికి మేల్ఫలంబు నేఁ
గాంచితి రమ్యవస్తువులుగా నుతిగాంచినవాని కంతమున్
గాంచితి సంతసంబునిడఁగాఁ దగు వానికి మేర నెంత
యున్, గాంచితి దర్శనీయములు కౌతుకదాయుల
కెల్లనున్ దుదన్॥ 33

మ॥ అనవద్యంబుగ నీసరస్సలిల మిట్లాబ్రహ్మ సృష్టించి
యున్, బునరుక్తంబగునట్టులేటి కమృతంబున్ వెండియున్
సృష్టిచేసెనొ? పీయూషరసంబువోలె నిదియుం జెన్నా
రఁగా లేదా? స, జ్జనతాసేవ్యత నొప్పదో? యొసఁగదో?
సర్వేంద్రియాహ్లాదమున్. 34

మ॥ నయనాబ్జంబులఁ దన్పునెంతయుఁ బ్రసన్నత్వంబుచేతన్
ద్వగింద్రియసౌఖ్యంబొనఁగూర్చు శైత్యవిధి నెంతేనిన్
సుఖస్పర్శమై, ప్రియమై పద్మసుగంధియై తనువుఁ బేర్మిన్
ఘ్రాణమున్ స్వాదుతా, లయమై నాల్కకు హంసగీతిఁ
జెవి కుల్లాసంబుఁ గల్పించెడిన్. 35

శా॥ ఏతద్దర్శనతృష్ణచేతననియే యెంతున్ శివానర్మలీ
లాతజ్జుం డుడురాజశేఖరుఁడు కైలాసాద్రివాసాధిక
ప్రీతిన్ వీడఁడు చక్రియే నిఁక సుధాశ్రీఁ గేరు నేతత్సరః
స్ఫీతాంబుప్రకరంబు వీడి లవణాబ్ధిన్ జేర నుంకించునే. 36

వ॥ అని విచారించి దక్షిణతీరంబుఁ జేరి గుఱ్ఱంబు డిగ్గి, పల్యాణంబు దీసి మహీతలలుఠితోత్థితంబును గృహీతఘాసంబునగు తురంగంబుఁ గాసారంబునకుం గొంపోయి నీరుద్రావి స్వేచ్ఛమై స్నాతంబగు నద్దాని సమీపవర్తియగు నొక వృక్షంబునకుఁ గట్టి కత్తిచేఁ గొన్నిదూర్వాంకురములఁ గోసి దానిముంగల వైచి తాను నీరంబు డిగి తానంబులాడి చాతకంబుంబలె జలమయాహారంబు గావించి సమీపనికుంజంబునం దుత్తరీయంబు తలగడగా నొక్క శిలాతలంబునఁ బరుండె. 37

గీ॥ ఆసరస్సున కుత్తరమందునుండి
యాలకించెను మొదల నింద్రాయుధమ్ము
చెవుల నిక్కించి యటు మోముచేసి వినెడు
నతి మనోజ్ఞ మమానుష మైనగీతి. 38

వ॥ ఆలకించి విజనంబగు నచ్చోట నమానుషగానంబునకు
నిదానం బరయువాఁడై . 39

మ॥ అవనీనాయకుఁడంతవాజిఁ గృతపర్యాణం బధిష్ఠించి త
చ్ఛ్రవణానందపురఃప్రయద్ధరిణ సంసన్నీతతన్మార్గుఁడై
లవలీలుంగలవంగవంజుళనవేలావీథులన్ బోవుచున్
శివుసిద్ధాయతనంబుఁజూచెనొకటన్ జిత్రంబురంజిల్లఁగన్.

గీ॥ పవననిర్ధూత కేతకీప్రసవధూళి
భూషితుం డౌచుఁ జని ధృతభూతిమాడ్కి
మహిత నవ్యచతుస్స్తంభమండపమున
నున్న హరుఁ గాంచె భక్తిసంపన్నుఁడగుచు. 41

వ॥ తద్దక్షిణమూర్తి నాశ్రయించి యభిముఖాసీనయై కృత
పాశుపతవ్రతయై 42

గీ॥ సైంహికేయూర్తి నీశ్వరు శరణుఁ జొచ్చు
చంద్రమూర్తిన్ బలెన్ సంతసం బొసంగి
ఇంపుమీఱంగ వీణవాయించుచున్న
నిండు జవ్వని యగు నొక్క నెలఁతఁ గాంచె. 43

వ॥ కాంచి తదీయసౌందర్యంబునకు విస్మితుండై తనలో-
ఆహా! అప్రార్థితంబులుగ సుఖంబు లుదయించుఁ దొలు
దొల్త వేఁటకుఁబోయి యనవసరంబుగాఁదురంగముఖ

మిథునంబు వెంట నంటియీప్రదేశంబుఁ గనుగొంటి. అం
దు సలిల మన్వేషించువాఁడనై మనోహరంబును సిద్ధజన
లాలితంబగు నీసరోవరంబుఁ గనుఁగొంటి. తత్తీరంబునం
దు విశ్రమించువాఁడ నమానుషంబగు గానంబు నాక
ర్ణించితి. దాని నభిలక్షించి చనువాఁడ దివ్యకన్యకఁగాంచి
తి. ఈమె దివ్యకన్యయనుటలో సందియంబులేదు. ఈయతివ
యాకారమే దివ్యత్వంబుఁ దెలుపుచున్నది. ఇత్తన్వి
నాలోచనపథంబు నుండి తొలఁగకయున్నచో. 44

కం॥ జవ్వని నీ పే రెయ్యది ?
యెవ్వతవీ ? విందు నుండ నేమికతం ? బీ
జవ్వనమున వ్రతరతవై
యివ్విధి నుండ న్నిమిత్త మెఱిఁగింపఁగదే. 45

వ॥ అని యడిగెదఁ గాకయని యందొకచోట నుపవిష్టుండైన
నక్కాంతయు గీతావసానంబున మూకీభూతవీణయై
యీశ్వరునకుఁ బ్రదక్షిణనమస్కారంబు లాచరించి
పార్శ్వంబున నున్న చంద్రాపీడుం జూచి. 46

గీ॥ స్వాగతమె నీకు నోమహాభాగ! యింత
దేశమున కీర లిటు లరుదెంచినారు
లెందు మార్గశ్రమంబు మీ కుండనోపు
నతిథిసత్కృతి నేఁ డంది యరుగవచ్చు. 47

వ॥ అనిన నేనును శిష్యుండంబోలె నక్కన్యక ననుసరించి
చనుచుఁ దదీయగేహంబుఁజొచ్చి యొక్కద్వారశిల
నుపవిష్టుండనైన నాపెయుఁ బర్ణపుటంబున జలంబు తెచ్చి
యీ నమ్మా! యనుగ్రహంబె చాలుఁ దావకావలోక

నంబె పవిత్రీకరణసమర్థంబగుజలంబని తదీయోపచారంబు దూరానతంబగు శిరంబుచే గ్రహించిన నక్కాంత వేఱొక శిలయందుండి కొంతసేపై నపిదపఁజంద్రాపీడునిస్వవృత్తాంతం బడుగుడు దిగ్విజయము మొదలు తద్దేశాగమనమువఱకుఁ జెప్ప విదిత తద్వృత్తాంతయై యాకన్య భిక్షాకపాలం బుం గొని వృక్షంబులకడఁ దిరుగుడు స్వయంపతితంబు లగు ఫలంబులచే నద్ది నిండుడుఁ జంద్రాపీడుకడనుంచిన నాతండామె తపశ్శక్తిఁ గొనియాడుచు శుచియై ఫలంబు లారగించిన నాపెయుఁ గృతఫలాహారయై శిలాతలోపవిష్ట యగుడుఁ జంద్రాపీడుండు సవినయంబుగ నిట్లనియె. 48

చ॥ అడుగఁగఁ జేయుచున్నయది యాపిననాగక మానుషత్వ
పుఁ, జడిమ మదిఁ వెతఁ గొలుపఁజాలదయేని ననుగ్ర
హింపు మె, క్కడ జననం ? బిదే మొదలికాంతి,యె
టఁ గనియుండ మిట్లు గ్రొం,బడుచుఁదనంబునఁ వ్రత
ముపాలయిపోవుట కేమి హేతువో. 49

వ॥ అనిన నమ్మానిని ముహూర్తంబు చింతాకులయై కన్నీ రుగార దుఃఖించి యెట్టకేలకు ధైర్యంబు గొని యాతని కిట్లనియె. 50

గీ॥ బాల్యమాదిగ వైరాగ్యపరతనున్న
పాపురాలను గడు మందభాగ్యురాల
మామకోదంత మది విన్న నేమివచ్చు
నైనఁ జెప్పెద విను మిష్టమేని మదికి. 51

క॥ నీకుం గర్ణపథంబునఁ
దాఁకియయుండఁగవచ్చు ధరణీపాలా!

నాకంబున లావణ్య
శ్రీకం బచ్చరలపిండు చెలఁగు నటంచున్. 52

సీ॥ పదునాల్గుజాతులు భాసిల్లు వారిలో
విధిమనంబున నుద్భవిల్లె నొకటి
వేదంబులందుండి వెలసె వేఱొక్కటి
యొకఁ డగ్నిలోనుండి యుదయమయ్యెఁ
బవనంబునుండి యుత్పన్నమయ్యె మఱొక్కఁ
డొకఁ డమృతంబులో నుద్భవించె
జలములోపలనుండి జన్మించె నొకటి
యర్కాంశువులనుండి యలరె నొకటి

గీ॥ ఒకటి చంద్రాంశువులనుండి యొకటి భూమి
నుండి వేఱొండు మెఱుపులనుండి యొకటి
మృత్యుదేవతనుండి భూమిని జనించె
రెండు దక్షాత్మజాతలనుండి వెలసె. 53

వ॥ ఆ దక్షాత్మజాతలగు మున్యరిష్టలలో మునియనునామెకుఁ జిత్రసేనాదులగు పదియేనుగురు సోదరులలో గుణాధికుండును బదియాఱవవాఁడు చిత్రరథుండను కుమారుండు గలఁడు. 54

గీ॥ అతఁడు విఖ్యాతవిక్రముఁడై బలారి
కొకఁడు తాన సుహృచ్ఛబ్దయోగ్యుఁ డగుచు
అసి రుచిశ్యామితాత్మభుజార్జితంబు
నైన గంధర్వరాజ్యంబు నధిగమించె॥ 55

సీ॥ అతని వాసం బట కనతిదూరమునందు
కొమరారుఁబో హేమకూట మనఁగ

అంద తదీయబాహారక్ష్యమాణులై
గంధర్వు లెవ్వు డసంఖ్యాకు లుంద్రు
అతనిచే నిర్మితంబై చైత్రరథమునా
నొప్పు విఖ్యాతి నీ యుపవనంబు
అతనిచే ఖానితంబయ్యె నచ్ఛోదంబు
నా సుప్రసిద్ధమౌ యీసరస్సు

గీ॥ అతనిచేతన స్థాపితుం డయ్యె సకల
భక్తజనకాంక్షితామరపాదపంబు
సేవితాఖిలకిన్నరసిద్ధచార
ణేశ్వరుండైన యీ భవానీశ్వరుండు॥ 56

గీ॥ ఈయదియటుండని మ్మింక నా యరిష్ట
కొమరుఁడు ద్వితీయగంధర్వకులమునందుఁ
జిత్రరథుచేతనే యభిషిక్తుఁ డగుచు
హేమకూటంబ వాసమై యేలుచుండు. 57

ఉ॥ ఇందుమయూఖమందు జనియించిన యాకొలమందునుం
డి; యే,మందుమయూఖజాలగళితాఖిలశీతమయూఖసత్కళా
బృందముచే స్సృజింపఁబడి పెంపిడునో యన నొక్కయ
ప్సర, శ్చందనగంధి గౌరివలె జన్మమునొందెను గౌరి
పేరిటన్. 58

గీ॥ అమరధుని నబ్ధికై వడి నామెఁ బెండ్లి
యాయె రెండవగంధర్వనాయకుండు
హంసుఁడను వాతఁ, డతనితో నతనుతోడ
రతియుఁ బోలె మెలంగె నారాజముఖియు. 59

చ॥ అనుపమభోగభాగ్యముల నంది వెలింగెడునట్టి చారుతా
ఖనులగు తల్లిదండ్రులకుఁ గల్గితిఁ బెన్వెతఁగూర్చు దుఃఖభా
జనమగు నేనొకర్తఁ దనుజాతనుగా నటులైనఁ దండ్రినా
జననము సంతసించెఁ దనుజన్మునికంటె నపత్య ముండ
మిన్. 60

గీ॥ అంతఁ బదియవదినము సంప్రాప్త మగుడు
వేదకార్యంబులను యథావిధిగ జరపి
జనకుఁ డెంతయు నామేనిచాయఁబట్టి
చేసె నభిధానమును "మహాశ్వేత" యనుచు. 61

గీ॥ ఇట్లు పితృమందిరంబందె యేను మధుర
వాణినై బాల్యమగుటచే వీణపగిది
నొకరితొడమీఁదనుండి వేఱొకరితొడకుఁ
దిరుగుచున్ గారవంబుతోఁ బెరుఁగుచుంటి॥ 62

వ॥ అంతఁ గ్రమంబుగా యౌవనవతి నగు నంత 63

ఉ॥ రాలుగరంగఁబాడ భ్రమరాలు దినాంతశనైశ్చలత్సమీ
రాలు పికాంగనోక్తిమధురాలు లసత్సుమసౌరభప్రసా
రాలు సుపుష్పితామ్రనికరాలుచిరాలున వచ్చె వారసా
రాలు యువాళిపాలిటివరాలు వసంతమువాసరాళిగన్.

వ॥ అట్టియెడ 65

శా॥ ఈయచ్ఛోదసరోవరంబునకు నేంతే మోదమొప్పారఁగా
మాయమ్మన్ వెనుదాఁకి స్నాన మొనరింపన్ వచ్చి యం
దందదా, త్రాయణ్యాలిఖితాత్రసంస్థితశిలాసంస్థాన శర్వ
ప్రతి, చ్ఛాయారూపము లాత్మనెంచుచు నమస్కా
రమ్ముఁ గావించుచున్॥ 66

సీ॥ ఇది మధులోలషట్పదభుగ్నసుమగుచ్ఛ
మండితంబగు లతామండపంబు
ఇది పికనఖవినిర్యదమందమకరంద
కోరకంబగు సహకారకంబు
ఇది బర్హిరావబిభ్యదహిపరిత్యక్త
వాటి శ్రీచందనావనిజకోటి
ఇది సుమనోరజఃపదలగ్నకలహంస
చరణకులము తీరతరుతలంబు
గీ॥ ఇది లతాసన్నిబద్ధమై యింపొసంగు
కుసుమితవనేందిరాత్యనుకూలడోల
అనుచుఁ దత్తన్మనోహరత్వాతిశయము
నరయుచు సఖీజనంబుతోఁ దిరుగుచో నొకట. 67
గీ॥ వికసితంబయిమించు నవ్విపినమందు
మందగంధవహాసీయమానమగుచు
ముక్కునకు విందొనర్చెను దిక్కృతాన్య
పరిమళంబగు నొక సుమపరిమళంబు॥ 68
గీ॥ ఎక్కడిది యీపరీమళం బెన్నఁడేనిఁ
గాంచినారమె! యిది యనాఘ్రాతపూర్వ
మనుచు నొకకొంతముందరికరిగి పూవుఁ
బాలుపుచను దెంచు దిక్కుగాఁ బోయిపోయి. 69
సీ॥ శివుదృశాగ్నికి వంటచెఱుకైన మరునికై
మఱిమఱి తపియించు మధువనంగ
అఖిలకలావాప్తికై వ్రతంబూనిన
కలికంఠతలమానికంబనంగ

శూలిని దనకు దాసునిఁ జేసికొనుదీక్ష
లోనున్న పచ్చవిల్తుండనంగఁ
దమకుఁ బదేపదే దైత్యారి రాకుండ
హరిని ధ్యానించు జయంతుఁడనఁగ

గీ॥ బహుళతేజంబుచేఁ దటిత్పంజరంబు
నందు నుజ్జ్వలదనలంబునందు గ్రీష్మ
సూర్యబింబంబునందున్న సూటివెలుఁగు
మునికుమారునిఁ గనుగొంటి ముదముఁగంటి॥ 70

మ॥ నుదుటందీర్చిన యావిభూతికలనాన్యూన ప్రకాశం
బునా, వదనంబందలి బ్రహ్మవర్చసమునా వక్షస్థలోన్న
త్యసం,పద యాబాహులతీరు నాకనులసౌభాగ్యంబు
వీక్షించుచోఁ, దదధీనంబుగమాఱకుండునో చిత్తం
బెట్టి పూఁబోఁడికిన్॥ 71

గీ॥ ఒక్కపాణిఁ గమండలు వూని యొక్క
పాణి జపమాలఁ బూని తపస్తటాక
జలజినీబిస మనసొప్పుజన్నిదంబు
వరలుతన్మూర్తి మఱచిన మఱపురాదు॥ 72

గీ॥ మధుసమాలోకనానందమగ్నయైన
వనమహాలక్ష్మి చిఱునవ్వువలె వెలుంగు
తన్మునికుమార కర్ణావతంసితంబుఁ
గుసుమమంజరి నేఁగనుఁగొంటి నచట॥ 73

వ॥ కనియిట్లు తత్పరిమళంబు దిక్కృతాన్యామోదంబని నిశ్చ
యించి యాతపోధనతరుణుంజూచుచునాత్మగతంబున॥74

మ॥ అహహా! యేమనఁబడ్మసూతి యసమానాకారనిర్మాణ
ని, ర్వహాణోపస్కరణ ప్రభూతతర సంభారైక సామగ్రి,
యి, మ్మహి లావణ్యమయుల్ మనోభవుని నిర్మాణంబు
గావించి యీ, మహనీయుంబొనరించె నాతనికి వేమా
ర్లన్నిటల్ మిన్నగాల్. 75

గీ॥ సకల జనలోచనానందుఁ జంద్రుఁ జేసి
ధాత సిరికిందులైన పద్మముల గముల
చేఁత యేతన్ముఖాభ్యాస సిద్ధికొఱకె
కారణంబేమి సమవస్తు కలనమునకు. 76

గీ॥ చంద్రుకళలెల్ల బహుళ పక్షంబునందు
సూర్యుని సుషుమ్న ముఖమునఁ జొచ్చునంద్రు
మిథ్య యిది తత్కళల్ వీనిమేనుఁజొచ్చు
నట్లుగాకున్నఁ దపసి కీయంద మెట్లు. 77

వ॥ అని యిట్లు చింతించు నన్ను. 78

క॥ నవయౌవనైకసులభుం
డవిదితమర్యాదుఁ డసదృశాకార రతుం
డవిచారితగుణదోషుఁడు
పువ్విలుకాఁ డంత నేఁచఁబూనె నృపాలా. 79

ఉ॥ అంత నిమేష మంథరితమా లవకుంచిత దక్షిణాక్షితోఁ
గంతు శరవ్యథాకులను గావుమటంచు వచించురీతి నా
స్వాంతమిదే త్వదర్పణముసల్పితిఁ గొమ్మనులీల నార్త నీ
చెంతకు వచ్చినాననుచుఁ జెప్ప నటించుకనేపుచూచితిల్.

చ॥ లలిఁ దదుపాంత మింద్రియ కలాపముచేఁ బరిణీయ
మానయుం, బలె మునుముందుకుల్ హృదయపద్మము

చేఁబరిక్రమ్యమాణయుం, బలె, నీఁకవెనుకనుండి సుమ
బాణునిచేతను బ్రేర్యమాణయుం, బలె నయి నెట్టకేల
కటు బ్రాణమునిల్పితి నేమి సేయుదుర్. 81

గీ॥ లోన మరునకు సందీయఁబూన ననఁగ
వెడలె నిట్టూరుపులు మారవిశిఖభీత
కరణిఁ నెంతయుఁ జలియించె గాత్రయష్టి
స్వేదవాఃపూళితం బనఁ జెదరె లజ్జ. 82

క॥ శాంతుండగు నీతనిపై
స్వాంతము లగియించె మనసిజాతుం డయ్యో!
యెంతటి మూర్ఖుఁడో యేటికిఁ
గాంతామనముల్ విచారకలనాలసముల్. 83

క॥ ఎక్కడ! నీ తేజోగ్రహా
మక్కట! యెక్కడ! నవిద్యదామోదితమా
యిక్కామువిచేష్టిత మీ
ఫక్కి యెఱింగియును నేను పరవశ నైతిన్. 84

ఉ॥మదనుఁడలంఘ్యశాసనుఁడు,మాధవుఁడాకడుదుండగీఁడుదు
ర్మదమును బెంచు,జవ్వనముమంచిదికా, దిఁకనింద్రియంబు
లో, కుదురుగనుండ,వెంతొ యనుకూలము కాలము,మా
రుఁడింతకున్,జెదరఁగఁజేయఁడే యతనిచిత్తముఁ గాడుపు
దీపముంబలెన్. 85

వ॥ అంత నమ్మునినందనునకు.

సీ॥ నూతనాగత మీనకేతన ప్రత్యగ్ర
మంబన రోమోద్గమంబు వెడలె

మత్సన్నిధికివచ్చు మార్గంబు బోధించు
 కరణి నిట్టూర్పులు కదలఁబారె
వ్రతభంగభీతకై వడి వెంటవెంటనే
 కరమందు జపమాల కంపమందె
రెండవజపమాలరీతి స్వేదాంబుశీ
 కరపంక్తి గండభాగమున వెలసెఁ
గీ॥ దత్ప్రదేశంబు నుత్తానతారకంబు
మదవలోకనవిస్తార్యమాణ మగుచుఁ
బొలుచు నేత్రద్వయంబుచేఁ బుండరీక
మయముగా నెల్లరకు జ్ఞాప్యమానమయ్యె. 87
వ॥ అంత నేనును దదీయవికారాలోకనద్విగుణీకృతావేద
ననై క్షణకాలం బనిర్వచనీయంబగు నొక్కదశ ననుభ
వించి యాత్మగతంబున - అనేకసురతలీలోపదేశోపాధ్యా
యుండగు మకరకేతనుండె యితనికి విలాసంబు లుపదే
శించుఁగాఁబోలు లేనినాఁడు వివిధరసలలితంబులగు నిట్టి
చెయిదంబులయం దప్రవిష్టుండగు నితని కీదృష్టియెట్లు?
అక్షరంబులేకయే దర్శనమాత్రంబుచే నంతర్గతంబగు
భావ మెఱుకపఱచెడు నిట్టి లావణ్య మెట్లు చేకూరెడు?
అని తలంచుచుఁ దత్సహచరుఁ బ్రణామపూర్వంబుగా
నిట్లంటి. 88
క॥ పేరేమి ? యొవనిసుతుఁ డితఁ
డోర ! యనాఘ్రాతపూర్వమై గంధం బొ
ప్పారెడు నియ్యది యే పృ
థ్వీరుహకుసుమమంజరియొ నివేదింపఁగదే. 89

వ॥ అనిన నతండు నా కిట్లనియె. 90

మ॥ కలఁడుర్విన్ ముని శ్వేతకేతువన నొక్కండుజ్జ్వలాకారరే
ఖల మారున్ నలకూబరున్ గెలుచు విఖ్యాతుం;డతం డొ
క్కనాఁ, డలమందాకినిపుత్రకుం దిగుచు దేవారాధనా
ర్థంబుగా, జలజంబుల్ గొనిరాఁ జనన్ మధుకరాంచత్ఫు
ల్లపద్మాటవిన్. 91

గీ॥ పుండరీకోపవిష్టయా పొలఁతి లక్ష్మి
తన్మనోజ్ఞతచే మది తలఁక నంత
సమవలోకాధిగతరతి సౌఖ్యయైన
యాపెకుదయించె నందొక్కయర్భకుండు. 92

వ॥ అప్పు డమ్మచ్చకంటియుఁ బచ్చవిల్కానిఁబోలు నక్కు
మారు నుత్సంగంబునం జేర్చి శ్వేతకేతుపుంగనుంగొని
మహామునీ! యీతండు నీకుమారుండు చేకొనుండని
యొసంగిన నాతండును బాలకుఁ జేరఁదీసి బాలోచితక్రి
యాకలాపంబులు నెఱవేర్చి పుండరీకంబున నుద్భవించు
టచేఁ బుండరీకాభిధానంబుఁగావించి సమస్తకలాపరిపూ
ర్ణుఁ జేసె. ఆతండ యీతండు. ఇఁకఁ బుష్పమంజరీవృత్తాం
తంబు వినుము. నేఁడు చతుర్దశీతిథియగుటచేఁ గైలాసేశు
సేవింప నాతోఁ గైలాసవిపినమార్గంబుగా వచ్చు నీతని
కిందలి వనదేవత సప్రణామంబుగా స్వామీ!యిది యతి
లోకంబగు తావకాకారంబున కలంకారమగుత మని
యొసంగిన పారిజాతసుమమంజరి యని యిట్లతండు చెప్పు
చుండఁగనే యాతపోధనయువకుండు చిఱునవ్వునవ్వి
నన్నుఁ గని యిట్లనియె. 93

క॥ అతివా? యేటికిఁ బ్రశ్న
ప్రతిప్రశ్నము లిది యభీష్టపరిమళమేనిన్
మతి నీకు దీనియం దభి
మతమేనిం గొనుము కుసుమమంజరి ననుచున్. 94

గీ॥ తనదు చెవినుండి తీసి యాతలిరుగుత్తి
నాదు చెవినుంచఁ దత్స్పర్శనమున నాకుఁ
బరఁగెఁ బులకలు; మత్తను స్పర్శవలన
నతనికిని జాఱెఁ జేనుండి యక్షమాల. 95

వ॥ అతండును మత్తనుస్పర్శసుఖపారవశ్యంబున నది యెఱుంగఁడయ్యె నేనును దదీయబాహాపాశాలింగనంబునుంబోలెఁ దజ్జపమాలం గొని కరంబునం బూనితి నిట్లుండ ఛత్రధారిణి యగు మదీయచేటి నన్నిట్లనియె. 96

గీ॥ స్నాన మొనరించె నీతల్లి సదన మేగ
సమయమయ్యెను సలుపుమా స్నాన మనుడుఁ
బ్రథమ సృణిహతి నవనాగవధువుఁబోలెఁ
గదలితి సరస్సునకు నతికష్టముమెయి॥ 97

వ॥ అప్పుడు రెండవమునికుమారుండు తదీయ ధైర్యభ్రంశంబుం గనుంగొని కించిత్ప్రకటిత ప్రణయ కోపుఁడునుం బోలె నిట్లనియె. 98

సీ॥ చెలికాఁడ! నీవిట్లు తలఁకఁగా నేటికి
నీచజనాచరణీయ మిద్ది
ప్రాకృతుఁడటు మోహాపకుఁడవయ్యెదె? తపో
ధనులనంగను ధైర్య ధనులుగారె

నీదు ధైర్యం బేడ! నీమనోజయ మేడ!
నీ కులాగతమైన నిష్ఠయేడ!
గడియలోపల నిట్లు గంగలోఁ గలిపెదే
గురులచే నుపదిష్టసరణియెల్ల
గీ॥ నిష్ఫలంబయ్యె నక్కటా! నీదుప్రజ్ఞ
బూదిఁబోసిన ఘృతమయ్యె నీదు చదువు
హస్తగళితాపహృతమైన యక్షమాల
సైతము నెఱుంగ వీజాడ చనునె నీకు. 99

వ. అనినఁ బుండరీకుండు మిత్రమా! నన్నేల యన్యథా
తలంచెదవు? 100

క॥ అపమార్గవృత్తియై నా
జపమాలను సంగ్రహించి చన నెంచెదు నీ
చపలాయతాక్షి దగు నీ
యపరాధము నోర్తునొక్కొ యని నావలనై. 101

ఉ॥ ఓవనజాక్షి! పైనిడకు మొక్కెడు గేని మదక్షమాల నా
కీవిడకుండ నేగఁదగునే యన నేను మదాస్యదర్శన
శ్రీవికచాక్షుఁడున్ విగతచిత్తుఁడు నౌ మునిపుత్త్రిచేతికే
కావళిఁ దీసి యిచ్చితిని గంఠమునుండి గ్రహింపుమం
చొగిన్. 102

గీ॥ ఏమి యిచ్చితినోగూడ నెఱుఁగకుండ
నదియ జపమాలిక యటంచు నతఁడు గొనియె
నేను స్వేదకృతస్నాననైన మరల
సాఁగితిని స్నానమాడఁ గాసారమునకు. 103

వ॥ ఇట్లు చని జలకమాడి తల్లితో గృహంబుఁ జేరి తదాయత్త చిత్తనై కన్యాంతఃపురంబుఁ జొచ్చి తద్విరహాభారాసహమాననై యెచ్చటనుంటినో యేమిచేయుచుంటినో నిద్రించుచుంటినో మేలొ్కనియుంటినో గూడఁ దెలియక సఖీజనంబును బంపి యేకాంతంబున గవాక్షనిక్షిప్తముఖినై యాదిక్కునే యాతండుండుటచే నలంకృతయుంబోలె నిధానగర్భయుంబోలె దర్శనసుభగయుంబోలెఁ జూచుచు నాదెసనుండి యేతెంచు పవనంబునైనను వనకుసుమపరిమళంబు నేసిఁ దుదకు శకుంతారావమును సైతముఁదద్వార్తనడుగఁ దలంచుచునుండఁగా నా తాంబూలకరండవాహిని యగు తరలిక యాస్థితి యందున్న నన్నుఁ గని మెల్లగా నిట్లనియె. 104

ఉ॥ పైదలి! నీచెవిఁ దివిజపాదపమంజరినుంచె నెవ్వఁ డచ్ఛోదసరోవరంబుకడఁ జూచిన యమ్మునియుగ్మమందొకం,డేదొ వచింప నావెనుకనే చనుదెంచి సమంచితోక్తిమై, నాదరమొప్పఁగా నడిగె నర్మిలితో నినుఁగూర్చి యీగతిఁ. 105

కం॥ ఎవ్వనికూఁతురు మీచెలి?
యివ్వని కెందులకు వచ్చె? నెందు నివాసం ?
బవ్వనజాక్షికిఁ బేరెది?
యవ్వా! యంతయును నాకు నానతియీవే. 106

వ॥ అనిన నేనును భర్తృదారికజన్మప్రకారంబు విశదంబుగఁ జెప్పియిప్పుడు గంధర్వావాసంబగు హేమకూటంబున కేగుచున్నదని వక్కాణించిన నేమియో యోజించుచు

ముహూర్తమాత్ర మూరకయుండి యనిమిషదృష్టితోఁ
జాలసేపు నన్నుఁ బరికించుచు సానునయప్రార్థనంబుగా
మరల నిట్లనియె. 107

గీ॥ బాల్యమైనను సద్గుణభవ్యవంచు
బాలరో! నీదురూపె చెప్పకయ చెప్పఁ
గాన నావిన్నపంబును గరుణతోడ
సఫల మొనరింప నెంతయుఁ జాలు దీవు. 108

గీ॥ అట్టు లాతండు వల్క నే నిట్టులంటి
దేవ! మీబోంట్ల కిట్లాడఁ దీరునొక్కొ?
సుకృతము వినాగ మముబోంట్లఁ జూడనైనఁ
జూడ రన నాజ్ఞ జాడ వేఱాడనేల. 109

ఉ॥ కావునఁ దావకాజ్ఞ విధిగా సెలవిచ్చి యనుగ్రహింపు
నాఁ, గా విని యాత్మ నన్న సఖిఁగా నుపకారిణిఁగా
ననుప్రదం, గా వెసఁజూచుచున్ స్వయముగానె తమాల
రసాన నక్కరా, ళేవా లిఖించి మీసకియ కిమ్మనె నం
చని చూపఁ బత్రికన్. 110

గీ॥ శబ్దమయమయ్యు లోనఁదత్స్వర్గసుఖముఁ
గోలుపు తద్భావచే స్మరాంకురము లొదవఁ
జదివితి వయస్య మృదులహస్తంబునుండి
పత్రికను గొని యందున్న పద్య మిట్లు. 111

ద్విపద:- పువుఁబోఁడిరో! యాశపుట్ట, మృణాళ
ధవళమై యొప్పు ముక్తాలతచేత
మాయయచ్చుపడ నామానసభవము
రాయుంచఁబోలె దూరము లాగినావు. 112

వ॥ ఆసమయంబున. 114

మ॥ విసముం గ్రోలినవానికిన్ గునుకటుల్ వీతాధ్వుఁడౌ వానికిన్
దెసతబ్బిబ్బగుకైవడిన్ బహుళరాత్రింబోలెనుంజీఁకుమా
నిసికిన్ మూఁగకు నాల్కకోసినటు తన్నిష్ఠాత్మనౌనాకహా!
యసలే మ్రుక్కఁడి, దానిపైఁబడి సెమన్నట్లయ్యె నద్దానిచే.

గీ॥ తాపసకుమారకుని పునర్దర్శనమునఁ
గృతమహాపుణ్యుఁగాఁ జెలి మతిఁ దలంచి
చెక్కిళులపైని ముంగురుల్ చక్కనిడుచు
నంటినిటు స్వామి భృత్యమర్యాదవీడి॥ 115

శా॥ అర్ణోరాశిగభీరుఁడాతఁ డెట నీకాలోకితుండయ్యెనో
తూర్ణంబొప్పఁగ నేవిశేషముల నీతోఁగూడి భాషించెనో
పూర్ణాబ్జానన! ఎంతసే పతనిప్రాపుంబాయవో దెల్పవే
కర్ణానందముగాఁగనంచిటు దివాకాలంబుఁ బోఁబుచ్చినన్.

గీ॥ అంత నాదు మనస్సరోజాంతరాళ
రాగ సమభాగుఁ డట్లుగా రవియు లోహి
తుండగుచు, మున్న జక్కవల్ దుఃఖవార్ధి
డంబుగా నంబరతలావలంబి యయ్యె. 117

గీ॥ రాగసహితార్క కిరణాను రక్తిగానఁ
దమ్మిపూసెజ్జఁ బవళించి కమ్మవిల్తు
వేఁడియుమ్ముల వెతఁగొన్న జాడ సైత్య
లాంఛితంబన నాతపలక్ష్మి యొప్పె. 118

గీ॥ గైరికాద్రి జలాపాత గాఢపాట
లంబులయి జలజాతవనంబునుండి

వెడలు వన్యేభయూథంబువిధము సూర్య
కిరణములు చూచుచుండ నేకీభవించె॥ 119

గీ॥ గగనసంచారవిశ్రమకాంక్షులైన
రవిహయంబుల సంతోషరచితహేషి
కారవప్రతిరవముతో మాఱుమ్రోఁగ
వాసరంబును మేరుగహ్వరము సొచ్చె. 120

వ॥ అట్టిసమయంబున మదీయచ్ఛత్రగ్రాహిణి యేతెంచి
నాతో నిట్లనియె. 121

గీ॥ ఆమునికుమారులం దొకఁ డక్షమాల
కనుచుఁ దలవాకిటనె యుండె నని వచింప
నేను మునిపుత్త్రుఁ డన్నంతనే ప్రవేశ
పెట్టు మని యన్య కంచుకిఁ బిలిచి పంప. 122

వ॥ అంత నొక ముహూర్తములో. 123

సీ॥ రూపంబునకు ననురూపమై దనరారు
నవనవమా యౌవనంబు పగిది
ఆ నవనవయౌవనావిర్భవంబున
కనువుకాఁడౌ ననంగునివిధంబు
ఆ యనంగునకు సహానుకూలంబైన
లలిత వసంతకాలంబులీల
ఆ వసంతంబున కనుగుణంబై యొప్పు
దక్షిణానిలము సంతానమట్లు

గీ॥ అతని కనుకూలసన్మిత్రుఁడైనవాని
డంబుగలవానిఁ జంద్రాతపంబు వెనుక

వెడలు బాలాతపంబట్లు వృద్ధసౌవి
దానుయాయిఁ గపింజలు నరసి యంత. 124

గీ॥ ఎదురుచని తత్పదంబుల కెఱఁగి యాస
నోపవిష్టునిఁజేసి యచ్ఛోదకములఁ
బాదములఁ గడ్గి తడియొత్తి యాదరించి
కూర్మిఁ దత్సన్నిధిని గ్రిందఁ గూరుచున్న. 125

గీ॥ అప్పు డేమో వచింప మదంతికోప
విష్టయగు తరలికపైన దృష్టిపఱుప
నంటి నేనప్పు డీమచ్ఛకంటి నాదు
తనువుకంటెను వేఱుగాఁ దలఁపవలదు. 126

వ॥ అని చెప్పిన నాతండును నిశ్శంకముగా నావలను
మోమై 127

సీ॥ రాజపుత్రిరో! నోరురాదేమి చెప్పుదుఁ
బలుకనీయదు నన్నుఁ బాడు సిగ్గు
కందమూలాహార ఖాదియు శాంతంబు
వనవాసియగా మౌనిజన మదేడ?
అనుపశాంతము విషయాలవాలము రాగ
వంచితంబగు నీప్రపంచ మేడ?
అనుకోక యే నరు నక్కటా! యీశుండు
పరిహాసమునకును బాత్రుఁ జేయు

గీ॥ వల్కలంబుల కిది తగవా? జటాధి
ధారణంబున కిది యుచితంబొ, లేక
తపమునకు నిది సదృశంబొ, ధర్మనియతి
కంగభూతంబొ, యుసి! తెలియంగరాదు॥ 128

గీ॥ చెప్పఁదగు ముఖ్యముగ నొండు చెయిద మేది
గానరా దొండు దిక్కును గానరాదు
చెప్పకుండినఁ జేటగుఁ జెలిమికాండ్ర
ప్రాణము లెటేని రక్షింపఁ బాడిగాదె॥ 129

ఉ॥ ఏఁచినకిన్క నీయెదుటనే యటు నిష్ఠురమాడి యంతనే
నాచొటువాసి యొక్కవిటపాంతరితాంగుఁడనౌచు నీవు
వో, నాచపలాత్ముఁడొక్కరుఁడ యచ్చట నెట్లు వసించు
నంచువే, చూచుడు నాతఁ డందునొకచోఁ గనరామికిఁ
జోద్యమందుచున్. 130

సీ॥ చిత్తసంభవపరాయత్తచిత్తుం డౌచు
నా కాంతవెనువెంట నరిగె నొక్కొ
ఆ కాంతయును జన నాత్తవిజ్ఞానుఁడై
సిగ్గుచే ననుఁజూడఁ జేరఁడొక్కొ ?
కోపించితినటంచుఁ గ్రుద్ధుఁడై నామీఁద
ననువీడి యెటకేనిఁ జనియెనొక్కొ ?
నేనెందొ యనుచు నన్వేషించుతలఁపుతో
నిటనుండి యెటకేని నేగెనొక్కొ ?

గీ॥ యనుచు నజ్ఞాత తద్విరహంబుచేతఁ
గొంతచింతించి తుద కనుఁగొంటి నిట్లు
ధైర్యహీనుఁడు మరణమేఁ దలఁచు నతఁడు
సిగ్గదెంతటిపనినైనఁ జేయుఁగాదె. 131

గీ॥ కాన నొంటరిఁగాఁ జేయఁగాదటంచు
నేఁ దదన్వేషినై యెల్ల యెడలరోసి

యెందుఁగనరామిచే దిగులొంది మరలఁ
దిరిగితి నికుంజముల సరస్తీరములను.

వ॥ ఇట్లు వెదకి వెదకి యెందును గానరామిఁ దదశుభాకాం
క్షినగుచు నంత. 133

మ॥ ఒకకాసారసమీపదేశమునఁ బుష్పోత్కర్షమై పుష్పలి
ట్ప్రకరాఢ్యంబయి కోకిలాకలకలోన్నిద్రంబునై బర్హిణ
ప్రకరాలంకృతమై మనోహరతరప్రారంభమై యామ్రమవృ
క్షకదంబాంచితమై చెలంగెడు లతాకాంతారమం
దాకర్ణికా. 134

సీ॥ ఏకాకిగాఁగ నాలోకితుండయ్యును
బుష్పశరాఢ్యుఁడై పొలుచువాని
శూన్యాంతరంగుఁడై చూడంబడియు మనో
వాసితదయితుఁడై వరలువాని
ఊరకనొకచోట నుండియు నాకృతి
చేత మన్మథుబాధఁ జెప్పువాని
నిశ్చంచలుండయ్యు నిజవర్తనంబందు
నత్యంతచంచలుండైనవాని

గీ॥ అంత రసలాఢ్యమౌ చందనావనీజ
మటు నిదాఘనదీప్రవాహంబు కరణిఁ
బ్రాతరంభోజినీవైరిభాతి మ్లాను
నతి కృశీభూతు నతిసితు నతనిఁ గంటి. 135

గీ॥ వామసద్గండ శయనమై వరలు చేయి
వాని, నుపలోపవిష్టుఁడౌ వానిఁ బుండ

రీకుఁ గని దుఃఖితుండనో నాకుఁ గలిగె
లోలలోచన! యిట్టు లాలోచనంబు. 136

గీ॥ మదనుఁ డెంతయు నప్రతిమానబలుఁడు
క్షణములో నిట్లు దురవస్థ నలిపె నితనిఁ
గానిచో నింతపాటి విజ్ఞానరాశి
యేల? యనుపదమేమఱి యిట్లు మాఱు. 137

గీ॥ చిత్రములలోన నెంతయుఁ జిత్ర మిద్ది
శైశవంబాది మిగుల నస్ఖలితవృత్తి
యగుచు మాబోంట్ల కాదర్శమై చెలంగు
నీతఁడే జడీకృతుం డయ్యె నేమి యందు. 138

గీ॥ వేయేల పుష్పసాయక
సాయకముల కెదురు లేదు శర్వుఁడె సగమై
పోయె నన నరునివశమా
నా? యరుదస్ఖలిత యౌవనం బింత కిలన్. 139

వ. అని యిట్లు తదంతికంబున కేగి తదుపవిష్ట శిలాతలైక దేశంబునందె యేనును గూర్చుండి తదంసావసక్తకరుం డనై యనున్మీలితలోచనుండగు నతనిఁగూర్చి యో పుండరీకా! యేమిది యనుడు సుచిరసంమీలనాలగ్నం బుంబోలె నన్నయనంబు విప్పి నన్నుంగనుంగొని నిట్టూర్పునిగుడించి లజ్జావిశీర్యమాణాక్షరంబుగ మెల్లన నిట్లనియె.

క॥ విదితాఖిలుండవయ్యును
బదేపదే యిట్టు లడుగఁబాడియె నాఁగా

నది విని మదనార్తివశం
వద మీతని హృదయ మంచు వందిరి లోనన్॥ 141

వ॥ దుష్పథప్రవృత్తుండగు సుహృదుండు సుహృదునిచే నవశ్యంబు శక్తికొలంది నివారణసేయుండని మనంబునందలంచి యిట్లంటి. 142

చ॥ విమలుఁడవీవు నీవెఱుఁగవే? యిది యేమి? గురూపదిష్టమా
ర్గమొ? నయశాస్త్రదృష్టమొ? సుఖప్రదమో? మునివర్త
నంబొ? మో, క్షముఁగయిసేయునట్టిదియొ? సద్వ్రతమో?
తగునయ్య? నీవివే, కము సకలంబినీ! యడవిఁగాచిన వె
న్నెలయయ్యె నింతకున్॥ 143

క॥ స్మరహతకుచేత నెంతయుఁ
బరిహాస్యుఁడ నైతి నంచుఁ బరికింపవుగా
కరరే సజ్జనగర్వా
స్థిరవిషయసుఖంబులందుఁ జిత్తం బేలా? 144

గీ॥ ధర్మబుద్ధిని విషలతఁ దడుపనెంచుఁ
గలువపూఁదండ యని కత్తిఁ గౌఁగిలించు
మండునిప్పును గ్రహియించు మణియటంచుఁ
జెడువిషయసౌఖ్యముల కాసపడు నతండు. 145

గీ॥ అన్నియు నెఱింగి యేల యిట్లయ్యెదయ్య!
నీమనంబునె నియమింప నేరకుంటి
ధైర్యమూనుము నీకెంత దర్పకుండు?
పారఁదోలుము యీదురాచారు మారు. 146

వ॥ అని యిట్లు నేను చెప్పుచుండఁగనే కండ్లనుండి గాఢనీరు దుడుచుకొనుచు నాకరంబుఁబట్టుకొని మెల్లగా నిట్లనియె.

శా॥ కావున్నందును నీవులక్షితుఁడవీ కందర్పబాణాళికి
ట్లోవేళ్ణ వచియింపవత్తు సఖుఁడా! యేవాఁడుచేతస్వియా
నేవాఁడంతయుఁ జూచునోవినునో యింకేవానికిఁ ధారణా
ప్రావీణ్యంబలరారునోయతఁడెగాపాత్రుండగుఁ బోధకుఁ 148

గీ॥ నాకో యీ సర్వమెన్నాళ్ళనాఁడో పోయె
ధైర్యమడుగంటె జ్ఞానంబు దగ్ధమయ్యె
నాత్మవిజ్ఞానమన్నది యసలె మాసె
నిలిచియున్నవి ప్రాణముల్ నేఁటికెట్లో. 149

శా॥ ఆకర్ణింపుమ బోధ కిద్ది సమయంబా? కాదు, ధైర్యప్రభో
ధాకారావసరంబా పోయె నది దూరాపాస్తమై లేనిచో
నీకంటెఁ మఱి బోధకుండు గలఁడే నీకంటెనిష్టాప్తుఁడుఁ
నాకున్నాఁడె యెటేనినీమదన సంతాపంబుఁబాపందగుఁ. 150

గీ॥ ఉడుకుచున్నవి యంగంబు లొడలుమంటఁ
బొరలినట్లుండె మానసంబో దహించు
కొనుచుఁ బోయెడుఁ గంటికా కూర్కురాదు
ఏమియొనరింతొ యన్నిటి కీవ గలవు. 151

క॥ అని యూరకున్న సవినయ
సనిదర్శన సేతిహాస శాస్త్రోక్తులతో
మనమునకు నచ్చఁజెప్పియు
వినకుండుటఁ గని యతండు విహ్వలమతినై. 152

గీ॥ స్మరదశాపరమావధిస్థానమందె
నీతని మరల్ప నెవ్వరిచేతఁగాదు

వనికిరావుపదేశముల్ ప్రాణ ధృతికిఁ
జేతనై నంతసాయంబుఁ జేయవలయు. 153

వ॥ అని తణ్ణంబ యచ్ఛోదసరోవరంబునకుం జని సరసంబులగు తామరతూండ్లను జలలవాంచితంబులగు పద్మదళంబులను గైరవంబులను జేకొని యాలతామండపంబునందే సెజ్జఁగావించి యందుపవిష్టుండగు నాతనికిఁ గైత్యోపచారంబులు చేయు నాకు మనంబున నిట్లు దోఁచె. 154

సీ॥ త్రిజగమందును జిల్కతేజివానికిఁ జేయ
గారానిదేదియుఁ గానరాదు
హరిణంబువలె నరణ్యావాసుఁ డవిదగ్ధ
లోకుఁడౌ యీపుండరీకుఁ డేడ
ఎక్కడ! స్మరసతీ ధిక్కృద్వదురుకలా
రాశియౌ గంధర్వరాజపుత్రి
దురుపపదంబులై వరలునర్థములందు
నైత మీ యతనుండు సంచరించు

గీ॥ ఎట్టి కొమ్మలు దిరిగిన జెట్టియేని
నితనిబారినిబడి యింక నేగలేఁడు
పూలతోఁగెల్చి నితఁ డెట్టిపోటుబంట్ల
మారుఁబోలెడు నసహాయశూరుఁ డెవఁడు. 155

సీ॥ మోముఁ జంద్రుఁడనంగ ముడుచుపద్మినిగూడ
నిందునిరాకకై యెదురుచూచు
ఎండయేలాటిదో యెఱుఁగనికుముదినీ
కాంతయు నినునికై కలవరించుఁ

బగలన్న నెంతయు బద్ధవైరముఁ జూపు
నిశవాసరంబుతో నేస్తమూనుఁ
బిండారఁబోసినట్లుండు వెన్నెలకూడఁ
గటికచీఁకటితోడఁ గలసియాడు
గీ॥ మెఱయుఁ జపల యచపలయై మేఘమందు
ముదిమియును జవ్వనంబుతో నొదిఁగియుండుఁ
జేతనముమాటలేల యచేతనములె
తాఱుమాఱగు మరుఁడె లోఁదలఁచెనేని. 156

గీ॥ ఇట్టి గాంభీర్యనిధియైన యితఁడె తృణము
వలె లఘూకృతుఁడయ్యెఁ బూవిలుతుచేత
నెక్కడ! తపంబు మఱియెడ! యీయవస్థ
యప్రతీకారదుర్దశ యావహించె. 157

గీ॥ ఎవరి శరణంబుఁజొచ్చెద? నెవరు దిక్కు?
ఎచటికేగుదు? నిఁకఁ గార్యమేమి? యితనిఁ
బ్రాణము లొసంగి బ్రతికించుపాటివార
లేరొ యంచును మదిలో విచార మొదవె॥ 158

వ॥ మఱియు నీ లేనిపోని చింతతో నేమి? శుభంబుచేనేమి యశుభంబుచేనేమి యేతత్ప్రాణసంరక్షణం బవశ్యకర్తవ్యంబు, మహాశ్వేతాసంగమంబువినా యయ్యది యసాధ్యంబు, బాలభావంబుననో యప్రగల్భతావిలసనంబుననో యితండు మదనపరవశుండయ్యును స్వయముగా నేగి మనోరథం బీడేర్చుకొనఁజాలఁడు. అన్యులేగినఁ గాల విళంబనంబు సైఁపలేఁడు. అతిగర్హితకృత్యంబులచేతనైనను సుహృత్ప్రాణంబులు రక్షణీయంబులు వేఱుతెఱం

గేమి? యవశ్యంబు మహాశ్వేతకడకేగువాఁడఁ గలతె
అంగెల్ల విన్నవించెదఁగాక యని చింతించి యనుచిత
వ్యాపారప్రవృత్తుండనని యెఱింగి లజ్జితుండై నన్నువా
రించునేమో యను భయంబున నియ్యది యతని కెఱిం
గింపకయె యెద్దియో నెపంబున నటనుండి వచ్చితి నవ
సరం బేగుదెంచెఁ దాదృశానురాగంబునకును మదాగ
మనంబునకును దగిన ట్లొనర్ప నీవ తగుదని నేనేమి
చెప్పుదునో యని మన్మథాసక్తదృష్టియై యూరకున్న.

గీ॥ అంతఁ దద్వాక్యముల నేను నాలకించి
మహిత శృంగారరసవార్ధి మగ్ననగుచు
బహిరుదంచత్కుతూహల ప్రకటితాత్మ
దశనగుచు నిట్లు దలఁచితిఁ దత్క్షణంబ. 160

చ॥ ననుబలె నామహాత్ముని ననంగుఁడు పీడితుఁ జేసె, బాధపె
ట్టిన నను నాకు మేలునె ఘటింపఁగఁ జేసెను నీయవస్థయో
యనృతముగానిచో మదను నంతహితుండుపకారిచుట్టముం
డునె? కలనేఁ గపింజలునుడుల్ వితథంబులు గావుగా
విఁకన్. 161

వ॥ అని చింతించుచు నతని కేమి సమాధాన మొసంగుదు
ననుకొనుచుండఁగనే ప్రతీహారిప్రవేశించి భర్తృదారికా!
నీవస్వస్థశరీరవని పరిజనంబువలన నెఱింగి మహాదేవియిట
కేతెంచుచున్న దనుడుఁ గపింజలుండు మహాజనసంమర్ద
భీరుండై సత్వరంబ లేచి నన్నుఁ జూచి, 162

గీ॥ చాలఁదడవయ్యె నే వచ్చి చనఁగవలయు
సూర్యుఁ డస్తాద్రిశిఖరంబుఁ జొచ్చుచుండెఁ

బోయివచ్చెద సుహృదసుపోషణార్థ
మంజలి యొనర్తు నిదియ నాయభిమతంబు. 163

వ॥ అని చెప్పి కపింజలుండేగిన నంతం దల్లియు నేనున్నకడ కేగుదెంచి చిరకాలముండి యేగె నేమియొనర్చెనో యేమిచెప్పెనోగూడ శూన్యహృదయనగు నాకెఱుకపడ దయ్యె నట్లు తల్లి యేగుటయు సూర్యుం డస్తమించుట యుం దిమిరమావేశించుటయుంగనుంగొని కింకర్తవ్యతా మూఢనై తరలికంజూచి తరలికా! యేమిచేయుదు నేమి చేయుటకును నింద్రియంబులు వశంబులు గాకయున్నవి. ఇప్పుడునీసమ్ముఖమ్మున నేగదా కపింజలుండిట్లుచెప్పిపోయె అన్యకన్యకంబోలె ధైర్యంబుదొలంగిసిగ్గునుగ్గుంజేసిజనాప వాదంబుదలంపక శీలంబునకుందిలోదకంబొసంగి రాగాంధ ప్రకృతినై తల్లిదండ్రులయాజ్ఞలేకట కేగుదునంటినా? గురుజ నాతిక్రమంబు వలననధర్మంబుచేకూరు, ధర్మానుసారం బుగ నిటనేయుండి చనిపోయెదనంటినా? ప్రథమప్రణయి యగుకపింజలుని స్నేహరసంబునకు భంగంబగు నదియు నుంగాకమదదధీనచిత్తుండగు పుండరీకునకుమత్కృతాశా భంగంబువలన నొకవేళం బ్రాణాపాయంబు గలిగినం గల్గ వచ్చు నట్లైన మునివధ జనిత మహాపాతకంబునకుం బాత్రురాలనయ్యెదనని యిట్లు చెప్పుచుండంగనే చంద్రో దయజనితంబగు విరలవిరలాలోకనంబుచేం గుసుమపరా గంబుచే వనరాజింబోలెం బ్రాగ్దిశధూసరత్వంబువహించెం బదంపడి. 164

గీ॥ హరిణలాంఛన హార్యక్షహన్యమాన
ఘోరసంతమసాటవీకుంభికుంభ
సంభవామూల్యమౌక్తికజాలచూర్ణ
పాండురిత మనఁ బ్రాగ్దిశాభాగ మొప్పె. 165

గీ॥ ఆత్మనాథేందుమండమందావలోక
నంబుచేతను జిఱునవ్వునవ్వు రాత్రి
కామినీమణి సితదంతకాంతివోలె
నిశకు ముఖకాంతిఁ గూర్చి వెన్నెల దనర్చె. 166

గీ॥ భుజగలోకంబునందుండి భూతధాత్రి
బ్రద్దలొనరించుకొని యట్టే పైకివచ్చు
ఫణిఫణామండలముఁబోని పంకజారి
మండలము చేతఁ గడు నిశామహిళ యొప్పె. 167

గీ॥ రతికలహక్రుద్ధరోహిణీరమ్యపాద
కమలయుగళ నమస్కార గాఢలగ్న
చరణలాక్షారుణుఁడువోలె వరలుచంద్రుఁ
గాంచి తలఁచితిఁ దలఁకి యీకరణి నాత్మ. 168

మ॥ ఒకచోటన్ మధుమన్మథప్రభృతులయ్యో! యొక్కచో
నిట్లు దు, ర్వ్యకటుండౌ శశి త్రాళసీఁడితని యావిర్భాతి
దాహజ్వరా, ధికుఁడౌ వానికి నగ్నివృష్టియె ధరిత్రిన్
సీతుచేస్రుకుకు వా, నికి వేయేటికి నక్కటక్కట! హిమా
నీసేచనంబేసుఁడీ॥ 169

గీ॥ చంద్రు నుదయంబు సాయాహ్నసమయమందుఁ
బుండరీకంబులను నిద్రపుచ్చినట్లు

అట్లు చింతించుపట్లనే యరుగుదెంచి
మూర్ఛయును నాదుకన్నులమూసె నంత॥ 170

వ॥ అప్పుడు తరలికయు నవిచ్ఛిన్న బాష్పజలధారాంధకారి
తముఖియై శైత్యోపచారంబు లొనర్చి కొంతసేపునకు
మూర్ఛదేఱిననన్నుం గనుంగొని కృతప్రణామయైసాద
రంబుగా నిట్లనియె॥ 171

గీ॥ ఏమి ఫల మింక సిగ్గుతో నిపుడె నన్నుఁ
బంపుగొనివచ్చెదను నీదు ప్రాణనాథు
లెమ్మయట కేని పోదము లేమ! వేగ
దర్పకుని దాడి కీవింకఁ దాళలేవు॥ 172

వ॥ నావుడు మహాశ్వేత 173

గీ॥ ఏల యిట్లందువొక మరుం డేమిసేయు
సర్వసంశయహర్త్రియై శశియు వచ్చెఁ
జేర్చు నీతండె మన కేల చిక్కు, మృత్యు
సమ్ముఖంబో కుమారుని సమ్ముఖంబొ॥ 174

చ॥ పదయటెపోదమింక మెయిఁ బ్రాణములుండిన నాకు
నిట్టియా,పదఁగయిసేసి కష్టములపాలొనరించిన జీవితేశు
స, మ్మదమునఁగాఁగిలింతునని మానసమందనుకొంచు
బోవఁబో, నదరెను దక్షిణాంబకమహా! విధి యేమియొ
నర్పఁ బూనెనో॥ 175

సీ॥ పీయూషమును గురిపించున ట్లంభోజి
నీవైరి లేఁతవెన్నెలలు గాయ
వికచకైరవగంధ విమలాంబువులఁగాంత
లింటింట శశికర్ఘ్య మిచ్చుచుండఁ

బతులకై స్వామినీప్రహితలా దూతికల్
రాజవీథులఁ బ్రచారంబు సేయ
నీలావగుంఠనోన్నిద్రలై రేయెండఁ
గని యభిసారికాంగనలు పార

గీ॥ వేఁబ్రదోషంబునం దేగృహీత వివిధ
కుసుమతాంబూలసహితయై కూడవచ్చు
తరలికయె తోఁడుగాఁగ నెవ్వరికిఁ గంటఁ
బడక సౌధంబు డిగ్గి చొప్పడిన పేర్మి॥ 176

గీ॥ పారిజాతకుసుమగుచ్ఛపరిమళావృ
తంబు, రిక్తీకృతోపవనంబు నగుచు
ముసిరివచ్చెడు నెలదేఁటి మూఁకచేత
నీలవస్త్రావగుంఠన లీలఁ దాల్చి॥ 177

వ॥ ప్రమదవనపక్షద్వారంబు దారిగాఁ దత్సమీపంబుఁ జే
రంజను తరలికాద్వితీయపరిజన నగు నన్ను నేనే యవ
లోకించుకొని యాత్మగతంబున॥ 178

చ॥ రతిపతిసజ్జచాపుఁడయి రా వెనువెంటనె దూరతఃప్రసా
రిత కరుఁడౌచు వెన్నెలలతేఁడు కరంబుగొనన్ బదేపదే
గతికటురాగమూఁతమొసఁగంగ మనం బదిదారిఁజూపఁ
గాఁ,బతికడకేగుకాంతలకు బాహ్యసహాయకకోటి యె
టికిన్॥ 179

క॥ అనుకొనుచు నిట్లు తరలికఁ
గని, యీశశిహతకుఁడయ్యొ గారించునొకో
ననుఁబోలెఁ బుండరీకుని
ననుదున్ జీఋనవ్వనవ్వి యాకెయిటాడెన్॥ 180

గీ॥ రాజపుత్రిరో కడు ముద్దరాల వీవు
పుండరీకునిమాట యటుండనిమ్ము
ఇతఁడు నినుఁజూచి మదనపీడితుఁడువోలెఁ
జేయుచున్నాఁడు శృంగారచేష్టితముల॥ 181

సీ॥ ముద్దాడుఁ బ్రతిబింబమూర్తిచ్ఛలంబుచేఁ
జెమటగ్రాల్కెడు నీదు చెక్కుటద్దోయిఁ
గరములుసాఁచుఁ జక్కఁదనాలకిక్కలై
కొమరారు నీగబ్బిగుబ్బలందుఁ
దాఁకు రసావేశతత్పరుండై నీదు
పైఁజివఁడ్డాణపుఁ బట్టెరవలు
పడు స్వచ్ఛతర నఖ ప్రతిబింబమిషనీదు
తమ్ములంగెరు పాదమ్ములందుఁ

గీ॥ బూను మన్మథతాపంబుఁ బూనువాని
బలెఁ దపచ్చందనాలేప పాండిమంబు
కోరి పండును స్ఫాటికకుట్టిములఁ
గ్రుంకు లిడు నదె చెంగల్వకొలఁకులందు. 182

వ॥ అని యిట్లు మాటలాడుకొనుచు నద్దేశంబుఁ జేరంజని వచ్చుదారిలోఁ గాళ్ళకంటిన పుష్పాదులఁ గైలాసశిఖరి నుండి చంద్రకిరణంబులకుఁ గరఁగి ప్రవహించు చంద్ర కాంతప్రవాహంబులఁ గడిగికొనుచు నెచ్చటఁ బుండరీకుఁ డుండెనో యాయచ్ఛోదపశ్చిమతటంబునుండి దూరంబగు టచే నవ్యక్తంబైన యొకరోదనంబు వినియితఃపూర్వంబె దక్షిణాంబకస్పందనంబుచేనునంబున శంకవొడమిన నేను కేవల మిద్దానిచే విదీర్ణహృదయనై తరలికంజూచి

యేమిది యని యడగి కొంతదవ్వరిగి దూరంబైనను
నిశీథప్రభావంబుచే వ్యక్తస్వరంబగు నార్తనాదం బిట్లు
వింటి. 183

శా॥ హాతుచ్ఛుండ హతుండ వంచితుఁడ నాహా మోసముం
జెందితిఁ, జేతోజాతపిశాచ! యేమియిది, యోసీదుర్వి
నీతా! మహా, శ్వేతా! నీకితఁడేమిపాప మొనరించెఁ
ఘూర్త! మందానిలం, బా! తీరెంగద నీమనోరథము,
పాపా! చంద్ర! ధన్యుండవా. 184

గీ॥ హాతపోరాశి! శ్వేతకేతూ! తనూజ
లోల! యెఱుఁగవు నీకొంపగూలు టెల్ల
నీదు ముద్దులకొమరుండు నాదు సఖుఁడు
కట్ట! యేమందు మదిఁ జిచ్చుపెట్టిపోయె॥ 185

సీ॥ సంభవించునె? యిట్టి సత్యవ్రతుం డింక
సత్యమా! నీవనాశ్రయమవైతి
పుట్టునే? యిట్టి తపోరాశి యిఁకముందు
తపమ! యెంతయు నిరాధారమైతి
వెలయునే? యిఁక నిట్టి విద్యాబ్ధి నీవు వా
గ్లలనరో కడునిరాలంబవైతి
నెగడునే? నీకిట్టి నీతివర్తనుఁ డింక
న్యాయదేవత! నీవనాథవైతి

గీ॥ ధర్మమా! నీవు దరిలేనిదానవైతి
జ్ఞాని యీ పుండరీకుండు లేనికతన
ఘనుఁ డితం డొక్కరుఁడు లేని కారణమున
నయ్యో! శూన్యంబవైతి సురాలయంబ॥ 186

మ॥ చెలికాఁడా! గడెసేపు నాకయి నిరీక్షింపందగున్ వచ్చె
దన్, నిలువంజాలను నిన్నుఁబాసి క్షణమేనిన్ బ్రాణమి
త్రున్ గపింజలు నన్యుంబలె నొంటిమై విడిచిపోఁజన్నే?
సుహృద్ధర్మమే?, శిలగా మారఁగనేల? వెన్నయగు నీ
చిత్తంబు నేఁడీగతిన్॥ 186

ఉ॥ ఎవ్వనిఁబల్కరించెద నిఁకెవ్వని మిత్రమ! యంచుఁ బిల్తు
నిం,కెవ్వనిఁ జేరఁబోదుగతి యెవ్వఁడు పిల్చినఁబల్కువయ్యో
నీ, మవ్వపుఁగూర్మియెల్ల నెటమాయము చెందెను లేచిరమ్మ
యం, చివ్విధి వింటి నెచ్చెలికి నేడ్చు కపింజలు నార్త
నాదమున్॥ 187

క॥ అది విని పైప్రాణముపైఁ
జెదరఁగ వేగమున నటకుఁ జేరితి నెట్లో
పదే పదే నిమ్నోన్నత
పదమగుటం జేసి తొట్రుపడుచున్ బడుచున్. 188

వ॥ అట్లు పోయి యాయచ్ఛోదసరస్సున కనతిదూరంబున
శీకరాసారవర్షియగుచంద్రకాంతశిలాతలంబుపైఁబూసె
జ్జయందున్నవాని నతినిశ్చలుండగుటం జేసి మత్పాదశబ్దం
బునాకర్ణించువానింబోలెను; మన్మథవ్యథతోఁబాటుప్రా
ణంబుసైతమువీడి నిశ్చేతనసౌఖ్యంబనుభవించువానింబో
లెను; అనంగయోగవిద్య నుపాసించువానింబోలెను; హృ
దయనిహితంబగు వామహస్తంబుచే-ఓప్రాణప్రియురాలా
నాప్రాణంబులతోఁగూడ లేచిపోవలదని హృదయస్థిత
నగు నన్నుఁబట్టుకొనియున్నవానింబోలెను; అంతికమున
నచిరకాలోద్గతంబులగు ప్రాణంబులమార్గముంజూచు

వానింబోలెను నొప్పుచు నుద్విగ్నుండై యున్న కపింజలుచే
నాలింగితుండై 189

సీ॥ అర్ధచంద్రుని కెనయౌ లలాటంబున
గంధత్రిపుండ్రముల్ గలుగువానిఁ
దామరతూండ్లలో దారంబె నెమ్మెన
నొంటిజన్నిదముగా నొప్పువాని
ఏను నాఁడొసఁగిన యేకావళియె జప
మాలగాఁ గంఠానఁ గ్రాలువాని
అనఁటిగర్భములోని యాకుఁబోలెడు చారు
చీర మంసంబుపైఁ జెలఁగువానిఁ

గీ॥ గప్పురపుఁబొడి భస్మమై యొప్పువాని
శంబరారివ్రతైకవేషంబుఁ బూని
మత్సమాగమమంత్రంబు మది జపించు
వానివలె నొప్పుచున్న యవ్వానిఁ గంటి. 190

గీ॥ పాఁపపుడమికిఁ గొంపోవఁ బడినరీతి
నార్తమూర్ఛాంధకారనై యంత నేను
ఏమి యొనరించితినొ? మఱి యెవ్విధంబు
గాఁగ విలపించితినొ? జ్ఞప్తిఁగాంచఁజాల. 191

ఉ॥ చేతము కర్కశంబగుటచేతనొ? పాడుశరీర మకటా!
రోఁతలపాలుగావలయు రోజులువచ్చెనొ?పూర్వదుఃఖమే
రీతిగనే నవశ్యము భరింపఁగనాటనొ? మేనినుండి యే
హేతువుచేతనో వెడల వేమి వచించెద నాదుప్రాణముల్.

వ॥ అంతఁ జిరకాలంబునకు మూర్ఛదేఱినదాననై జీవితేశు
నుపలక్షించి॥ 193

చ॥ సరసుఁడ యిద్ది నీకు సరసంబె దయారహితుండవై యి
టూం, టరిననుఁజేసిపోయెదె, కటా? మఱి నీకొఱకెట్టులై
తినో, తరలిక నడ్గుమా తెలియు దబ్బరలాడెదుదానఁ
గాను;గా, నరె మలయానిలాదులు దినంబు యుగంబుగ
వెళ్ళఁబుచ్చుటల్॥ 194

గీ॥ ఆర్త ననురక్త బాల ననన్యశరణ
మదనపరిభూత ననుఁగావుమా! మహాత్మ!
దరిసెనంబిమ్ము! కోపమందంగ మీకు
నేను చేసిన యపరాధ మేమి గలదు॥ 195

గీ॥ అన్న! జీవంబుతో నింక నున్నదాన
నెవతెకై యిట్టి దురవస్థ నీవు గంటి
వట్టి మునిసుత ఘాతుకి యట్టి పాపు
రాలు ననుబోటి వరమకిరాతి గలదె॥ 196

క॥ అకటా ! నీకడ నుండక
సకి పిలిచె నటంచుఁ జనితి సదనంబునకున్
సుకుమార! నీవ పోయిన
సకియలతో నేమి? యేమి సంబంధులతోన్? 197

వ॥ అనుచు నెలుంగెత్తి పట్టరానితమకంబున నేదిక్కును
దోఁచక. 198

ఉ॥ దేవతలార! మీరో వనదేవతలార! మఱీరో తల్లి భూ
దేవిరో! నీవో! యోభగవతీ రజనీసతి! నీవో యోమహా
దేవనిరంతరైకవసతీ! రజితాచల నీవో నావిభుం, బ్రో
వరె కావరే యనుచు భూతపరీతనుబోలె నేడ్చుచున్.

గీ॥ ఏమి! యేకావళీ నీవయేని నిల్వ
లేకపోతివె నేవచ్చుదాఁకఁ బతిని
అంచు దూరుచు బ్రతికింపవయ్య! సఖుని
నని కపింజలు పాదంబులందుఁ బడితి. 200

గీ॥ అని నివేదించునపుడె దుఃఖాతిరేక
చిత్తయై మూర్ఛపడియె నాచిగురుఁబోఁడి
రాజసుతుఁడును జేలాగ్రవీజనాది
శైత్యవిధులఁ బునర్లబ్ధసంజ్ఞఁ జేసి. 201

గీ॥ నాతి! నీశోకమును నూతనంబుఁ జేసి
నట్టి పాపుండఁ జాలింపు మాత్మచరిత
మాలకించుటె భరము నీయసువు లిట్లు
చెల్లునె శుచాగ్నికిఁ వంటచెఱకుఁ జేయ. 202

వ॥ అనుడు మహాశ్వేత యిట్లనియె 203

గీ॥ అట్టివేళనె జీవించినట్టి నాకుఁ
బ్రాణములు నేఁడుచనునన్న భయ మదేల
రాజనందన! నిర్భాగ్యురాల నాకు
నయ్యొ! దర్శన మిచ్చునే యంతకుండు. 204

గీ॥ పలుకుటకు వినుటకును దుర్భరమటంటి
వింతకంటెను దుర్భర మేమిగలదు?
ఏదురాశాపిశాచిచే నింతదనుక
బ్రతికియున్నదొ విను మీయభాగ్యురాలు. 205

గీ॥ అట్లు విలపించి విలపించి యంతనాదు
ాలియ నీక్షించి పేర్చుమా చితిని వేగ

ననుగమించెదఁ బ్రాణేశు నబ్బఁగాక
నందనోద్యానముననైన నాథుఁబొందు. 206

వ॥ అని యెట్టకేలకు మరణంబునకుఁ గృతనిశ్చయనై యుం
డునంత. 207

సీ॥ నవరత్న సత్ప్రభానాటితోన్నతకిరీ
టంబువాఁ డురులలాటంబువాఁడు
ఉభయకర్ణాందోళితోద్దండమణికుండ
లంబువాఁ డంసచేలంబువాఁడు
స్థూలముక్తాఫలసూత్రిత దివ్యహా
రంబువాఁ డధికసారంబువాఁడు
కుటిలసద్రోలంబ కులనీలకేశపా
శంబువాఁ డతిప్రకాశంబువాఁడు

గీ॥ కైరవస్వచ్ఛతరదేహకాంతివాఁడు
విధునిమండలమందుండి వెడలి బాహు
దండముల లేవనెత్తి యాపుండరీకు
నన్నుఁ గని యిట్టులనియెఁ బ్రసన్నఫణితి. 208

క॥ ఈతనికై యేల మహా
శ్వేతా! వగ మరల నీకు సిద్ధించెడుఁబో
యేతత్సమాగమం బని
యాతం డాశవముతోడ నాకస మెగురన్. 209

శా॥ ఓరీధూర్త! దురాత్మకా! తులువ! యోరోరీమహాపాతకీ
యారీతిన్ గొని నాదునెచ్చెలిని నాయాతోడునెందేగెదో
రోరీయంచుఁగపింజలుండురుమతోనూరెత్తివోఁబల్కుచున్
దారామార్గముఁబట్టియాతనిపిఱుందన్ బోయెదుఃఖార్తుఁడై.

గీ॥ మొదలె యాపుండరీకుని మోసమునకుఁ
బీఁకెవాఱెడు నాకుఁ గపింజలుండు
గూడఁబోవుట యేమందు గోరుచుట్టు
పైన రోఁకటిపోఁటయ్యె మానవేంద్ర!. 211

గీ॥ అంత ననుఁజూచి తరలిక యనియెనిట్టు
లమ్మ యింకనైన మరణోద్యమమ్ము మాను
కలుఁగుఁ దత్సంగమ మ్మిట్టి ఘనులనోటి
మాట వృథగాదు వేయిజన్మాలకైన. 212

ఉ॥ నావుడు జీవితంబుపయినన్ గలయాసనొ? యాకపింజలుం
డేవిధినేని దర్శనమునిచ్చు సజీవత నున్న నంచునో
యావచనంబుపైన నడియాసనొ జీవితముం ద్యజింపలే
కో వసుధేంద్రపుత్త్ర! యటెయుండి నిశీథిని వెళ్ళఁ
బుచ్చితిన్. 213

గీ॥ తిరిగి యుదయంబుననె వ్రతదీక్షఁబూని
తత్కమండలు వూని తద్వల్కలములె
గట్టి తజ్జపమాలఁ జేపట్టి వ్రతము
స్థాణువుంగూర్చి తత్ప్రీతిసలుపుచుంటి. 214

చ॥ ఎవరొవచింపఁగావిని యిదెంతయు నాతలిదండ్రులిష్టబం
ధువు లరుదెంచి వారి కెటుతోఁచెనొ యట్టుల పల్కి; రంతె; త, త్ప్రవణము నామనంబు నొకపాటియునైనఁ
గదల్పఁజాలరై, రెవరితరంబు? పల్లమున కేగుజలంబు
మరల్పఁజేయఁగన్. 215

చం॥ ఎవుడు గృహంబుచేరనని యెంచెనొ మత్పిత తాని
రాశమె, నపుడె సుతాతివత్సలత నాతఁడె యిందు వసిం

చి కొన్ని నాళ్ళు పురికిఁ జేరుదుఁ నియమలోలత వన్య
ఫలాళి భుక్తిగా, జపమనుపేరఁ దత్సుగుణజాలము వేమ
ఱు లెక్కపెట్టుచుఁ. 216

గీ॥ మూఁడుపూఁటలు స్నానంబులాడి యిచటఁ
బార్వతీపతిఁగొల్చుచుఁ బరమభక్తిఁ
దరలికంగూడి యిందున్నదాన నిదియ
రాజనందన! యీదీనురాలి చరిత. 217

గీ॥ పుణ్యమా! పురుషార్థమా! భూరిశోక
జనకమగు నాచరిత్రంబు వినుట కతన
ననుచు సితవల్కలము ముఖమందుఁ జేర్చి
యాపె విలపించె దుఃఖంబు నాపలేక. 218

వ॥ అంతఁ జంద్రాపీడుండును దదీయరూపవినయమధురాలా
పాదిగుణగణంబులచేనార్ద్రీకృతహృదయుండై యమ్మా!
యేలయేడ్చెదు క్లేశభీరుండును సుఖాసంగలుబ్ధుండు నగు
జనుండు స్నేహోచితకార్యంబు నిర్వర్తింపనేరక యశ్రు
మోచన మాత్రంబుచే స్నేహంబు వెల్లడించెడిని. నీవో
యేతదర్థంబుగా 219

సీ॥ ఇంతనాఁటనునుండి యెత్తిపెంచినచుట్ట
పక్కాల కూర్మిఁ బోఁద్రోక్కినావు
ఎదుట నుండినదాన మది నిల్ప కింద్రియ
సుఖములఁ దృణముగాఁ జూచినావు
ఇంద్రు నైశ్వర్యంబు నెన్నిరెట్లో మించు
విభవమున్నను ద్రోసివేసినావు

అసలె కృశీభూతవయ్యు వ్రతాదుల
చే మేనుకృశియింపఁ జేసినావు
గీ॥ బ్రహ్మచర్యవ్రతంబుఁ జేపట్టినావు
నిర్మలతపఃప్రవృత్తిచే నెగడినావు
ఇల్లు విడి వనిలోవసియించినావు
కలరొకో నిన్నుఁబోలెడు కాంత లెందు. 220
క॥ అనుమరణ మది యవిద్వ
జ్జనమోదితమును బ్రమాదజనకంబును స
జ్జనగర్హితంబు నిస్సీ
చనునే చేయంగఁ బ్రాజ్ఞజనులకు దానిన్. 221
గీ॥ ఉపరతున కిద్ది దలఁప మోక్షోపయోగ
మో? పునర్జీవనోపాయమో! విలోక
నోపయోగంబొ? యింక నేమో? మఱేమొ?
యకట! యజ్ఞు లిద్దాని నాదరింత్రు. 222
సీ॥ మదనుఁ డీశ్వరు కంటిమంటకు బూదెగా
వెనువెంట రతి యొడల్ విడెనొకొ
కిందమశాపాగ్నికీల కింధనముగాఁ
బాండుండు పృథ మేనుఁబాసెనొకొ
తమ్మిమొగ్గరమందుఁ దాఁజావ నభిమన్యుఁ
డుత్తర మరణంబు నొందె నొకొ
సింధురా జర్జునుచే నాఁడు మడిసిన
దుశ్శల్య నెమ్మేనుఁ దొఱఁగె నొకొ
గీ॥ వల్లభుఁడు మృతుఁడైన జీవంబుఁ దాల్చి
యున్నవా రెందఱో ధాత్రి నున్నవారు

బ్రతికి చేసెడి దేదేనిఁ బరఁగుఁగాని
చచ్చి చేసెడు నదియేమి? మచ్చకంటి. 223

క॥ అదిగాక తత్సమాగమ
మొదవెడుఁ దద్వాణి నమృత ముండదు మృతుతో
నది యెట్లుండునొ యేమో
సుదతీ చిత్రములుగావె సూరుల మహిమల్. 224

సీ॥ ఉరగదష్టుకుఁ బ్రమద్వర కిచ్చి రురువాని
తనయాయు వర్ధంబు మనుపలేదె?
బభ్రువాహనుచేతఁ బడినపార్థు నులూపి
జీవమిచ్చి సజీవుఁ జేయలేదె?
గురుసుతాస్త్రాగ్నిదగ్ధుండౌ పరీక్షిత్తు
నుత్తర మొఱఁ గృష్ణుఁ డోమలేదె?
ఆ కృష్ణుఁడే మృతుండైన సందీపనా
త్మజుఁ దెచ్చి తండ్రికిఁ దార్పలేదె?

గీ॥ కానఁ దప్పేమి నీకును గలుగవచ్చుఁ
బుండరీకసమాగమాఖండసుఖము
ఇంతకును బలవత్తర మీశ్వరేచ్ఛ
స్వేచ్ఛ నింతయుఁ జేయలేరెదియు నరులు॥ 225

గీ॥ దైవికంబైన కార్యజాతంబునందుఁ
జింత వల దాత్మధైర్యంబుఁ జెందవలయు
దుఃఖములె యెల్లకాలంబు దొరలిరావు
సుఖములనె యెల్లకాలంబు చూడఁబోము॥ 226

వ॥ అనియిట్లు చంద్రాపీడుం డోదార్ప నంత మహాశ్వేతా
చరిత్ర శ్రవణసంజాతశోకుండువోలె సూర్యుం డధోము-

ఖుండయ్యె నప్పుడు మహాశ్వేత కాలోచితకృత్యంబులు నిర్వర్తించి వల్కలశయనీయంబునఁ గూర్చుండుడుఁ జంద్రాపీడుండును సాయంకృత్యంబులఁ దీర్చి యారెండవశిలాతలంబునఁ జిగురుసెజ్జపైఁ గూర్చుండి మరలనిట్లనియె. 227

గీ॥ దేవి తావకదుఃఖసతీర్థురాలు
దాసురాలును నీవనవాసబంధు
వైన తరలిక యెందేగె ననఁగ ననియె
రాజసుతునకు గంధర్వ రాజపుత్రి. 228

క॥ కాశీవంశాంబుధిరా
కాశశి, ఘనసారహారకల్పద్రుమ నా
కేశకరీశాకాశధు
నీ శశభృదహీశ కాశనీకాశయశా॥ 229

ఉ॥ పండితపుండరీక వనపంకజబాంధవ! బుద్ధిసంపదా
ఖండలమంత్రిసన్నిభ! యఖండసుధామధురోక్తిధోరణీ
ఖండితవార్షికత్రిపథగారయ! యాంధ్రవసుంధరామణీ
మండనభూత! గర్తపురమండలమధ్యజనైకమండనా! 230

క॥ అలఘుశ్రీ చెన్నపురీ
చలితాఖిలభారతప్రసక్తోద్వాహా
విలశాసనధికరణో
జ్జ్వల సానాతనికధర్మసమిదధ్యక్షా॥ 231

— * గద్య * —

ఇది శ్రీ కాశ్యపగోత్ర జగన్నాథాచార్యపుత్త్రి సకల
విద్వద్విధేయ పూర్ణ ప్రజ్ఞ నామధేయప్రణీతం
బగు నాంధ్ర కాదంబరియందుఁ
దృతీయాశ్వాసంబు
సంపూర్ణము.

ఓమ్

శ్రీహయగ్రీవాయ నమః.

# ఆంధ్రకాదంబరి.

## చతుర్థాశ్వాసము.



మధ్వశాస్త్రసంప
న్నా! మృదుమధుమధురభాషణా! హయముఖపా
దామలభక్తిసమంచిత!
ధీమద్గణవినుతచర్యా! దేశికవర్యా! 1

వ॥ అవధరింపుఁడు. అట్లు చంద్రాపీడుండు తరళికావృత్తాంత
మడిగిన మహాశ్వేత యిట్లు విన్నవించె. 2

గీ॥ వినుము! పీయూషజనితమై వెలయునట్టి
యప్సరోవంశమం దొక్క యతివ గలదు
మదిర నా, దాని గంధర్వమండనుండు
చిత్రరథుఁడు వివాహంబు చేసికొనియె. 3

గీ॥ తరుణతాశ్రీల నలరు నా దంపతులకుఁ
గలిగెఁ గాదంబరి యనంగఁ గన్య యొర్తు

నేను నామెయు నొక్క కంచాన మెసఁగి
యొక్క మంచానఁ బండితి మో మహాత్మ! 4

గీ॥ తల్లి దండ్రుల కఖల గంధర్వులకును
జీవితంబట్లు యలరు నా చిగురుఁబోఁడి
నా సహాధ్యాయినియు చిన్ననాఁటనుండి
సదయ! నా కది రెండవహృదయము సుమ. 5

ఉ॥ ఆతలి రాకుఁబోఁడి, విని యంతయు నాచరితంబిటుల్ మ
హా, శ్వేతసదుఃఖయై చెలఁగఁ జేసికొనన్ మఱిపెండ్లిచేసినన్
నాతలిదండ్రులింక జ్వలనంబొ! జలంబొ! విషంబొ! రజ్జు
వో!, యాతఁడెదిక్కునాకని వయస్యలముందు ప్రతిజ్ఞ చే
యఁగన్. 6

చ॥ జనకుఁడుఁ దత్ప్రతిజ్ఞఁ బరిచారులచే విని, పుత్రికామణిం
జనవున నొక్కమాట యనఁజాలక యొక్కతె కూఁతురా
టచే, మనముదహించిపోవ నొకమార్గము నాత్మఁదలంచి
కంచుకిన్, బనిచెను నాసమీపము శుభప్రతిభోదయ!
నేఁటిప్రొద్దునన్. 7

వ॥ ఆతం డేగుదెంచి చిత్రరథుమాటగా నా కిట్లనియె. 8

గీ॥ కోమలీ! నీదు చరితకే కుందు మాకుఁ
బైన నొక్కటి విఱుచుకోఁబడియె నిట్లు
మొత్తమున కెట్లు దారికిఁ దెత్తొ చెలిని
బెట్టితి భరంబు నీ భుజాపీఠమందు. 9

వ॥ అప్పుడు నేనును దుఃఖితనై క్షీరోదుఁడను నకంచు
కితో నామాటగాఁ గాదంబరికిఁ జెప్పుమని తరలికతో
నిట్లంటి. 10

గీ॥ దేవుఁడే దుఃఖపెట్టెడు నీవుకూడ
నేల ? కాదంబరీ ! యిట్టు లేడిపింతు
కొన్నినాళ్ళను మనకోర్కి యున్న నీకు
సలుపు పిత్రాజ్ఞ యిఁక శిరసావహించి. 11

క॥ అటు నాయానతినే య
చ్చటికే గుటయును వయస్య సద్గుణ! మీరి
చ్చటి కేగుదెంచుటయు నెటొ
ఘటనపడెడ్ రెండు నేకకాలమునందే. 12

గీ॥ అని మహాశ్వేత విరమింప నంత మాని
తనయ నిధనాత్తపాపసంతతిని నీల
లాంఛనచ్ఛలమునఁ బూనులోగుఁ బ్రమథ
పతిశిరోమండనము శశి బయలు వెడలె. 13

వ॥ అంతఁ గ్రమముగాఁ గొంతసేపటికి. 14

సీ॥ భువనముల్ చంద్రికాపూరంబులోఁ దేలెఁ
జక్రంబులు వియోగజలధిఁగూలెఁ
గుముదంబులకుఁ గ్రొత్తక్రొత్తకాంతులు హెచ్చెఁ
గమలంబులకు నసల్ కాంతి చచ్చె
మదనుండు యువతుల మనము నావేశించె
నందంద చీఁకటు లంతరించె
విటులసంచారంబు వీథులందునఁ దగ్గె
మరుని చైదములపై మనసు గ్రొగ్గె

గీ॥ మదను విరికత్తులకు మంచి పదునుగలిగె
జారిణుల కాత్మ నాశాపిశాచి తోలఁగెఁ

గోత్రకోడండ్రు తమతమగోడు లెల్ల
నాత్మపతులకుఁ జెప్పికో నదను దొరకె. 15

వ॥ అట్టిసమయంబునఁ జంద్రాపీడుండు మహాశ్వేతం బ్రసు
ప్తగా నెఱింగి నాలేమిని వైశంపాయనుం డేమి యాలో
చించుచుండెనో పత్రలేఖ యెట్లుండునోయని తలంచుచు
నిదురించె నంతఁ బ్రాతఃకాలంబున నే లేచి కృతస్నాన
విధానయై మహాశ్వేత యఘమర్షణసూక్తంబుల జపించు
చుండఁజంద్రాపీడుండును గృతప్రాతర్విధానుఁడై యుండ 16

గీ॥ పదియునారేండ్ల యీడొప్పు భవ్యమూర్తి
యైన కేయూరకునితోడ నరుగుదెంచి
తరలిక నమస్కరించి రాతనయ చెంతఁ
గూరుచుండె నతండును గూరుచుండె. 17

క॥ అంత మహాశ్వేత జపా
నంతరమున నన్నుఁ జూచి యనె నీరీతిఁ
సంతోషంబునఁ, దరలిక
యెంతటిసేపయ్యె వచ్చి యే మట వార్తల్. 18

గీ॥ కంటె? కాదంబరిని సుఖాక్రాంత యగుచు
నున్నదాకో? నాదు మాటలు విన్నదాకొ?
అనుడుఁ దరలిక యనియె నిదంత యిపుడె
యువిద నీకు వచించుఁ గేయూరకుండు. 19

గీ॥ అనుడుఁ గేయూరకుఁడు లేచి యనియె నిట్లు
అమ్మ! దృఢదత్తకంఠగ్రహమ్ముగాఁగ
నిన్ను విజ్ఞాపనము చేయుచున్న దిట్లు
నీసఖీమణి కాదంబరీ సుమధ్య. 20

చ॥ తరలిక యిట్లు చెప్పె నిది త్వత్కృతచిత్తపరీక్షణంబొకో?, గురుజనతావరోధనమొకో? గృహావాసమహాపరాధని, ర్భరనిపుణోపలంభనమొ? భావమునందునఁ గల్గు కోపమో?, యెఱింగియు నామనం బిటుల నేఁచఁగ నీకుచితంబొకో సఖీ. 21

గీ॥ సఖి వెతల ఖిన్నమౌ నాదుస్వాంతమందు
నేడ నిర్వృతి భోగేచ్ఛ, యేడ సుఖము
ఎవనిచే నిట్టి దశ చెలి కేగుదెంచె
నట్టి కాము సకాము నే నెట్టొనర్తు. 22

గీ॥ అర్కవిరహంబుచేఁగుందు నంబుజినులఁ
గాంచి స్వహావాసగరిమ జక్కవనెలంత
విభుసమాగమసౌఖ్యంబు విడిచిపెట్టు
ననఁగ నారులమాట యేమనఁగవలయు. 23

క॥ పతివిరహావిధురవై పరి
హృతపరపురుషేక్షవై యహీనచరిత! నా
మతి నుండ సతము నీవే
గతి గాపుతిఁ బరుఁడు చొరఁగఁ గలఁడు లతాంగీ. 24

గీ॥ అరయు నా నిజ మిద్ది యీ యర్థమందుఁ
గలిగె గురువాక్యధిక్కృతి వలయు సైఁప
ఈవిచటనుండి వనమున కేగితనుచుఁ
గలనునైనను ననుకొనవలదు వలదు. 25

వ॥ అని యిట్లు వచించి కేయూరకుం డూరకున్న మహాశ్వేత చిరకాలమాలోచించి కేయూరకా! నీవు చనుము నేన

యేగుదెంచి యెట్లుచిత మట్లొనర్తునని యతని వీడ్కొ-
లిపి చంద్రాపీడునివైపు మొగంబై. 26

ఉ॥ రాసుత! హేమకూటమతిరమ్యము, కింపురుషాలయంబు పే
ర్వాసిఁ జెలంగుఁ జిత్రరథపాలితమై తగు రాజధాని కే
దీ సరిపోల్పఁ బోలు గలదే? సఖి కిన్నరరాజకన్య యెం
తో సరసాంతరంగ, కనుదోయిని నిన్ను బహూకరించెదున్.

గీ॥ గమన మాయాసకరమయ్యె కలఁచ దేనిఁ
బనులతొందర లేదేనిఁ బ్రభుకుమార!
అరుగుదె మిమ్మావు నొకదిన మందు నిలిచి
తిరిగి రావచ్చు మఱుసటిదినమె యిటకు. 28

ఉ॥ ఊఱటనందె దుఃఖతిమిరోపహతంబగు నామనంబు ని
ష్కారణబంధువైన నినుఁగాంచుట, విన్పుట నాచరిత్ర చే
కూరెను దుఃఖసహ్యతయుఁ గొంచెము, సాధుసమాగమం
బు లో, సారవివేక! దుఃఖితులసైతము తామలరింపకుం
డునే. 29

క॥ అను పలుకు మహాశ్వేతకు
ననెఁ జంద్రాపీడుఁ డంత నార్యరో! నిన్నుం
గనుటాది పరవశుం డీ
జనుఁ డిఁకఁ గర్తవ్యముల విచారం బేలా. 30

వ॥ కావున భవదభీష్టంబెట్లు యట్లు పనిగొనునది యని యా
కెతో నయ్యాశ్రమంబు వెడలి క్రమంబుగా హేమకూటం
బుఁజేరి గంధర్వనగరంబు ప్రవేశించి కాంచనసప్తతోర
ణాంచితంబులగు కక్ష్యాంతరంబుల నతిక్రమించి కన్య
కాంతఃపురద్వారంబు దఱియ మహాశ్వేతాదర్శనంబున

దూరంబునుండియ కృతప్రణాముండై ప్రధావితాభ్యర్థి
తుం డగు ప్రతీహారునిచే నుపదిశ్యమాన మార్గుండై
మహాశ్వేతాపురస్కృతుండై లోనఁ బ్రవేశించి యంగ
నాద్వీపంబుంబోని యంతఃపురాభ్యంతరంబు గాంచి 31

సీ॥ కౌఁగిలింతలు సేక కలశకంఠములంద
పాదాహతు లశోకపాదపముల
దంతక్షతంబులు తాంబూలవీటుల
గోటిమీటులు వీణెపాటలంద
గండూషవాఃప్రసంగము వకుళంబులఁ
గరతాడనంబులు కందుకముల
స్తనజఘనప్రేంఖితము లుయ్యాలల, ముద్దు
గొనుటలు పిల్లనగ్రోవులంద
గీ॥ కాఁగ నిత్యోచితక్రియాకరణదంభ
మునదె యిటు సుగతాభ్యాసముం బొనర్చు
చుండిరా యనునటు లొప్పుచుండు కన్య
కలను రాజకుమారుండు గాంచె నచట. 32

ఉ॥ కన్నులె కర్ణపూరములు కైరవముల్, చినిచిన్నినవ్వులే
చెన్నగునంగరాగములు, చెల్వువహించెడియూర్పు లేగుబు
రొక్కన్నసువాసనల్, నునుమెఱుంగులమోవులె కుంకు
[మానులే
పోన్నతులాస్యమందున యియొప్పెడుఁగన్యలకందుఁజిత్రమా.
గీ॥ కోమలాంగుళిరాగమే కొమరుమీఱుఁ
జరణములయందు లాక్షారసంబుపోలెఁ

గరతలంబులై సువిలాసకమలము లటు
లలరుఁ గన్యాజనమున నయ్యంతిపురిని. 34

సీ॥ సురభిళోదార కేసరదామకాంచియు
గమనంబులకు విఘ్నకారియంట
రమణీయమగు నంగరాగంబుసైత మ
నూననిశ్వాస నిదానమంట
కర్ణపూరాబ్జసంగత భృంగకులగరు
చ్ఛ్వసనంబు నాయాసజనకమంట
లాక్షారసముతో నలంకరణంబును
బాదంబులకుఁ గడుభారమంట

గీ॥ గ్లానికరమంట మఱి యంశుకమ్ముగూడ
శ్రమకరంబఁట యవతంససుమముగూడఁ
దరమె బ్రహ్మకు నయ్యంతిపురిఁ జెలంగు
కన్నియల సౌకుమార్యంబు నెన్న ధాత్రి. 35

సీ॥ చేయూఁతలేక నెచ్చెలులఁ గన్నప్పుడ
చ్చట లేచుటలు నతిసాహసములు
ప్రతికర్మముల హారభారసమాన మందు
వక్షోజకాఠిన్య వైభవంబు
కన్యకాసముచిత కళలందుఁ బూలగ్రు
చ్చుటల ముచ్చటయు నచ్చోట మోటు
దైవతనతులమధ్యవిభంగములకు న
భావంబచట విస్మయావహంబు

గీ॥ అంతియేకాక యచటఁ బుష్పాపచాయ
మందు రెండవకుసుమంబు నందుకొనుట

గూడ యువతిజనమునకుఁ గూడనిపని
యన్నఁ దత్సౌకుమార్యంబు నెన్నఁదరమె! 36

వ॥ ఇట్టి కన్యకాజనంబుల కావాసమగు నంతఃపురంబున నొక కొంతయభ్యంతరము ప్రవేశించి యా రాకొమరుండు లవలికా! కేదంగిపుష్పాదులచే నీ లవలీలతాళి కాలవాలంబులనిర్మింపుము, సాగరికా! గంధోదకదీర్ఘికలందురత్నవాలుకఁ జల్లుము, రజనికా! తమాలతరువీథుల రత్నదీపంబుల నిలుపుము, నలినికా! పెంపుడు రాయంచలకుఁ దమ్మిపూఁదేనియలఁ ద్రావింపుము, చూతలతికా! పంజరపుంస్కోకిలములకు రసాలకిసలయంబుల నందింపుమనెడు కాదంబరీప్రత్యాసన్నపరిజనంబుల నుడుల నాలించి మఱియు. 37

క॥ చామరిక! లేని ముగ్ధత
లేమేమో చూపఁబోదు వెవని వలచితో?
కోమలి! ప్రతిబింబము ర
త్నామలకుడ్యమున, మాటలాడెద వేలా? 38

గీ॥ లోలలోచనరో! యేల? జాలపతిత
పద్మరాగమణీగణప్రభలఁ జూచి
తలఁచి బాలాతపమ్ముగాఁ దొలఁగెదీవు
పాణితల మాతపత్త్రంబు పగిదిఁ గాఁగ. 39

గీ॥ తొలఁగె దేటికి నుపహారతోయజముల
నడుగుపడిననుఁ జాఱెదు నన్న భీతి
నమలమణికుట్టిమప్రదేశములఁ దావ
కానన ప్రతిబింబంబు లరసి తరుణి. 40

గీ॥ మహిత యౌవనవిభ్రమోన్మత్తురాల!
యెఱుఁగవచ్చెను దావకీనేంగితంబు
రమ్యవక్షోజ మండలానమ్యమాన
వై మణిస్తంభకేకుల నందుకొనెదె? 41

వ॥ అను నేతాదృశంబులు కన్యాజనంబుల యన్యోన్యపరిహాసవాక్యంబు లాలించుచుఁ జంద్రాపీడుండు కాదంబరీభవనంబుఁ జేరం జని.

సీ॥ పులినతలంబునాఁ బూఁదోటపుప్పొళ్ళ
మొత్తంబుచేఁ దళుకొత్తు నదియు
దుర్దినంబట్టు లెంతో పికచ్ఛిన్నామ్ర
ఫలవృష్టి ముంగిట నలరు నదియుఁ
గాంచనద్వీపంబు కరణి గంధఫలీద
ళోపహారములచే నొప్పు నదియుఁ
జంద్రలోకంబునా సదమలశ్రీదంత
పత్రప్రభాపూర్తిఁ బరఁగు నదియు

గీ॥ అమృతజన్మదినంబునా నంగరాగ
సౌరభంబుల నెల్లెడఁ జల్లు నదియు
నైనమార్గంబుఁ దటిసి యందరసె వివిధ
మండనోపేతమైన శ్రీమండపంబు. 43

వ॥ తదభ్యంతరమున 44

ఉ॥ నల్లనికప్పడంపుశయనంబుపయిన్ ద్విగుణమ్ముగాఁగయిన్
దెల్లనిదిండు పైనిడి యతిప్రియభూషణులౌచుఁ గల్ప న
వల్లులఁబోలు కన్నియలు వందలువేలునుజుట్టికొల్వ రా
జిల్లెడు దానిరూపవతిఁ జిత్రరథాత్మజఁగాంచె నచ్చటన్.

చ॥ అనుపమరత్నచారుచరణాభరణారుణకాంతిపుంజమా
యన నఖరంధ్రమార్గమున నంతటనెంతయురక్తధారలన్
జనికెడు వేళ్ళతోడవిలసిల్లుచు భూతలతారకాగణం
బన నఖమండలంబెసఁగనామదిరేక్షణకొప్పుఁబాదముల్.

గీ॥ గురుజఘనభారమునఁ జాలఁ గుందుచున్న
పడఁతి యూరువులకుఁ దోడుపడ ననంగ
మంజులోద్గతమంజీరమణిమరీచి
మండలం బంటుఁ దత్కటీమండలంబు. 47

గీ॥ బ్రహ్మ యాయింతి నడుముఁ జేపట్ట జాతి
వితతజఘనోపలప్రతిహతిని రెండు
వాయలై చెలువారు లావణ్యవారి
పూర మన మీఱు నా సతి యూరుయుగము. 48

సీ॥ నిపతితాఖిలహృదానీకభారమున నాఁ
జను ఘనమై యింతి జఘనతలము
స్తనవృద్ధి వదనదర్శనము లేదను చింతఁ
గొని యనఁ గడుఁ జిక్కె వనిత నడుము
స్మరకృతజయసుపత్రిక స్తివర్ణాళినాఁ
గోమలి కొప్పారు రోమరాజి
అజుఁడు తాఁకినయప్పు డంటిన లలితాంగు
ళీముద్ర యన నొప్పు లేమనాభి

గీ॥ కమ్మవిలుకాని పాదపీఠమ్మనంగ
మగువ కొప్పును వక్షోజమండలంబు
దివ్యలావణ్యలహరిలోఁ దేలు మృదుమృ
ణాళము లనంగ బాహువుల్ ప్రాలుసతికి. 49

క॥ అనుపమ మణికంకణభర
జనితాయాసశ్రమాంబు జాలంబునొకో
యన, నఖకిరణవ్రాతము
లను గుఱియుచు నొప్పు నవ్విలాసిని కరముల్. 50

చ॥ స్తనభరనమ్యమానముఖతామరసం బదియెత్తిపట్టఁగాఁ
బనిఁగొనెనాఁగదీర్ఘకరపంక్తులతోఁజిబుకంబునంటుచున్
వనితకుహారమింపెసఁగువాతెఱలుంజెలువారునూత్నయౌ
వనపవనోద్ధరాగమయవార్ధితరంగము లట్లు లింతికిన్.

చ॥ గమననిరోధముల్ సలుపుకర్ణములన్ గని కినుకన్ నాఁగఁగొం
చెము కడకన్నులందెఱుపు చెన్నలరారనిజాననేందిరేం
దుముఖికి వాసభూతమగు దుగ్ధపయోధినిబోలు నక్షియు
గ్మమున సమస్తలోకమలకామిని నేత్రమయంబుఁజేసెడున్.

గీ॥ లలితనుభ్రూమనోజ్ఞంబు తిలకబిందు
భాసురమునౌచు నాయింతిఫాల మొప్పు
అమరు నామెకుఁ గర్ణపాశముల రత్న
మండితంబులు సౌవర్ణకుండలములు. 53

చ॥ హరునినిజార్ధదేహమున నర్మిలిఁదాల్చితినంచునెంతయున్
గరువముతోడ మిట్టిపడు గౌరినిగెల్వనొ నాఁగఁదద్రిపున్
విరివిలుకానిఁబూని విరివిన్ దన దేహమునందు నెల్లెడన్
సురుచిరరూపసంపదల శోభిలు నాజలజాక్షి నిచ్చలున్. 54

క॥ ఉరమున నొక సిరిఁ దాలిచి
గరువపడెడు వెన్నునణఁచఁగానో యన నా
తరుణి నిజప్రతికృతులన్
సిరులశతము లప్పుడపుడ సృష్టింజేయున్. 55

గీ॥ చిఱుత నెల యొండు దాలిచి శిరమునందు
నబ్బురంపడు హారు నవ్వు నదియుఁ బోలెఁ
జంద్రముఖ యెల్లెడల విలాసస్మితముల
శశిసహస్రంబులను వెదఁజల్లు నెపుడు. 56

గీ॥ ఇంచుకయు లేక దయ దహియించె నొక్క
మనసిజుని నీశుఁ డన్న యీసుననుఁ బోలె
నోలిఁ బ్రతిహృదయముఁ బదివేల పంచ
శరులఁ బ్రభవిల్లఁ జేయు నా సరసిజాక్షి. 57

వ॥ మఱియు రేయెల్ల మేల్కొనుటం జేసి ఖిన్నంబులగు చ
క్రవాక మిథునంబులు పరుండ నుదయంబున నే కేళీత
రంగిణీ తీరంబులఁ గమలధూళీ వాలుకల జాల పులి
నంబుల నొనరింపఁ జేయుచుఁ బరిజనంబులయందెల
మోతలచేఁ దలంగి యందరాక కొందల పఱచు
రాజ హంస మిథునంబుల మృణాళనిగడితం
బులఁ జేసి తెమ్మని హంస పాలి నాదేశించుచు
మరకతమండనమయూఖంబుల మెసవఁగోరు హరిణశాబ
కంబునకుఁ జెలియచెవినుండి తీసి యవాంకురంబు నంది
చ్చుచుఁ దాఁ బెంచిన తీవియ పూవులు పూచెనని వచిం
చు నుద్యానపాలిక నశేషభూషణప్రదానంబుచే సమ్మా
నించుచు సఖిజనంబుతో నిష్టగోష్ఠిం దేలుచుఁ గేయూర
కుం గని. 58

శా॥ ఈతం డెవ్వఁడు ? పుత్త్రిఁ డెవ్వనికిఁ, దానే పేర నేపారు, గూ
పేతీ, రేవయు, నేమనెఁ, బలికితీ వే, మెన్ను చేరెఁ మహా
శ్వేతఁ, వచ్చునె యిందటంచుఁ దనవాసిఁ గూర్చి యే

యడ్డున, బ్జాతాస్యఁ మదిరాకుమారిఁగనె నాత్మపాల
పుత్త్రిం డొగిఁ. 59

వ॥ కని తదీయరూపంబున కచ్చెరువందు నాతండు మాన
సంబున నిట్లు తలంచె. 60

గీ॥ ఏల యొనరింపఁడయ్యె సర్వేంద్రియములు
నయనమయములుగా నాకు నళినభవుఁడు
పున్నెమేమియొనర్చె నీకన్ను లహాహ
చూచుచున్నవి స్వేచ్ఛ నీసుందరాంగి. 61

గీ॥ చక్కఁదనముల కన్నింటికొక్కయిక్క
గాఁగ నొనరించెఁ బో దీనిఁ గమలభవుఁడు
చిత్ర మెందులనుండి యార్జించె నొక్కొ?
అతులతద్రూపసత్పరమాణువులను. 62

శా॥ ఈరాజీవదళాక్షిఁ బంకజభవుం డింపార సృష్టించుచో
నాహార్ద్రాదన కేలఁదాఁకిన శ్రమంబత్యంతమైయున్న నా
నీరేజాతముఖీమతల్లికగు కన్నీరెల్ల నేల్పాలుగా
రారాజత్కుముదాంబురుట్కువలయారామంబులై
గ్రాలెడుఁ. 63

గీ॥ అనుచు నీరీతిఁ జింతించునపుడె యతని
కన్నవాబ్జాక్షి కండ్లపైఁ గన్నువడియె
అపుడె కేయూరకాఖ్యాతుఁ డతఁడె యంచు
నాసరోజాక్షి కతనిపై నట్ల యయ్యె.

గీ॥ అంతఁ గాదంబరీనేత్రకాంతిచేత
ధవళితుండై తదీక్షు భూదారుఁ డచల

మయ్యెఁ; గని వాని మొదట రోమాంచ మంత
భూషణధ్వని పిదప నాపొలఁతి లేచె. 65
సీ॥ చిగురుఁగైదువె మేనుఁజెమరఁజేసెను గాని
సంభ్రమోత్థానంబు సాకుఁ గాంచె
నిట్టూర్పుగాడ్పులే పుట్ట మూడ్చెనుగాని
చామరానిల మయశంబుఁగాంచెఁ
గంపమే గతి నడ్డెఁ గాని నూపురరవా
కృష్టహంసములె యకీర్తిఁ జెందెఁ
గుతుకమే యశ్రులఁగూర్చెఁగానీ శ్రవః
ప్రసవధూళియె యపప్రథ వహించె
గీ॥ అంతరంగప్రవిష్టుఁడౌ యధిపుఁడాఁకఁ
గరము నురమందునఁ బడెఁ గాని యద్ది
పయ్యెదను దిద్దికొన హేతువయ్యె మొట్ట
మొదట నృపుఁ గన్న యప్పుడా మోహవతికి॥ 66
గీ॥ తలఁచె నాతండు సైత మా తలిరుఁబోఁడి
భూషణధ్వని సల్లాపభాషణముగ
మఱియుఁ దద్దేహకాంతిసమాగమంబు
సైతమును దత్సమాగమసౌఖ్య మట్లు॥ 67
వ॥ అంతఁ గాదంబరియు నెట్టకేని నటనుండి రెండడుగు
లిడి చిరకాలదర్శనజాతోత్కంఠయై మహాశ్వేతను స్నే
హనిర్భరంబుగాఁ గౌఁగిలించిన నాపెయు నాతన్వి నట్ల
చేసి యిట్లనియె॥ 68
మ॥ రమణీ! భారతమందునుంగలఁడు తారాపీడుఁడట్టేఁడు
త,త్సముఁడున్నాఁడె? చతుస్సముద్రయుతభూచక్రంబునుం

దగ్ధయో, త్తమదివ్యత్షురముద్రితం బెఱుఁగుదే తత్పుత్త్రుఁ
డీయుత్తమో, త్తముఁ డన్నింటను దంట్రిడియై వెలయుఁ
జంద్రాపీడుఁడన్ పేరిటన్॥ 69

గీ॥ దిగ్విజయయాత్రకై యింత దేశ మేగు
దెంచె నది యేమొ కాని యో చంచలాక్షి
కన్నదాదిగ నీనృపాఖండలుండు
నిర్నిమిత్తాత్మబంధుఁడై నెగడె నాకు॥ 70

గీ॥ అఖిలసంగపరిత్యాగనైన నాదు
మన మధిష్ఠించియుండె నీమనుజవిభుఁడు
సహజసవిశేషసద్గుణసమితిచేత
నరిదిగాదె? యకృత్రిములైన సఖులు. 71

శా॥ నన్నుంబోలెను నీవు పీనిఁగనితన్నై పుణ్యముల్ దాపసం
పన్నత్వంబును నర్మహానెడనె శ్రీభవ్యత్వముల్ ధాత్రికిన్
సన్నాథత్వముమర్త్యలోకమునకున్ స్వర్గాధికత్వంబునుం
గన్నారంగనుగొందువంచితనిసత్కారంబుమైఁదెచ్చితిన్

ఉ॥ హెచ్చుగనిన్నుఁగూర్చి వచియించితి పీనికిఁగానఁగ్రొత్త
గా, వచ్చినవాఁడటంచుఁ ద్రప వల్వదు నమ్మకముం ద్వ్యజం
పఁబో, కెచ్చిఱు చెల్మి లేదనుచు నెట్టిఁడో యంచును పీడు
శంకయున్, నెచ్చెలి చుట్టముల్ హితుఁడు నీ కితఁ డోసర
సీరుహానానా. 73

వ॥ అని యిట్లు మహాశ్వేత చెప్పుడుఁ జంద్రాపీడుండు నమ
స్కరించినఁ గృత్ప్రణాముండగు నాతని స్నేహనిర్భరం
బుగాఁ దిర్యగాలోకనంబుఁ గావించు కాదంబరీనేత్రము
లనుండి శ్రమజలబిందువులమాడ్కి నానంద బాష్పంబు

లుప్పతిల్లె శీఘ్రముగా నతనికెదురేగు హృదయంబుభూ
ళియో యనఁ జిఱునవ్వువెన్నెల యెల్లెడఁ జెల్లుమీఱె,
స్వేదోదకధౌతలావణ్యనిర్మలంబులగుతరంగంబులందుఁ
బ్రతిబింబితుండై మన్మథుండుంబోలెఁ జంద్రాపీడుం డత్తె
ఱిఁ గానంబడియె. 74

సీ॥ రణరణన్మణినూపురములచే నాహూతు
నట్లంఘ్రినఖముల యందు నొప్పె
ఎదురేగి కొనివచ్చె హృదయమన్నట్లుగా
గబ్బిగుబ్బలయందుఁ గానఁబడియెఁ
గందామరలఁదృప్తిగాఁ ద్రావఁబడినట్లు
చెక్కుటద్దములపైఁ జెన్నుమీఱె
నీచేతిలోవాఁడ నే నన్నకైవడిఁ
గరనఖంబుల నునికి గాఁగ నుండె

గీ॥ అప్పు డత్యంతకౌతుకాయత్తచిత్త
లగుచుఁ గ్రీఁగన్నులం దన్ను నరయు కన్య
కాజనాళికి న్నిగ్గంతుకామలట్ల
తారకలు చెవి పూఁదేంట్లఁదఱిసి చెదరె. 75

వ॥ అంతఁ గాదంబరియు సవిలాసకృతప్రణామయై. 76

గీ॥ అభినవంబైన యొక్కపర్యంకమందుఁ
జేరి కూర్చుండెఁ జెలి మహాశ్వేతతోడఁ
బరిజనానీతమై యొప్పు పైఁడికోళ్ళ
పీఁటపైఁ గూరుచుండెఁ బృథ్వీవసుండు.

మ॥ చెలులందిచ్చిన నీటఁగడ్గియెమహాశ్వేతాపదాబ్జాతముల్
చెలువొప్పం దడియద్ది వేయధివసించెం దల్పమకాంత

యు, వ్వాలవేడ్కన్మదరేఖ యాసతి బహిఃప్రాణంబువల్దన్నఁ
ద, జ్జలసంక్షాళితపాదుఁ జేసె సముదంచద్రూపునాభూపునిన్॥

ఉ॥ ఆతతిఁ గర్ణభూషణమహాప్రభలీను నపాంగదేశముల్
ప్రీతిమెయిన్ స్పృశించుచు ద్విరేఫనమచ్ఛ్రవణావతంస
ముల్, శ్రీతళుకొత్త దిద్దుచును సేమపువార్తలనడ్గె నా
మహా, శ్వేతమనంబురంజిలఁగ శింజితమంజుళమంజులో
క్తులన్. 79

వ॥ అంతఁ గాదంబరియుఁ జెలియందు మిక్కుటపుఁగూర్మి గలదయ్యుఁ గృహమందుండుటచేఁ గృతాపరాధయుం బోలెఁ దన్నుఁదలంచుచు క్షేమముం దెల్ప లజ్జితయైయెట్టకేలకు నుగ్గడించి కొంతతడవూరకుండి తాంబూలంబు నొసంగ నుద్యోగించుడు మహాశ్వేత యిట్లనియె. 80

గీ॥ పొలఁతి! సఖినైన నాకుఁ దాంబూలమిప్పు
డిచ్చినను సేయకుండిన నిచ్చినట్లె
నూతనాగతుఁ డీ జగన్నుతుఁడు వీని
మనకుఁ బూజించులే తొల్త మంచి చెయిది. 81

చ॥ అన విని రాకుమారి యను నప్పుడు నెచ్చెలి! నూతనా
గతుం, డనియును నెన్నఁడున్ బరిచయంబును లేదనియు
న్మనంబు సి, గ్గునుగొనె నంతె నిక్కమిదిగో విడెమిచ్చెద
నీదుచేతి కా, ఘనతరసత్వ నాబదులుగా నిఁక నీవె
బహూకరింపుమా. 82

వ॥ అని యిట్లెంత చెప్పినను వినక తన్నె తదుద్యోగంబున నియమించిన మహాశ్వేతమాట నుల్లంఘింపమనమొప్పమిఁ గాదంబరియు నతికష్టంబున నిష్టపడి 83

గీ॥ వేఁడినిట్టూర్పు విడుచుచు వెలఁది స్వేద
సలిలబిందూత్కరంబుచే స్నపితవోలెఁ
గ్రముఘనసారవీటికాగర్భమైన
చేయి యానరపాలకుచాయఁ జాఁచె. 84

చ॥ నయవిదుఁడైన యానృపతినందనుఁడున్ విడెయంబుఁ
జేకొనన్, జయమదకుంభికుంభమును స్ఫాలనముం బొన
రించుపట్ల నెం, తయు నటసిందురంపుజిగి తాఁకసహారుణ
మయ్యె నాఁగఁద, ద్దయు సహజారుణత్వరుచిఁ దాల్చుకరం
బును జాఁచెఁ జాఁచినన్. 85

మ॥ అనుమానింపకునాదుజీవితము నేఁడాదిన్ భవత్పాణియం
దునవే యుండునటంచు జీవితముఁ దోడ్తో తెనికైఁ బెట్టె
నో, యన నన్నంగజుఁడిచ్చె మీకుఁగొనుమం, చాస్వే
దవార్ధారగాఁ, దనునర్పించెడినో యనన్ సతియిడెం
దాంబూల మాతనికిన్. 86

గీ॥ అరయుద దాబాల విడె మిచ్చె నంతెకాని
కరతలభ్రష్టమా మణికంకణంబు
వెండియును నంత వేఱొక్క వీడియంబు
చేతఁగొని యిచ్చె నా మహాశ్వేత కపుడు. 87

వ॥ ఆసమయంబున నెందుండియో యమందగమనంబున
నేతెంచి. 88

చ॥ వలయితమైన యింద్రధనువా యననొప్పు త్రివర్ణరాగ
ముం, గళమునఁబూని గారుడపుఁగాంతులఁబక్షతులీన
విద్రుమో, జ్జ్వలలలితాంకురంబుగతిఁ జంచుపుటంబున

నొక్కచిల్క తఁ, దలకొని వెంటనంట ననుఁ దాఁ జని
శారిక రాకుమారితోఁ. 89

చ॥ మరులుకొనంగ నీసుభగమాని శుకాపసదుండు నాపయిం
బరుగిడుచుఁ ననుఁ విడఁడు పద్మదళాక్షి యెఱింగినీవు
నీ,కరణి నుపేక్షచేసి యవుఁగా దన విట్టులయేని నింక నీ
చరణములాన నే బ్రతుకఁజాల నటేనిఁ ద్యజింతుఁ
బ్రాణముల్. 90

క॥ అది విని నగియెను రాసుత
యది యర్థము కామిచే మహాశ్వేతయు నే
మిదియని యడిగినఁ బదఁపడి
మదరేఖ యిటుల్ వచించె మంజులఫణితిఁ. 91

మ॥ విను మీశారిక రాకుమారికి మహావిశ్వాసపాత్రంబు స
ద్ఘనచారిత్రపవిత్రరూపవెలయుఁ గాళిందియఁ పేరుచే
తను నీకెఁ బరిహాసకుండనెడు నేతత్కీరరాణ్మౌళికిఁ
మనరాపుత్రియొచే సెఁబోసతిగసన్మానంబనూనంబుగాఁ.

చ॥ అనువుగ నొంటినొక్కయుదయంబున నేమొత్త మాలికఁ
ముదం, బునబఱియింపఁ జేయుశుకముఁ గని శారికయీసు
చేత నా, దినము మొదల్ మహారుష మదిఁ గలఁచఁ
మఱివీని చెంతకుఁ, జనదు, వచింప, దంటదు, ప్రసన్నతఁ
గాంచదు వేయిచెప్పినఁ. 93

వ॥ అనిన నా వృత్తాంతంబు విని చిఱునవ్వునవ్వి చంద్రాపీ
డుం డిట్లనియె. 94

శా॥ డంబొప్పఁ పరిహాసకుండను శుకేట్చంద్రుండు రాచూ
లికిఁ, దాంబూలం బిడు నాతమాలికనుఁ జిత్తంబందుఁ

గామించి య, న్నంబుం దాఁకఁడు, నీరునుం గొనఁడు
సంతాపంబుచే నంచుఁ జి, త్రంబొప్పన్ వినుచుండు
నీతనిచరిత్రం బేను లోకంబునన్. 95

గీ॥ ఈదురాచారుఁ, డీద్రోహి, యీశుకాధ
ముండు సతి విడి యీమెతో నుండుఁగాక
ధర్మమా నాకొక్క యీ దుష్టదాసి నకట
మందలింపమి యీ రాకుమారి కేని॥ 96

గీ॥ ఏల? యటుచేయు రాసుత కీపెయందుఁ
జెలిమి లేకుంట మొదటనే తెలియఁబడియె
లేనిచో నీవరాకిఁ గాళింది దానె
యేటి కీదుర్వినీతున కిచ్చు సతిగ॥ 97

చ॥ చెలిమికి వేరువిత్తుపరిశీలనకుం దలమొత్తు కన్యకుం
దలఁగనిమత్తుచేటుచెయిదంబులకున్ దలయెత్తు సద్గుణా
వళులకుఁ గిత్తు మేటివలవంతలఁదారుచుతొత్తు ధాత్రిలోఁ
బొలఁతుల కెంతయున్ సవతిపొత్తు విపత్తును హత్తు
నొత్తుగన్. 98

గీ॥ ఇంతకును ధైర్యవతి యీపె యెందుకంచు
జీవితంబందున విరక్తచిత్తయగుచుఁ
ద్రావదు విషంబు దుముకదు పావకమున
మేను విడనాడ దశనంబు మానియైన॥ 99

గీ॥ ఇట్టి యపరాధమున సైత మీలతాంగి
మరలఁ బతిచేత ననునీయమాన యగుచు
నతనితోఁ గూడియుండుచో నంతకంటె
నువిదలకుఁ జుల్కఁదనము వేఱొండు గలదె॥ 100

ఉ॥ ఇవ్విధిఁబల్కుటొక్కొ యిదెక్కడిమాట యిఁకేమి న
క్కటా, యెవ్వఁడుపల్కరించు మఱియెవ్వఁడు చూచెదు
నీపెనెమ్మొగం, బెవ్వఁడు తాఁదలంచు నిఁక నీసతిపే రని
పల్కుచుండఁగా, నవ్విరి ఱేని నర్మవచనమ్ముల కెల్లరు
రాకుమారితోన్. 100

మ॥ అనునంతన్ బరిహాసుఁడున్ నిపుణ యయ్యబ్జాక్షియున్
రాజనం, దననీవాగుములోలయా నొరులచేతంగాదుపో
మోసగిం, పను నీపెన్ మఱి యీకెసైత మెఱుఁగున్ న
క్రోక్తిమార్గంబెఱుం, గును గాలంబును హేతువున్ విష
యమున్ గోపప్రసాదాళికిన్. 101

వ॥ అని పల్కునంతలోన కంచుకి యేగుదెంచి మహాశ్వేత
నాలోకించి. 102

శా॥ దేవీ! చిత్రరథుండు నామదిరయున్ దేవేరినీరాకకై
వేవేగన్ ననుఁబంచినిన్గనఁగ నువ్విళ్ళూరుచున్నా రటుల్
రావా నా విని,గంతుకామయయియారాజాస్యకాదంబరీ!
యే వారింగనివచ్చునంతకునితండెందుండనో!నావుడున్.

గీ॥ వందలకొలంది జవరాండ్ర డెందములనె
యునికగాఁ జేసికొనియున్నయురుగుణాఢ్యుఁ
డితనికి మఱొక్క యునికిపట్టేల యనుచు
నాత్మగతమున నవ్వి పైకనియె నిట్లు. 104

గీ॥ చెలి మహాశ్వేత! యితని దర్శించుటాది
మేని కేనే నియంత్రినిగా ననంగ
భవనపరిజనములమాట పలుకనేల
యుండె యుండుత మితఁడు నీకెందు రుచిరా. 105

వ॥ అనవుడు మహాశ్వేత యట్ల నీ యభిమతం జేని 106

శా॥ ఏకస్తంభమువోలె మిం్రటికగు నీయీ మేడకుందాపునం
దాకందోయికివిందొనర్చు ప్రమదోద్యానైకదేశంబునం
దాక్రీడాచలమందు నామణులగేహంబందు వర్తించెదుఁ
గాకీతండనియే గెనాసతివడిఁ గంధర్వరాజుం గనఁ. 107

గీ॥ మణిగృహంబున కంత నమ్మనుజవిభుఁడు
తరలెఁ గేయూరకుఁడు ముందు దారిఁజూప
రాసుతుం డేగు టెఱిఁగి యారాకుమారి
మితసఖులు గొల్వఁగాఁ దన మేడ యెక్కె॥ 108

వ॥ ఇట్లు నిజప్రాసాదంబధిరోహించి యాగంధర్వరాజపుత్రి యం దాకశయనీయంబునం బరుండి మర్యాదావతుల గు పరిచారికలచే వినోద్యమానయగుటంజేసి ప్రత్యాగతచేతనయై, చపలురాలా! ఇది యేమియని సిగ్గుచే నిగ్రహింపఁబడినది వోలె గంధర్వరాజపుత్రీ! ఇది తగునా యని వినయంబుచే, నుపాలబ్ధయుంబోలె భీరూ! యిది కులకన్యకలకుం గానిది యని గౌరవంబుచే నిందితయుంబోలె దుర్వినయురాలా! అవినయంబునుండి రక్షించుకొనుమని యాచారంబుచేఁ దర్జితయుంబోలె దుర్భరంబగు లజ్జాభరంబునఁ దనలో నిట్లు చింతించె॥ 109

చ॥ నృపతనుజాతనయ్యెఁ బరునింగనరాదనియెంచనైతిఁగా
అపరిచితుం డితండనుచు నైనఁ దలంపఁగనైతి దుఃఖకూ
పపతిత నావయస్యయనుపాటియు నెమ్మదినెంచ, నేమినా
చపలత సాహసంబు దయ స్త్రవ్యము మోహముఁబోల
దేదియుఁ॥ 110

సీ॥ బండలకును బట్టబయలైన నాచెయ్యి
యీమహాశ్వేతకు నెఱుకపడదె
ఆవులించినఁ ౙేవులన్ని లెక్కించు నా
చెలుల కీ సంగతి తెలియకున్నె
నాకుఁ బ్రాణంబులై నానునం బెఱిఁగిన
పరిజను లీ మాత్ర మెఱుఁగలేరె
విని నాదు వృత్తాంతమును సమగ్రంబుగా
నయ్యొ గంధర్వు లేమందు రొక్కొ
గీ॥ నేనె పాపిణంబుగా మదిలోనఁ దలఁచు
కూర్మి తలిదండ్రు లేమని కుందువారొ
మరణమేదప్ప వేఱొండు శరణ మరయ
రాదు వేయేల దౌర్భాగ్యురాల నేను. 111
గీ॥ ఎఱుఁగరాకుండ నిది యెట్లు మఱుఁగు పఱతు
నేరితోఁ జెప్పుకొందు నీయింద్రియముల
చాపలం బక్కటా పుష్పచాపదగ్ధ
హృదయనై యెందుఁబోదు నింకేది దిక్కు. 112
శా॥ ఆనాఁడొల్లను బెండ్లియంచుఁ జెలికై యట్లాడితిన్ నా
వయ, స్వానిశ్చయముగావచించితిన లేసం దేశముంబంపితిం
గానీ దుర్విధియో హతస్మరుఁడొ ప్రాక్కాలైక మత్పా
పనం, తానంబో యెఱుఁగంగనైతి నిటఁ జంద్రాపీడునిం
దెచ్చుటల్. 113
ఉ॥ ఎక్కడిజవ్వనంబు మఱియెక్కడిచక్కఁదనంబు మేలు
మే, లక్కుసుమాయుధుండు నహహా దిగఁదుడ్వగు వీని
ముందితం, డెక్కడనుండివచ్చెనొకో యింద్రియసంతతి

చేతఁగట్టి యు, న్మకర యొసంగఁబడ్డయటులై తిని నీతని
దర్శనంబుచే. 114

వ॥ అట్లుకాని, మ్మాచపలాత్మునితో నాకేమి యని క్షణ
కాల మూరకున్నంత సంతతచంద్రాపీడైకాంతమ్మగు
తదంతరంగమ్మున. 115

శా॥ నాతోఁడంబని లేనిచో నరుగుచున్నానంచు రాచూలిచే
సాతంకంబుగను క్తవోలె, సెలవుఁ సాగంగ జీవంబుచే
నూతంగాంక్షితవోలె సుందరుఁడో కాఁడో చూడు
ధాతాక్షివై, వేతెల్లంబని బాష్పబోధితవలెఁ వేయేల
లోఁ గుందుచుఁ. 116

గీ॥ పదిలము హతాశ! యితనిఁ జేపట్టవేని
నీదు ప్రాణంబులే యింక నీవిగావు
చెడకుమని మారుచేత భర్త్సితయుఁబోలెఁ
దదభిముఖ చిత్తయయ్యె నా సుదతి మరల. 117

వ॥ ఇట్లు తదాయత్తచిత్తయై యాబిత్తరి తదాలోకనపరవశ
త్వంబుచే గవాక్షమారోహించి యతండున్న క్రీడాపర్వ
తంబుఁ జూచుచుండె నటఁ జంద్రాపీడుండును. 118

సీ॥ రెండవకాదంబరీహృదయం బట్లు
రమణీయమణిమందిరంబుఁ జొచ్చి
తలగడ లిరుఁగడఁ దనరి కడుంగడు
మెత్తనౌ కుధమీఁద మేనువాల్చి
కేయూరకుఁడు తన కేల నిశ్చలభక్తి
నొయ్యనఁ బాదంబు లొత్తుచుండఁ

గనులపంచుపుసేయు గంధర్వలోకైక
రమణీయతకు నంతరంగ ముబ్బఁ
గీ॥ బ్రకటలను రాకుమారిచేఁ బ్రహితలైన
కన్యకలు గొల్వఁ గండ్లకుఁ గట్టినట్లు
లెదుటఁ గాదంబరీమూర్తి మదిఁగలంచఁ
దలఁచె డోలాయమాన చిత్తమున నిట్లు. 119
చ॥ లలితము లీవిలాసినివిలాసములే మఱియీయాదృశంబులో?
తలఁపక యేప్రసన్నుఁడగు దర్పకుఁడీ పెనునాపయిం దగు
ల్కొలి పెనొ? కాక నన్నుఁగనుఁగోఁబని యేటికినోరకంట
నింపులోలుకఁ దెల్లచిర్నగవుపుట్టముచాటిడ నేల నేఁగనక.
గీ॥ మామకప్రీడను వివర్తమానవదన
యగుచు నిగురొత్త వేడ్కలీచిగురుఁబోఁడిఁ
నాదుప్రతిబింబమును గొననా యనంగఁ
దద్దయును నిద్దమౌ చెక్కుటద్ద మిడెకు॥ 121
గీ॥ మొదట నా కవకాశంబు నొదవఁ జేసి
నట్టి హృదయంబునకు దీవ్రమగు విధంబు
అవిన యోత్తరమును వ్రాయునా యనంగఁ
గుసుమశయనీయమునఁ గొనగోట వ్రాయు॥ 122
వ॥ మఱియు 123
చ॥ మనుజతకెంత యేనిసుగమంబగు చుల్కఁదనంబెయిట్లునా
మనముఁగలంచి పెట్టెఁ గొఱమాలిన కోర్కలచేతనయ్యో
జ, వ్వనపుమకంబెఱుంగదు లవంబును జ్ఞానముఁ దాదృ
శుండె పో, ననవిలుతుండు నెరినయిన న్మదమత్తులఁ
జేయకుండు నే॥ 124

గీ॥ తిమిరహతవోలె యువకుల దృష్టి కలుష
మద్ది గోరంతయైనఁ గొండంతగాఁగఁ
గాంచు స్నేహలవంబును గాంచువృద్ధి
నుదకమునఁబోలె యౌవనమదముచేత॥ 125

వ॥ అని యిట్లు పెక్కువిధంబులఁ దలంచుచు మఱియు 126

ఉ॥ ఏటికిఁబోవృథామనము నేఁచఁగ నాపయినిక్కమేనినా
పాటలగంధికిఁ రుచిరభావము కూరిమి యింకనేల వే
మాట, లయూచితాప్తుఁడగుమన్మథుఁడేప్రకటించునంచునా
బోటులతోవిపంచిఁగొని మోదముతోడన ప్రొద్దుపుచ్చు
చుఁ॥ 127

ఆ॥ వె॥ ఒక ముహూర్తముండి యుద్యానమును జూచు
కోర్కి నాతఁ డాటకొండ నెక్కి
మదిరసుతయు రాదు మామహాశ్వేతఁగాం
తునని సౌధశిఖరమునకుఁ జేరె॥ 128

సీ॥ బంగారు కాడచే భాసిల్లు తెల్లని
గొడు గాతపంబుల నడఁచివేయ
ఫేనతండంబు లోకోఁ నాఁగ విలసిల్లు
వింజామరలు స్వేదవితతి నూడ్ప
సుమగంధముల శిరోజములపైఁ గలతేంట్లు
నీలావగుంఠన నియతిఁ దెలుప
గంధర్వలక్ష్మియో గాఁబోలునంచుఁ జం
ద్రాపీడుఁ డామె నెంతయుఁ దలంపఁ

గీ॥ బలుమఱుం గొడ్గుకాడను బట్టికొనియుఁ
బలుమఱును నెచ్చెలులమూఁపుపైనఁ గరము

లిడియు రాసుతుఁ బేర్మి నెక్కుడుగఁ గనుచు
నటనె విహరించెఁ బ్రొద్దుపోవుటయుఁ గనక॥ 129

వ॥ ఇట్లు విహరించుచుఁ బదంపడి ప్రతీహారి నివేదితమహా శ్వేతాఽఽగమన వృత్తాంతయై సౌధంబుడిగి స్నానపా నాదులం దిచ్ఛలేనిదయ్యు మహాశ్వేతానురోధంబుచే దివసకృత్యంబులఁ దీర్చి; నటఁ జంద్రాపీడుండును గాదంబ రీపరిజనంబుచే నిర్వర్తితస్నానవిధానుండై యొక్కవిశాల శిలాతలంబున నభిమతదేవతారాధనం బొనర్చి కృతా హారుండై క్రీడాపర్వతంబునకుఁ బ్రాగ్భాగంబున నతి మ నోహరంబును హారీతహరితంబును సీరపాణిభయనిశ్చల యమునాజలనీలంబును తరుణీపదలాక్షాశోణితంబును బు ష్పపరాగసికతిలతలంబునగు మరకతశిలాతలంబున నుప విష్టుండై చందనరసంబుచే దిగంతంబులు తడుపంబడెనో పాలమున్నీటిచే భూమి తేలింపఁబడెనో యమృతంబుచే నాకసము పూయఁబడెనో నాఁదగునొక్క ధవళ ప్రకా శంబుఁగాంచి మనంబున. 130

శా॥ ఏమీ! సోముఁ డకాండమం దుదితుఁడాయెంగావలెఁ లేద, ప్రో, ద్దామోత్తిప్తసుయంత్రనిస్రుత పయోధారా సహస్రంబులో, కేఁమాఅంబు గృహంబులం దెఅచి రేమీ! కూర్మిమిన్నెతె యీ, భూమిఁ వాయువికీర్ణశీక రసితంబుంజేయుచుఁ డిగ్గెనో. 131

వ॥ అని యెంచుచు నవ్వెలుంగు చనుదెంచు చాయఁ బరి కించుచు. 132

సీ॥ కమనీయ బహుకన్యకాపరివారయై
ధవళాతపత్రంబు దనరఁ గెలన
వెలయవింజామరంబులు ప్రతీహారి చం
దనవిలేపనసహితంబు నారి
కేళంపు బరణి డాకేలనై పెఱకేలు
కాదంబరికి నూఁతగాఁగ నడువ
నెలమి నిట్టూర్పుల నిటునటుకదలు క
ల్పకవల్లరీ దుకూలద్వయంబు
గీ॥ తాల్చి కేయూరకుఁడు ముందు దారిఁజూప
వచ్చె కాదంబరీదేవి, మెచ్చుఁగూర్చు
మాలతీమాలఁగొనుచుఁ దమాలికయును
వెంట రా వచ్చుమదలేఖ విభుఁడు కాంచె. 133
ఉ॥ వారలచేరువన్ ధవళవస్త్రముకప్పినచిన్నిపెట్టెలో
క్షీరపయోధిపాండిమకు సేవధినా, శశితోడఁబుట్టు నాఁ
జేరిచి యొక్కచో నిలువఁజేయు యశంబన హారమున్
శుభా, కారముఁగొంచురాఁ దరళికన్ గనియెన్ గని
కూర్మిపెంపునన్. 134
క॥ ఇదియే యీధవళాక్షుం
గుదురని మనమందు నెంచుకొని రాజసుతుం
డెదురేగి యేగుదెంచిన
మదలేఖకు నుచితవిధుల మన్ననఁ జేసెన్. 135
చ॥ ఆమహితోపచారములనంది క్షణం బటనుండి యంత
టన్, గోమలి లేచి రాసుతునకున్ మెయిగందముపూసి
నెక్కొనన్, ప్రేమ, దుకూలయుగ్మమిడి పేర్మి శిరంబునఁ

జుట్టి మాలతీ, దామము, శేషహారమునుదాలిచి కైనను
రాకుమారుతోఁ. 136

గీ॥ గరువమేమియు లేని నీ గరువతనము
సలుప దెవ్వరిఁ బ్రేమవశంవదులుగ
వేయునేల కుమార! నీ వినయ మొండె
యిడెడు నవకాశ మెంతయు నిట్టిరులకు. 137

చ॥ ఎవనికిఁగావు నీవు హృదయేశుఁడ వీదృశరూపయుక్తిచే
నెవనికిఁగావు బాంధవుఁడ వీ యనిమిత్తహితప్రవృత్తిచే
నెవనికిఁగావు నెచ్చెలివి యెంతయు మేలగు నీచరిత్రచే
నెవనికి విశ్వసింపఁదగ వీ సుకుమార సుహృద్గుణంబులన్

ఉ॥ ఈవిషయంబునందుధరణీంద్రసుతా! యుపలంభపాత్రమా
తావకమూర్తియే ప్రథమ దర్శనమప్పుడె నాకు సమ్మకం
బావహిలంగఁజేసె హృదయంబునఁ గానియెడన్ భవా
దృశ, క్ష్మావిభులందు నీదృగుపచారములెల్ల సమంజసం
బులే. 139

వ॥ పరిభాషించుటకూడ మీకగుఁ బరీభావంబటుల్, తెల్పునా
దరముల్ రాచరికంపుఠీవి యటు, స్తోత్రంబాత్మవైదుష్య
వి, స్తరతన్ వాకొనుఁ, జాటుఁ బ్రీతియు ననాత్మజ్ఞత్వ
ముల్, సేవ క్రి, చ్చుటఁ జాపల్యముఁదెల్పు, నీవియుఁ దిర
స్కారంబె సూచించెదుల్. 140

గీ॥ అదియునుంగాక స్వయము మాహృదయములను
జూరఁగొన్నట్టి మీకు నిచ్చునదియేమి?
ప్రథమదత్తనిజాంగమఫలమహోప
కారి కొనరించు ప్రత్యుపకారమేమి? 141

గీ॥ జీవితమునకు ఫలభూతమై వెలుంగు
దర్శనం బిచ్చినట్టి యుత్తములు మీరు
ఇట్టి ఘనులకు మీ కేమి యిచ్చి మీదు
రాక సఫలంబుఁ జేయు మా రాకుమారి. 142

వ॥ ఐనను 143

మ॥ కనఁగాఁ జేసెడిదీనిచేత నిటు మా కాదంబరీదేవి తాఁ
బ్రణయంబుఁ సిరిపెంపుచేనని తలంపంబోకు మో రాజ
నందన! సందేహమువీడు నాదునుడి సత్యంబంచు లోన
మ్మి స, జ్జనసంపత్తతి కెందు నేనియుఁ బరస్వత్వంబు
దళ్కొత్తునే? 144

ఉ॥ ఓమహనీయరూప! యదటుంచుమ! మీకిఁక దాస్యమూని
యే, నీమె యకార్యకారిణిగ నెంచను, తన్నె యొసంగికొం
చునే, నేమనుకోదు, జీవితమయిచ్చియుగుందదోకింత, దీని నే
నేమనియిచ్చుదానననియెంతయుసిగ్గువహించునాత్మలో.

శా॥ మున్నంభోనిధిఁ ద్రచ్చువేళ జనితమ్ముల్ రత్నముల్
పెక్కులం, దు, న్నారాయణముఖ్యులుఁ గొనఁగ నెందొం
బోక శేషించెనీ, చెన్నారత్నము శేషహారమనియిచ్చెఁ
వార్ధి యప్పాళి కా, కన్నా కెంతయుఁ బ్రీతిమైనొసఁగ
మాగంధర్వరాణ్మౌళికిఁ. 146

గీ॥ అనుఁగు సుతకిచ్చె గంధర్వజనవిభుండు
చంద్రబింబంబునకు నభస్థలముపోలె
దీని ధరియింపఁదగును మీ దేవ మనుచుఁ
బనిచెఁ గాదంబరీదేవి యనఘ! తమకు. 147

మ॥ పరులర్పించునలంక్రియాభరము దాల్పర్ భారమంచుం
గుణా, భరణాఢ్యుల్ తమబోటు,లైన నిదిదాల్పం జెల్లుం
గాదంబరీ, తరుణీప్రేమ; మురారి లక్ష్మిసహజాతంబంచుం
దగ్గాగవ, స్ఫురణం గౌస్తుభమం శిలాశకలముం బూ
నండె వక్షంబునం॥ 148

ఉ॥ దేవరమించునొక్క గణుతింపఁగనబ్బలిభిక్షు,వల్పమౌ
శ్రీవిభవంబుచేనయిన శ్రీసతిరాసుతకుం సమానయే?
భూవర! శేషహారమును బోలెడుపాటిదె నీటికెంపు పెం
పానహిలంగ దీనిఁగొనుమా యనుమానము మానుమా
మదిం॥ 149

గీ॥ తగదె యీభాగ్యమునకు గంధర్వపుత్రి
కొనుమ రాసుత! హారంబుఁ గొనవయేని
అమ్మహాశ్వేత మిగుల నాయాసపడుచి
మానవతి యాట మాచెలి మేను విడుచు॥ 150

వ॥ కావున నే మహాశ్వేతయు నీహార మొసఁగి తమకుం దన మాటగా విన్నవించునది యని తరళిక నేలిన వారియొద్దకుఁబంపినది. ఆమె మాటయేమందురే నవధరింపుఁడు॥

గీ॥ అణుమధ్య నాదు సఖి స
ద్గుణ! హారము పంపుకొనియెఁ గొందువ కానీ
యణువేని మాదు చెలి తొలి
ప్రణయము మదినేని భంగపఱచెదవునుమా॥ 152

వ॥ అని పలుకుచుఁ దదీయవక్షంబున నారమణీయహారంబు నలంకరించిన రాజనందనుండు తదీయకౌశలంబున కచ్చెరువందుచు నిట్లనియె॥ 153

గీ॥ ఎంతదానవు మదలేఖ! యేమినే ర్పొ
కించుకయు మాదు నుడి కెడమీయకుండ
శేషహారంబు గ్రహియింపఁ జేసినావు
జాణతన మున్న నీదెగా చంద్రవదన! 154

వ॥ అతివా! దీని కింతయేల వినుము. 155

క॥ మీ సౌజన్యగుణమునకు
"దాసోహ" మ్మంటిఁ బేరుఁ దగఁ గొన విడువం
గా, సుదతీ! నేనెవ్వఁడ
నే సందేహంబు వలవదిఁకఁ బనిఁ గొనుఁడీ. 156

క॥ కాదంబరి గుణజాల ము
నీదృశసంపత్తి నెవరి కిష్టముకా, దా
మోదం బిడ దేరికి; నా
పాదింపఁగఁజాల దెవరిఁ బరతంత్రులుగన్॥ 157

వ॥ అని యిట్లు కాదంబరీసంబద్ధకథాలాపంబులతోన చాల కాలంబు గమియించి యారాజనందనుండు మదలేఖ ననుప నటఁ గాదంబరియు నుదయాచలారూఢుండగు చంద్రునింబలెఁ గ్రీడాపర్వతగతుండగు చంద్రాపీడుఁ జూచి లోచనంబులు సఫలంబుచేసికొనఁ దమాలికా ద్వితీయయై మరల నాసౌధశిఖరంబునే యారోహించి వివిధవిలాసతరంగితంబులగు చతురావలోకనంబులచే రాచూలిమనంబుచూరఁగొనియెనంతఁగనుచీఁకటితోన దివసంబు పరిణతంబయ్యె నప్పుడు 158

గీ॥ ద్యుమణి యంతర్గతాబ్జినీరమణిరాగ
రంజితుండనఁ దాలిచె రక్తిమంబు

దివసపతి విప్రలబ్ధ దిగ్యువతిరోష
పాటలచ్ఛవినా నభోవాటి మెఱసె. 159

గీ॥ పద్మషండంబు లత్తఱిఁ బచ్చఁబాఱెఁ
దెల్వి మైఁ గల్వపూవులు తెల్లఁబాఱెఁ
బెల్లుచీఁకటి మునిమాపు నల్లఁబాఱె
మెల్లమెల్లన రవి యస్తమిల్లఁబాఱె॥ 160

వ॥ అంత నన్యోన్యావలోకనాక్షమంబై తిమిరంబు పర్వఁ
గాదంబరి సౌధశిఖరంబునుండియుఁ జంద్రాపీడుండు క్రీడా
పర్వతమునుండియు దిగిరి అంత నచిరకాలంబునందు. 161

సీ॥ కలుషితముఖులైన కాంతలఁబోలె ది
క్కులు నిజకరములఁ గలఁకఁదేర్చి
రోహిణీయువతి పదాహతి లగ్నలా
క్షయుఁబోలె నుదయరాగము వహించి
కలువకంటిని నిశాకామినీమణి నంటి
మది నిల్పె నన లోన మచ్చఁబూని
తిమిరనీలాంబర రమణీయవియదభి
సారికపై దృష్టి సారె నిల్పి

గీ॥ తొగలవగకాఁడు తమ్ముల దుండగీఁడు
వెన్నెలలతేఁడు చీఁకటివేఁటకాఁడు
బాగుగలవాఁడు జేజేలచాగకాఁడు
వేఁడివేలుపుజోడు రేతేఁడు పొడిచె. 162

గీ॥ పంచశరభూభృదేకాతపత్రమో, వి
భావరీరమణీదంతపత్ర మొకో

యనఁగ ధవళకరుం డొప్పు నానృపాలుఁ
డమలముక్తాశిలాపట్ట మధిశయించె. 163

క॥ ధీవిబుధాచార్య! నిజాం
తేవాస్యవివేకగాఢతిమిరవిదళన
ప్రావీణ్యరవీ! కృత గో
ష్ఠీవనమాహాత్మ్య! ద్వైతసిద్ధాంతజ్ఞా. 164

స్రగ్విణి॥ భారతీనిలయజిహ్వాతలా! నిస్తులా!
శ్రీరమేట్చరణరాజీవసక్తాంతరా!
ధోరణీప్రతిహతద్యోధునీ! ధీరగో
ష్ఠీరతా! ధీయుతా! శిష్యసంసన్నుతా! 165

తోటకము॥ సరసీరుహలోచన సక్తమతీ!
సరసార్థవినిర్మిత చారుకృతీ!
కరుణాలయ! కాకవి గర్వహరా!
నిరవద్యమనీష! మనీషివరా! 166

గద్య—ఇది శ్రీకాశ్యపగోత్ర జగన్నాథాచార్యపుత్త్ర
సకల విద్వద్విధేయ పూర్ణప్రజ్ఞ
నామధేయ ప్రణీతం బగు
నాంధ్రకాదంబరియందుఁ
జతుర్థాశ్వాసంబు
సంపూర్ణము.

ఓమ్

శ్రీ హయగ్రీవాయ నమః.

# ఆంధ్రకాదంబరి.

## పంచమాశ్వాసము



శారదా సమగ్రద
యాశోభిత! యున్నతాశయా! సాధునయా!
ఆశుగతివినిర్మిత కరు
ణాశాలి నెలూరురంగ నాయక శతకా! 1

వ॥ గురువరేణ్యా! అవధరింపుఁడు అట్లు చంద్రాపీడుండు ముక్తాశిలాపట్టమునధిశయింపుడుఁ గేయూరకుం డేతెంచి.

క॥ దేవా! దేవరఁ బొడఁగన
గా, వచ్చె నిచటికి దేవి కాదంబరి నాఁ
గా, విని యే మిది యని యా
త్మావర వరసుతుఁడు లేచి సంభ్రమ మెసఁగన్. 2

సీ॥ మహితమౌ నచ్ఛాచ్ఛ మలయజ చర్చచే
ధవళీకృతంబైన తనువుదాని

శశికలాకలికతో సన్నయైన తొగరేకు
కర్ణపూరంబుగాఁ గ్రాలుదాని
వెన్నెల కొక్కింత వన్నెదెచ్చెడు కల్ప
తరు దుకూలయుగంబుఁ దాల్చుదాని
అచటి దేశాచార మవుఁగాన నొక చెవి
దరిదంతపత్రంబు తనరుదానిఁ

గీ॥ గొలఁదిమంది వయస్యలే కూడిరాఁగ
నొక్క యేకావళీమాత్రమూని రాచ
చిన్నెలఁ దీసి మదలేఖ చేయి యొసఁగ
వచ్చు కాదంబరినిఁ గూర్మి హెచ్చఁ గాంచె. 4

వ॥ ఇట్లు చనుదెంచి కాదంబరిదేవి ప్రీతిఁ బ్రకటించుచుఁ బ్రాకృతజనోచితంబగు మహీతలంబునఁ గూర్చుండఁ జంద్రాపీడుండును "వలదు తాము శిలాతలంబే యధిరోహింతురుగాక" యని మదలేఖ బలవంతపెట్టుచున్నను దదీయ గౌరవంబున నేలన కూర్చుండె. కాదంబరీ సఖీజనంబెల్ల నాసీనమగుడు గంధర్వరాజపుత్రితో నిట్లనియె దేవీ! 5

చ॥ కనుటనె మేటిభాగ్యమును గాఁ దలపోసెడు దాసులందునో, కనకనిభాంగి కాన మవకాశ మొకింతయు భాషణాదికం, బున కన, నిట్టి మన్ననలఁ బొందుట యెమన, నెంత చూచియుఁ, గనుగొన నిట్టి గౌరవముఁ గాంచఁగ నా యెడ మంచిఁ గొంచెముఁ. 6

చ॥ అతిసరళంబు హృద్యమ నహంకృతి మానుజనత్వమెన్న నా, అతివరా! నూత్న సేవకులయందిటుచెల్లునె దేవినన్ను

సి,గతిఁ బరిచారవశ్యనిగఁగన్గొనె వ్యర్థుఁడ నాతఁడేగదా
కృతి, పరిచారులందెవరికేని మఱిసీవ నియంత్రితవౌదువో॥ 7

చ॥ వనజదళాక్షి! ప్రేమ నిటువచ్చిన నీకుఁ బ్రియంబుమై నుపా
యనముగ నేమియిచ్చుటకునైన మనంబున సిగ్గుదోఁచెడిన్
దనువొ పరోపకారపరతంత్రము యంత్రము ప్రాణమో
తృణం, బునకు లక్ష్మియవా నివియ పోయిట గొప్ప లిఁ
కేమి సేయుదున్॥ 8

క॥ ఇదె దేహం బిదె జీవిత
మిదె యింద్రియసమితి యిదిగొ యిట నే నుంటిన్
మదిరాక్షి! దేనిఁ గొని యె
య్యది యధికమొనర్తువో త్వదాయత్త మిఁకన్॥ 9

వ॥ అని పలుకు రాసుతుమాటల కడ్డువచ్చి మదలేఖ చిఱున
వ్వొలయ రాజనందనా! తా మన్నది యట్లయగుఁగాక
భవ దుపచారోక్తులచే మా కాదంబరి ఖేద మందెడిని.
ఏల యిట్లు నుడివెదరు. ఉపచారోక్తి వినాకృతంబుగనె
సర్వము మా సఖి గ్రహించినది. ఇట్టి నుడులచే మా చెలి
సంశయంబు గాంచెడి నని పల్కి నంతఁ గాదంబరీదేవి
కొంతతడవుండి ప్రస్తావవశంబునఁ దారాపీడుఁ డెట్టిఁడు?
విలాసవతి యెట్టిది? ఆర్యుం డగు శుకనాసుఁ డెట్టివాఁడు?
ఉజ్జయిని యిచ్చటి కెంత దవ్వు? భారతవర్ష మెట్టిది? మ
ర్త్యలోకంబు రమణీయమా? అని సర్వంబు నడిగి యిట్టి
ప్రసంగంబుతోన చిరకాలంబు గమించి గమనోద్యతయై
కేయూరకుని నటఁ బరుండ నియమించి తాను శయన
శిఖరమారోహించె నంతఁ జంద్రాపీడుండును దచ్చిలా

తలమాడుఁ బఱుండి కాదంబరి లోకోత్తరగుణంబులను మహాశ్వేత యవ్యాజానుకంపను మనంబున భావించుచుఁ గేయూరకుండు పాదంబు లొత్తుచుండ నాక్షణద క్షణంబు వలెఁ గడపె॥ 10

గీ॥ అంతఁ గాదంబరీదర్శనాత్త జాగ
రుండగుట రేయిఁ జేరెఁ బఱుండ నాఁగ
శీతరోచి తమాలతాళీతతంబు
శీతలానిలవేలావనీతలంబు॥ 11

గీ॥ కలువలను వీడి లక్ష్మి పంకజవనంబుఁ
దఱిసె గృహదీపములకు వార్ధకము వచ్చె
మాసెఁ దారలు వీచెను మలయమారు
తములు కన్పట్టె రవియు రక్తత వహించి॥ 12

వ॥ అత్తఱిఁ జంద్రాపీడుండు శిలాతలంబు డిగి ప్రక్షాళితముఖకమలుండును గృతసంధ్యావందనుండును గృహీతతాంబూలుండు నై కేయూరకుం గనుంగొని కేయూరకా! కాదంబరి మేల్కానెనో లేదో యెచ్చట నున్నదో కనుగొనుమన్న నాతం డరిగి కనుంగొని వచ్చి దేవా! మహాశ్వేతయు భర్తృదారికయుఁ గూర్చుండియున్నారని విన్నవింప గంధర్వపుత్రిఁ గాంచఁగోరి యట కేగి పెక్కుమంది తాపసీజనులు బలసికొలువ భద్రపీఠమధిష్ఠించి యభ్యుత్థానాభివాదనాదులచే నిజదర్శనాయాతమగు గంధర్వరాజబాంధవవృద్ధసందోహంబును మహాశ్వేత గారవింపుచుండ నారదదుహితకర్ణపర్వంబుగఁ జదువు మహాభారతంబున నవహితయై యున్న కాదంబరిని గని నమస్క

రించి యందె యొక యాసనంబునఁ గూర్చుండి స్మిత
పూర్వంబుగ మహాశ్వేతాముఖంబుఁగాంచుచు నామెయుఁ
దదింగిత మెఱింగి కాదంబరివలనై 13

సు॥ రమణీ! నీసుగుణాళిచేఁగరఁగెఁ జంద్రాపీడుఁడెంతేనిఁ జం
ద్రమయూఖంబులఁజంద్రకాంతమటు దానంజెప్పలేకుండె,
దే, శముఁ జేరఁగమకించెదుగామఱియురాట్చక్రంబు నే
తచ్చరి, త్రము నేమాత్రమెఱుంగమిఁగా వెనుకఁ జింతం
గుందెదుగా నెచ్చెలీ. 14

గీ॥ కమలినీకమలాప్తులకరణిఁ గుముది
నీకుముదవల్లభులమాడ్కి నెయ్య మెపుడు
దూరగతులైన మీకుఁ బెంపారుఁగాతఁ
బోయివచ్చెదు నీరాజపుత్త్రిఁ బనుపు. 15

గీ॥ అనుఁడుఁ గాదంబరీదేవి యనియె నిట్లు
చెలియ యుద్దానికై యింతచెప్పవలెనె?
నన్ను సపరిజనఁగా నృపనందనునకు
నాత్మవోలెను వశ్యగా నరసికొనుము. 16

వ॥ సంకోచ మేల యని గంధర్వకుమారులఁ బిలిచి యీ
రాకుమారు నిజావాసంబుఁ జేర్పుండని యాదేశించినఁ
జంద్రాపీడుండును లేచి తొలుత మహాశ్వేతకు నాపైఁ
గాదంబరికిం బ్రణమిల్లి స్నేహనిర్భరంబులగు కాదంబరీ
లోచనంబులచే గృహ్యమాణుండై దేవీ! 17

క॥ అరయఁగా బహుభాషిణి న
మ్మరు లోకులు గావఁ బెక్కుమాటలిఁ కేలా?

పరిజన కథావసరముల
స్మరియింపఁగవలయు నన్ను స్వాంతమునందున్. 18

క॥ అని రాసుతుఁ డంతఃపుర
మును వెల్వడెఁ దద్గుణౌఘముల మదిరానం
దనదప్ప నఖిలకన్యా
జనములుఁ జనుదేరఁగా హజారముదాఁకన్. 19

గీ॥ అంతఁ గేయూరకానీత మైన మేటి
హాయముపై హేమకూటంబు బయలుదేఱె
బయలుదేఱెడునపుడు రాపట్టికెల్ల
యెడలఁ గాదంబరియె కండ్లయెదుటఁ దోఁచె. 20

వ॥ క్రమంబుగా మహాశ్వేతాశ్రమంబుఁ జేరి యచ్ఛోదకాసారతీరంబునుండి యింద్రాయుధఖురపుటానుసారంబుగా నట కేగుదెంచియున్న యాత్మస్కంధావారముంజూచి వారిచే సహర్షవిస్మయంబుగాఁ బ్రణమ్యమానుండై భవనంబుఁ బ్రవేశించి సమ్మానితరాజలోకుండై వైశంపాయనపత్రలేఖలతో మహాశ్వేతా కాదంబరీ మదలేఖాతమాలికా కేయూరకప్రసంగముల దివసంబు వెళ్ళఁబుచ్చెనంత 21

గీ॥ ప్రీతిఁ జూపదు కాదంబరిఁగనుకినక
ననఁగ మఱి రాజలక్ష్మి రాతనయు మేన
ఆమె రూపంబె ధ్యానించు నతని కపుడు
మేలుకొనియుండఁగనె నిర్గమించె రేయి॥ 22

కం॥ మఱునాఁడు సూర్యునుదయము
తఱినే యాస్థానమేగి తద్గతమతియై

యరసెఁ గేయూరకు నట
కరుదెంచెడువాని మిగుల నానందమునన్. 23
ఉ॥ దూరమునుండి యే శిరముతో ధరనంటుచు మ్రొక్కు-వా
నిఁ గే, యూరకు రమ్మురమ్మని ప్రియోక్తుల నాదరమొ
ప్పఁగాఁగిటన్, జేరిచి యెంతయున్ దనదు చేరువనే యుప
విష్టుఁ జేసియూ, భూరమణాత్మజుండు స్మితపూర్వముగా
వచియించె నీగతిన్. 24
గీ॥ సపరివారకు గంధర్వనృపతనూజ
కల్ల కాదంబరీదేవి కభ్యుదయమొ?
సేమమే? భగవతి మహాశ్వేత కెఱుఁగఁ
జెపుమ! కేయూరకా! స్మరించెదరె మమ్ము॥ 25
వ॥ అనఁ గేయూరకుండు తదీయస్మితంబుచేతనే స్నపితాను
లిప్తుండుంబోలె సద్యోగతాధ్వఖేదుండై యాదరప్రణతి
పూర్వంబుగా నిట్లనియె. 26
క॥ భవదీయాదరపాత్రం
బవు కతన నృపాలనందనా! నేఁడుగదా
పువుఁబోఁడి చిత్రరథతను
భవ కుశలముకలదిగాఁగఁ బరిగణితయగున్॥ 27
సీ॥ మంజీరయుక్తములై మరకతప్రభలీను
పాలుగారెడు పూగఫలము లివిగో
కమనీయశుకసతీగండపాండిమము ని
రాకరించెడు తెలనాకు లివిగో
హారశిరోమణి సుధాకరఖండముం గేరు
ఖండముల్ గల పచ్చకప్ర మిదిగో

మృగనాభిపంకసమ్మిళితమై వళితమై
గమగమించెడు మంచిగంధ మిదిగో

గీ॥ అనుచు బిసతంతుబద్ధాగ్ర మార్ద్రవసన
తల తిరోహిత మబ్జినీదళసముద్గ
కంబునందుండి చూపెఁ గాదంబరీసు
యాన తమ కంపె నని యభిజ్ఞానములను. 28

మ॥ మఱియున్ గెంపుల యింపు లెల్లెడలఁజిమ్మన్ గోమలా
త్మాంగుళుల్,కరముల్ మాళిని దోయిలించి కొలుచున్
గాదంబరీదేవి యో,నరనాథాన్వయభూషణా! గుణధురీణా!
నిన్నున్, నీసేమమున్, విరివిన్ గోరెడిఁ దత్సఖీమణి మహా
శ్వేతాసతీరత్నమున్. 29

చ॥ పతితశిఖండరత్నరుచి ఫాలతలంబును సోఁక నీకు ను
న్నతి మదలేఖ భక్తిని ప్రణామములంబొనరించెఁ బాపట
ల్, క్షితితలమంటునట్లు నతిఁజేసిరి తక్కినకన్య లోమహీ
పతిసుత! యా తమాలికయుఁ బాదములంటి నమస్కరిం
చెదున్. 30

వ॥ ఆర్య మహాశ్వేత యివ్విధి దేవరవారికి సందేశ మంపిన
ది, యవధారుఁడు 31

ఉ॥ పున్నెము లెంతయున్ సలుపుపూజ్యులు ధన్యులుగారె
యెప్డునిన్, గన్నులఁజూచుభాగ్య మొడిఁగట్టినవారు భ
వద్గుణంబులో,యన్న సమీపమందుఁ దుహినాంశువున
ట్లలరించుశైత్యసం, పన్నత, దూరమైన ఖరభానుసమా
నములై కలంచెదున్. 32

క॥ ఇందలిజనంబు లోనృప
నందన! యమృతోదయపుదినంబునుబలె నే
మందు నతీతదినము వా
సిం దలఁతురు నిన్నుఁ గనఁగఁ జేసిన దగుటన్. 33

గీ॥ త్వద్వియోగంబుకతన గంధర్వరాజ
నగర మక్కట! యోనరనాథతనయ!
నవనివృత్తమహోత్సవానంద మట్లు
యేమిచెప్పుదుఁ గన్నుల కింపుగాదు. 34

సీ॥ అరయుదుగాదె నన్నంతయు వీడి ని
స్సంగనై నట్టు లోసౌమ్య! యైన
అనిమిత్తపక్షపాతిని నిన్నుఁ గన మది
వలదన్నఁ బరుగులువాఱఁజొచ్చె
మఱియుఁ గాదంబరీమహిళావతంస మ
స్వస్థశరీరయై చాల నొగిలె
స్మరియించు నెద నన్నుక్షణము స్మేరాననుఁ
దలిరువిల్తునిఁ దలఁదన్ను నిన్నుఁ

గీ॥ గాన నిటకేగుదెంచి యీ మానవతిని
గుణవదభిమానినిగఁ జేయఁగోరుదాన
అనుపమాన! యుదారజనాదరంబు
కాదె యెందును సత్కారకారణంబు. 35

గీ॥ సైఁపవలయు నస్మద్విధజనపరిచయ
కృతకదర్థన, మీసుజనతయె హేతు
విందులకు, నిదుగో, శయ్యాయందు మఱచి
వచ్చితివి శేషహార మోసచ్చరిత్ర. 36

గీ॥ అని నుడివి యంశుకాంతసంయతము సూక్ష్మ
తంతువివరబహిర్గతకాంతిసూచి
తంబు దివ్యంబు శేషహారంబుఁ దీసి
చామరగ్రాహిణీకరాబ్జమునఁ బెట్టె. 37

వ॥ అంతఁ జంద్రాపీడుండును. 38

కం॥ ఇది తలఁప మహాశ్వేతా
పదపద్మారాధనైకఫలమవు ధ్రువ మి
య్యది కాదయేని పరిజను
మదిరాసుత యేల యిట్లు మదిఁ దలపోయున్. 39

క॥ అని కాదంబరి పనిచిన
దనకూరిమిపేర్మిఁ దెలుపు తద్వస్తువులన్
మనమలర గారవంబునఁ
దనయంతటఁ దాన కొనియెఁ దలనిడుకొనుచున్.  40

మ॥ కలపంబుంగొని రాట్సుతుండు చ్యుతమా కాదంబరీదేవిచె
క్కుల డాలో, రససిద్ధిఁగాంచిన స్మితాంకూరావలోకంపుఁ
ద్రళుక్కులజాలో, ద్రుతచిత్తమో యనఁగఁబొల్పొంగొల్పు
నద్దాని మైఁ, నలఁదెన్ దాలిచె శేషనామకమహాహారంబు
తోరంబుగన్॥ 41

గీ॥ తమ్ములము స్వీకరించెఁ బ్రధానరాజ
లోకముం బంపివైచె బహూకరించి
యరిగెఁ గేయూరకునిమూఁపునందు వామ
కరమొసఁగ గంధమాదనకరినిఁ జూడ॥ 42

క॥ కరిఁగని స్వాయుమ తృణ మిన్నడి
యరుగుచుఁ బ్రియహాయముఁజూడ నటునిటు మెడ వం

కరచేసి రాట్సుతుండు కనఁ
బరిచారకు లొదిఁగి రెచటివా రచ్చట నే॥ 43

మ॥ చని కేయూరకసద్వితీయుఁడయి యాక్ష్మాపాలపుత్త్రుండు
తఁ, గని యుత్సారణాభీతినందధికృతుల్ కై మోడ్చి
తొల్గఁ దలం, గిన యింద్రాయుధపృష్ఠపట్టమొకటఁ
గేలఁ సరిఁ దిద్దుచుఁ, దనమై కం దొకదారు వూఁతగ
నను దానిట్లు గంధర్వుతోఁ॥ 44

వ॥ కేయూరకా! నేనటనుండి వెడలినది మొదలు గంధర్వలోక
వృత్తాంత మేమి, కాదంబరీదేవి యెట్టివ్యాపారంబునఁ
బొద్దుగడపె, మహాశ్వేత యేమొనర్చె, మదలేఖ యేమనియెఁ,
బరిజను లేమనుకొనిరి, నీవృత్తాంత మేమి? నుడువుమనుడుఁ
గేయూరకుండు దేవర వారవధరింతురుగాక యని యిట్లు
నుడువం దొడఁగె. 45

సీ॥ దేవ! మీరటు బయల్ దేఱుడు హృదయస
హా్రసనంఘాత ప్రయాణమందు
ప్రోఁగెడు పటహంపు మ్రోఁతల ట్లందెలు
ఘలుఘల్లుమంచు మ్రోగంగ సపరి
వారయై కాదంబరీరాజముఖి సౌధ
తల మెక్కి నీపోవుదారిఁ గనియెఁ
గను మేరదూర మేగినదాఁక నినుఁ గాంచి
మదలేఖ మూఁపున వదనముంచి

గీ॥ దుగ్ధవారాశిలహరులతోడ నెక్క
సక్కమాడు కటాక్షవీక్షణపరంప

రలను దద్దిక్కు ముంచుచు రాకుమార!
యెంత యోతడ వచ్చోటనే వసించె. 46

గీ॥ సౌధతలి డిగ్గి యెట్లో కష్టంబుమీఁద
నుండి యొకక్షణ మాస్థానమండపమునఁ
జేరె నానాఁడు దేవరవారు దిగిన
యాటకొండకుఁ బ్రొద్దుపో నంబుజాక్షి. 47

వ॥ చేరి యందుఁదిరుగుచు నాఁడు రాకుమారుండు 48

సీ॥ ఇందుండెఁ బతదంబుబిందుతుందిలలతా
మండపపాషాణఖండ మిదిగో
ఇట స్నానమాడె నుత్కటగంధవాఃపరీ
మళమిళదళిశిలాఫలక మిదిగో
ఇచ్చోట నర్చించె నీశుఁ గుసుమధూళి
సికతిలగిరినదీనికట మిదిగో
ఇయ్యెడ భుజియించె నిందుప్రభాప్రతి
కోటి యా స్ఫాటికవాటి యిదిగో

గీ॥ ఇందు శయనించె సంక్రాంతచందనాంక
భరితముక్తామయోపలపట్ట మిదిగో
అనుచుఁ బువరుక్తముగఁ బరిజనము తెలుపఁ
గనుచుఁ దచ్చిహ్నముల నిట్లు గడపెఁ బగలు. 49

ఉ॥ అంత దినాంతపూట మదిరాత్మజ యిష్టము లేకపోయినన్
వంతులు వెట్టి యెంతో బలవంతముచేయఁగ హంసపుత్రి
రాయొ,కింతగ నాహారించె నటనే స్ఫటికోపల గేహమందుఁ
దా, నంత దివాకరుండు చరమాబ్ధిఁ బడెన్, బొడిచెన్
శశాంకుఁడున్. 50

గీ॥ అపుడు చంద్రశిలామయి యట్టు లార్ద్రి
తనువగుచు నాలతాంగి చంద్రప్రవేశ
భీతి ననఁజేర్చి చెక్కులఁ జేతు లేమొ
చింతఁజేసె నిమీలితాక్షియయి క్షణము. 51

గీ॥ పడఁతి లేచి నఖరపతితచంద్రప్రతి
కృతుల బరువుచేత గతులజడిమ
పాదుకొనె ననంగ బాధమై నడుగుల
నిడుచు మెల్లఁజేరెఁ బడకటిల్లు॥ 52

ఉ॥ చేరి మనోజ్ఞశయ్య మెయిఁజేరిచి మస్తకవేదనన్ మహా
దారుణమౌజ్వరంబునను దద్దయుఁబీడితదేహయై యెదో
పేరుకొనంగరాని రుజ పెంపున మంగళరత్నదీపముల్
కైరవముల్ సహాయములుగాఁగ నిశీథినిబుచ్చె నెట్టులో॥

వ॥ ప్రాతఃకాలంబున నన్నుఁ బిలిచి దేవరవారి కీయుదంతం
బు సోపాలంభంబుగా నెఱింగింప నిట కనిపె నన. 54

కం॥ అది విని చంద్రాపీడుఁడు
మదిరాసుతఁ జూచు కోర్కె మగుడఁబొడుమ నె
మ్మది నశ్వ మశ్వ మనుచున్
గదలెన్ హయశాలనుండి కడువడి నంతన్. 55

సీ॥ ఎక్కె సజ్జీకృతం బింద్రాయుధము వెను
ప్రక్కఁగాఁ గూర్చుండఁ బత్రలేఖ
సహపాఠియైన వైశంపాయనుని మంత్రి
తనయు స్కంధావారమునన యుంచి
వారించి పరివారవారంబుఁ గేయూర
కుం డొండు హయముపై దండరాఁగ

హేమకూటంబున కేగి కాదంబరీ
భవనంబు ముందు వారువము డిగ్గి
గీ॥ ద్వారపాలార్పితాశ్వుఁడై చేరి సదన
మాత్మఁ గాదంబరీప్రథమావలోక
కుతుకమునఁ బత్రలేఖ వెన్కొనుచు రాఁగఁ
దనకుఁ బ్రణమిల్లు నొక వర్షధరుని గాంచి. 56
గీ॥ ఇపుడు కాదంబరీదేవి యెచటనుండెఁ
దెలుపుమన నాటకొండకు దిగువ కెలనఁ
గమలవనదీర్ఘికాతీరహిమగృహమునఁ
బండియున్న దటంచు నాతండు వలుక. 57.
వ॥ కేయూరకుండు దారిఁజూపఁ బ్రమదావనమధ్యంబుగాఁ గొంతమార్గంబు గమించి. 58
కం॥ మరకతసుహరితకదళీ
తరువనముల కాంతిపర్వి తపనకిరణముల్
పరఁగెన్ శ్యామలములుగా
హరితాయితమైనయట్టు లగుపడె దినపుర్. 59
గీ॥ తాదృగనుపమకదళికాధరణిజాత
కాంతకాంతారమధ్యభాగమ్మునందు
జలజపత్రనిరంతరచ్ఛన్నమైన
హిమగృహంబును జూచె భూరమణసుతుఁడు. 60
సీ॥ ఆర్ద్రాంశుకము పేరి యచ్ఛోదసలిలంబు
చక్కనియొడలికిఁ జాటుకాఁగ
భూషణంబులపోల్కి భుజధృతబిసవల
యము లవయవముల కందమొసఁగ

లలితసుగంధలలాటికల్ మోమున
సౌభాగ్యపట్టంబు సౌరుగులుక
ఉన్నాళములు పంకజోత్పలాదులు నెండ
వణంచ ఛత్రంబులయట్లు తనరc
ఆ॥ వె॥ బాండు రైక కర్ణ భాసుర కేతకీ
పత్రహసితదంతపత్ర మగుచు
నచటనుండి వచ్చె నల్ల కాదంబరీ
పరిజనంబుc జూచెc బ్రభుసుతుండు. 61

వ॥ జలదేవతాసమూహంబో వరుణశ్రీసమాగమంబో శరత్సమాజంబో నానాప్సు శిశిరోపచారనిపుణంబగు నక్కాదంబరీపరిజనంబు ప్రణమిల్లి మార్గమొసంగc జందనపంకవేదికలును బుండరీకముకుళపరికల్పితఘుంటికలును సిందువారకుసుమమంజరీచామరంబులును గనులపండువౌనర్ప మృణాళవేత్రహస్తలై కుసుమభూషణభూషితలై వసంతలక్ష్మిప్రతికృతులో యనందగు ద్వారపాలికలచే నధిష్ఠితంబగుకదళీవనబహిర్ద్వారతలంబుగా లోనికేగియందు.

సీ॥ ఒకచోటc గెరవనికరధూళీవాలు
కాసైకతము లింటి కాలువలను
ఒకవైపునc జలార్ద్రికవితానము క్రిందc
బఱచిన కెందమ్మి పానుపులను
ఒకచెంతc బూcదేనెc జికిలునేరెడు చిగు
రాకులు చొనిపిన యాకు టెంట్ల
ఒకచక్కిc జలువసేcతకుcగ గంధపుడిగ్గి
యలముంచి యెత్తు ముత్యాలసరుల

గీ॥ మఱియు నొకదరిఁ దేంట్లను చిఱుతఘంటి
కలను దనరారు పూవుటుయ్యేలలఁ గనుచుఁ
బోయి తుహినాద్రిహృదయంబుఁబోనిదాని
హిమగృహాభ్యంతరంబు రాకొమరుఁ డరిగె. 62

సీ॥ గ్రీష్మోష్మముల నణఁగించుకోఁ బూనిక
నిఖిలాపగలు కూడి నిలుచుచోటొ!
బడబాగ్ని సంతాపభారంబు డించుకో
జలరాసు లొక్కెడఁ గలయునెలవొ!
వైద్యుతానలతాపవారణ కొక్కెడఁ
గారుమబ్బులబారు చేరుతావొ?
విరులతూపులవాఁడు హరనయనానల
జనిత తాపము వాపుకొనెడు నిరవొ?

గీ॥ కుముదినీకామినీమణుల్ రమణవిరహ
నిష్ఠురంబగు దివసంబు నిస్తరించు
మనికియో? చల్లఁదనముల కునికియొ యన
నలరు నెంతయు హిమగృహాభ్యంతరంబు. 64

గీ॥ యంత్రగృహజలధారాసహస్రవారి
తంబులయి శీతతాతిశయంబుచేత
మరలి యేతత్ప్రదేశంబుఁ బరిహరించె
నా యనఁగ నందు రవికిరణములుఁ జొరవు. 65

క॥ సురభిళకదంబసుమకే
సరముల ధరియించి మించు చలిచేఁ బులకల్
విరివిగ ధరించినవొ యన
మరుదంకురములు సతంబు మలసెడు నచటన్. 66

గీ॥ కదళికోర్వీజములు మరుత్కంప్యమాన
దళములై మిక్కుటపుఁ జలి దాఁకు కతన
వణఁకుచున్నవియో యన వరలుఁ దత్ప
దేశమును జుట్టి నాలుగుదెసలుఁ బ్రాఁకి. 67

వ॥ ఏవంవిధంబగు హిమగృహాభ్యంతరంబుఁజొచ్చి, యంద
లి యతిశీతంబగు స్పర్శంబునకు మెచ్చి, మనంబుఁ జంద్ర
మయంబుగా నింద్రియంబులఁ గుముదమయంబులుగా,
నంగమ్ములఁ జ్యోత్స్నామయమ్ములుగాఁ దలంచుకొను
చు సూర్యకిరణవారంబుల హారంబులుగ, నాతపమ్ముఁ
జందనమయమ్ముగాఁ, బవనమ్ముఁ గర్పూరమయమ్ముగాఁ
ద్రిభువనంబును దుషారమయంబుగ భావించుకొనుచు నం
దొక్కెడ. 68

సీ॥ కోరి యక్షుల ముద్దుగొనియె నా వరుణుండు
కన్నీరు వలవలఁ గార్చుదాని
వాయువు పెనుదృష్టివాతె మోమున నన
వేఁడినిట్టూర్పుల విడుచుదాని
వేఁడివేలుపు మది విడిదిఁ జేసె ననంగ
మదనతాపంబుచే గ్రమ్గుదాని
సర్వాంగములు మానసంబుతోఁ బ్రియుచెంత
కరిగె నా దుర్బలయైనదానిఁ

గీ॥ జెలిమికత్తెలు చుట్టును బలసికొలువఁ
జల్లనిమృణాళవల్లుల నల్లుపెట్టు
పందిటం బూలసెజ్జపైఁ బవ్వళించు
దానిఁ గాదంబరిని గాంచె ధరణివిభుఁడు. 69

వ॥ అంత 70

మ॥ తనుఁజూడంబరువెత్తివచ్చి యదె చంద్రాపీడుఁడేతెంచు
చుం, డెను నాఁగాఁ బరిచారికానిచయ మేఁడి? వచ్చెనే?
యెంతద, వ్వుననున్నాఁడని ప్రీతిమైఁ బరిజనంబుల్ సారెకుల్
సారెకా, వని తారత్నము పేరుపేరనడిగెన్ వాల్లభ్యమట్లుం
డుఁగా. 71

శా॥ ఆలోకించి ప్రవర్ధమాన ధవళంబౌ చూపుతో సమ్ముఖం
బై లీలంజనుదెంచు రాకొమరు నయ్యబ్జాక్షి దూరమ్ము
నందే, లేచెన్ బువుసెజ్జనుండి యపుడెంతేఁదత్తఱంజాఱ
గా, లీలాప్రావరణంబు హారరుచు లోలిన్ గ్రమ్మె వక్ష
మ్మునన్. 72

గీ॥ అపుడు రాతనయుం డట కరుగుదెంచి
మొదట హంసాత్మజకుఁ గేలు మోడ్చి పిదప
మ్రొక్కెఁ గాదంబరికి నామె మ్రొక్కి మరలఁ
గుసుమశయనీయమందు నే కూరుచుండె. 73

వ॥ అంతఁ బ్రతీహారి చంద్రాపీడునకుఁగా జాంబూనదమయం
బగు వేఱొండు వేత్రాసనంబు వేయ నద్దానిని బాదంబు
తోన యూవలం ద్రోచి 74

ఉ॥ నేలనె కూరుచుండెను వినీతి బయల్పడ రాజపుత్రుఁ డ
ప్పాలలనావిపంచివహుఁడాడె నిటుల్ విను దేవి! యీమె రా
చూలియనుగ్రహంబునకుఁ జోటగు నామము పత్రలేఖ తాం
బూలకరండవాహినిగ భూవరనందనుఁ గొల్చునెప్పుడున్

క॥ అని పత్రలేఖఁ జూపినఁ
గనుగొని నెమ్మనమునందుఁ గాదంబరి తా

మనుజాంభోజాక్షుల పై
వనజభవున కెసఁగు పక్షపాతము నెన్నన్॥ 76

చ॥ తనకుఁగృతప్రణామ యగుతామరసాయత నేత్ర రమ్యు ర
మ్యనివరిచారికాజనము హర్షము మెఁగనుచుండఁ జేరువన్
వెనుకగనొక్కచోట నుపవేశితఁ జేసి తదీయదేహమున్
నెనరుననంటుచుండెఁగమనీయమునౌచిగురాకుఁ గేలితోన్

క॥ అంతట నుపచారవిధుల్
సాంతమగుడుఁ దలఁచె నిట్లు చంద్రాపీడుం
డింతయుఁ గని నమ్మదు నా
స్వాంతము జడ; మడుగువాఁడఁ జాననె యనుచున్. 78

వ॥ కాదంబరివలనై ప్రకాశంబుగా. 79

మ॥ అరయంగంటిననన్యజన్యరతి యోయబ్జాక్షి నీకీమహా
త్తరతాపప్రదమైనవ్యాధికి నిమిత్తంబంచినీ! యద్ది సుం
దరి! నీకంటెనువేయిరెట్లు మముబాధంబెట్టుఁ గాంక్షించె
దన్, గరమారోగ్యము నీకుఁగూర్చుటకు నాకాయంబు
నే నీయఁగన్. 80

మ॥ సుదతీ! యీగతిఁగంపమందెదునినున్ జూడంగ నెమ్మేని
కాంతిదొలంగన్ సుమసంహతింబడి మహోర్తింజెందునిన్నాం
చ,నామదినీరయ్యేదు జాలిఁబొందెదుధరింపంజాలకేయుండె
నం,గదలన్ నీభుజముల్ కృశించి, తెలుపున్ గండెజ్జనె
నీవ్యథల్. 81

ఉ॥ నీవిటుచింతమైనునికి నీపరివారజనంబు వంతనౌ
తీవియఁబోఁడి కన్నుల న దేకురిపించుచునుండె నశ్రువుల్

గావునఁ జింతలందొలఁగి కైకొను మౌక్తికభూషణావళుల్
దీవియయుఁ గలసత్సుమశిలీముఖుఁడై యెగఁద్రాలు నెంతయున్

చ॥ అనవుడు బాలయయ్యె మదిరాత్మజ పుష్పశరోపదిష్టలీ
ల నెఱిఁగి రాకుమారునుడులం గలయర్థము వ్యంగ్యవైఖ
రిన్, మనమున నంతభాగ్యమును మన్ననమున్ననుకొని
దాటసి, గ్గున బదులాడకూరకొనెఁ గొంచెము చిర్నగ
వొప్పఁ గాంచుచున్. 83

గీ॥ అపుడు మదలేఖ యిట్లనె నృపకుమార!
దారుణంబైన యీయమతాప మేను
పేరుకొఁజాల నందుఁ గుమారభావ
మొప్పు నీమెకు నెది తాప మొదవనీదు॥ 84

గీ॥ చల్లనైనమృణాళినీవల్లిపల్ల
వమ్మె యీమెకు ననలమై వంతఁగూర్చు
శారదజ్యోత్స్న యెంతయు శైత్యకారి
యయ్యె నాతపము ట్లీమె కార్తిఁ జేయు॥ 85

క॥ తెల్లంబకాదె తమకీ
పల్లవమయతాళవృంతపవనంబుల నీ
పల్లవపాణికి నెంతయు
నుల్లంబున నున్న ఖేద ముర్వీశసుతా! 86

గీ॥ ధైర్యవతిగాన నెట్లొ యిందనుక మేనఁ
బ్రాణములఁ దాల్చె నీయమ యనుడుఁ జిత్ర
రథకుమారియు నయ్యాదే రాసుతునకు
నుత్తరంబుగ భావించె నుల్లమందు. 87

వ॥ అంతఁ జంద్రాపీడుండుభయఘటమానార్థంబు లగు
నప్పలుకుల నాందోళితహృదయుండై మహాశ్వేతతోఁ
బ్రీత్యుపచారచతురంబులగు కథలతోఁ గొంతకాలంబు
గడపి యెట్టకేలకు విడిపించుకొని కాదంబరీభవనంబునుండి
స్కంధావారాభిముఖుండై వచ్చుచుండఁ గేయూరకుం
డేగుదెంచి దేవా! కాదంబరీమహాదేవిపత్రలేఖనుగొన్నా
ళ్ళిచ్చట నుంచ మిమ్ము వేఁడుచున్న దన దుర్లభంబగు
దేవీప్రసాదంబు కలిమింజేసి యామెనే ధన్యఁగాఁ
దలంచుచు నట్లే యుండుతమని స్కంధావారముం బ్రవే
శించి తండ్రి కడనుండి వచ్చిన లేఖహారకు దూరంబు
నుండియే చూచి యోరీ! సపరివారుండగు మజ్జనకు
నకు సాంతఃపుర యగు మజ్జననికిని సేమంబే యనుడు
నాతండును రాకుమారా ! యెల్లరకు సేమంబే యని యు
త్తరద్వితయం బొసంగిన యువరాజు దానిని శిరసావ
హించి స్వయము విప్పి యిట్లు పఠించె. 88

సీ॥ స్వస్తి శ్రీ సకలరాజన్యశిఖండశే
ఖరిత స్వకీయాంఘ్రిసరసిజుండు
పరమమాహేశ్వరప్రభుఁడు శ్రీరాజాధి
రాజ తారాపీడ రాజమౌళి
మూర్ధంబు మఱిమఱి మూర్కొని సుత! యుజ్జ
యినినుండి వ్రాయున దేమనంగ
ఇచ్చటఁ బ్రజలకు నెల్ల నభ్యుదయంబు
కాంచి నిన్నెంతయో కాలమయ్యె

గీ॥ డెంద మెంతయు నినుఁ జూడఁ దొందరించె
దేవి కృశియించె నెంతయు దిగులుచెందెఁ
దక్క నంతఃపురంబు; నోతనయ! లేఖ
చదువు వెంటనె పయనమై కదలిరమ్ము. 89

వ॥ శుకనాసప్రేషితంబగు ద్వితీయలేఖయందు నీవిషయంబు
నేచదువుకొనియె నయ్యవసరంబున నే వైశంపాయనుఁ
డేగుదెంచి యేతదర్థకంబయగునాత్మీయలేఖద్వితయంబుఁ
జూపఁ జంద్రాపీడుండు జనకునాజ్ఞ యని తురగాధిరూఢుం
డై ప్రయాణభేరి మ్రోఁగింపఁ జేసి యాశ్వీయబలపరివృతుం
డై తన చేరువనున్న వలాహకపుత్రుం డగు మేఘనాదు
నితో నీవు పత్రలేఖతోఁ జనుదెమ్ము కేయూరకుండు
పత్రలేఖం గొని యిచ్చటికిఁ దప్పక వచ్చును. ఆతనితో
నేను ప్రణతిపూర్వకముగాఁ గాదంబరీదేవి కిట్లు మనవి
చేసికొంటి నని చెప్పి పంపుము. ఎట్లన:— 90

క॥ ధారుణి మనుజప్రకృతి య
సారము నిర్దయ, మకాండచలము లలఁతులౌ
వీరల కూరుము లెన్న వ
కారణవాత్సల్యములను గడు హేయములౌ. 91

ఉ॥ ఎంతయు నిట్టులుజ్జయిని కేగుచు నాప్రణయమ్ము వమ్ముగా
నంతటిభక్తియుక్ మృషగ నట్టి శరీరసమర్పణోక్తి య
త్యంతముధూర్తతావిలసితంబుగఁ జేసితి, మాటలందునొం
డంతరమందునొండనెడు నట్లొనరించితి నేమి సేయుదుక్.

కం॥ నావలన దివ్యయోగ్యకు
దేవికి సద్గుణకు గుణవతీసుత కస్థా

నావిర్భూతానుగ్రహ
నా, వచ్చెను సఖియు నేమనంగలవాఁడన్. 93
ఉ॥ ఆతలి రాకుఁబోఁడి మదిరాత్మజఁగాంచెదు నప్పు డమ్మహా
శ్వేతనుజూచునప్పు డటు సిగ్గువహింపదు నాదుడెందమా
నాతికిలేనిపోని సుగుణమ్ముల నాయెడఁ జెప్పి హంసపు
త్రీతిలకంబిఁకాయమనుదెప్పకయుండునె దేవియెంతయున్
ఉ॥ ఏమియొనర్పఁ జేయఁదగునెల్లరకున్ జనకాజ్ఞ మాలితో
నామడి హేమకూటవసనవ్యసనంబయి తద్గృహైకదీ
క్షామతిమెచ్చి వ్రాసినది జన్మసహస్రపుదాస్యపత్రమున్
గోమలికీయకుండ నిదిగో చనుచుంటి స్వకీయదేశమున్ 95
మ॥ లలనామాళిమణీ! యసజ్జనకథాలాపంబులం దేనియున్
దలపోయన్వలె నీదుడెందమునఁ జంద్రాపీడచండాలు నీ
ఖలుఁడేప్రాణముతోడ నున్నయెడ నోకంజాక్షి! నీపాద
ముల్, కొలువంగల్గెడు నయ్యాఖండమునమున్ గోల్పో
వఁడం చెంచుమా. 96
వ॥ మఱియు. 97
సీ॥ విన్నవింపుము మహాశ్వేతకు సప్రద
క్షిణభక్తిపూర్వకప్రణతి ముందు
మదలేఖతోఁ దెల్పుమా మదీయమ్ము ప్ర
ణామమ్ముతోడి కంఠగ్రహమ్ము
తరలిక కందీయఁదగు నాదు బిగితమా
గాటంపుఁగూరిమి కౌఁగిలింత
అందఱి నేమంబు నడిగితి ననుము కా
దంబరీ స్వపరిజనంబుతోడ

గీ॥ అంజలిఘటించి వేఁడితి ననుమ సెలవు
డంబుమీాఱెడు హేమకూటంబుతోడ
అని యిటుల్ మేఘనాదున కానతిచ్చి
సచివసుతు దండునకు నధీశ్వరుని జేసి. 98

వ॥ తాను గుఱ్ఱంబునెక్కి-గమనలీలాహర్ష హేషారవంబులచేఁ గైలాసంబు గంపింప ఖురతాడనంబులచే భూమి బ్రద్దలు వాఱఁ గుంతధరమగు నాశ్వికపటలంబుచే ననుగమ్యమానుండై యభినవకాదంబరీవియోగశూన్యంబగు హృదయంబుతో నాలేఖహారకునే యుజ్జయినీమార్గ మడుగుచు. 99

సీ॥ అధికప్రమాణమహాప్రకాండోర్వీజ
మ్ములచేత నిబిడమై వెలయుదాని
మాలినీమండపమండలితాఖండ
తరుమండలముతోడఁ దనరుదాని
వనగజపాలితావనిజాతములచేతఁ
జుట్టుదాఁకులఁ గనుపట్టుదానిఁ
దృణవర్ణకాష్ఠతతి ప్రకటిత పీర
పురుషఘాతస్థలుల్ పొలుచుదాని

గీ॥ ఆకులలములు పడి కర్దమాకులమయి
పచ్చనీ రెచ్చటనొ గనుపట్టునట్టి
పాడుబావులమొత్తంబు పరఁగుదాని
నొకయరణ్యానిఁ దఱిసి యందొాఱసి చనుచు. 100

గీ॥ బాటసారులచేఁద్రవ్వఁబడిన చిన్ని
చెలమలం దెందొ యల్పమా కలుషజలము

చ॥ వనమహిషాక్షులట్టులొక వైపునఁగుప్పలుగుప్పలొచుఁ గో
కనదములొప్ప నొక్కెడ మృగప్రభుతీక్ష్ణనఖంబులోయ
నంగ, నవిసె పూవుమొగ్గలను గ్రాలఁగ నెత్తుటితోఁదన
ర్చువ్యాఘ్రనఖములట్లు మోదుగుమొగల్ తగనొక్కెడ
నద్ది చూడనొ॥ 106

చ॥ హరిణవిషాణజాలముల నంకురితంబును రక్తవర్షముల్
గురిసెడు జిహ్వాకాళకలకోటులఁబల్లవితంబు దృక్స్వరం
పరలను బుష్పితంబు ఘనమస్తములన్ ఫలితంబునొచు
నెల్లర కెఱఁగించుఁ బ్రాణిబలులన్ గన నా గుడి భీతి
దాయియై. 107

సీ॥ డంబైనభర్మపట్టంబుతోఁడి లలాట
మునఁ జెందిరపుబొట్టు ముద్దుగులుక
దాడిమకుసుమావతంసకాంతిచ్ఛటా
ధగధగల్ చెక్కులఁ దాండవింప
రక్తపానానంతరము చేయు తములంపుఁ
గెంపు మోవికిఁ దులకింపునింప
లలితకుసుంభపాటలదుకూలము దేహ
వల్లరి కొకవింత వన్నెనీయ
ఆ॥వె॥ రక్తచందనంబు రాజిల్లఁగా మహా
కాళనాథుఁ గవయు కాంక్షతోడ
నభినవంబుగాఁగ నభిసారికావేష
మూని ననఁగఁ జండి యుండు నందు. 108

వ॥ ఏతాదృశంబగు చండికాలయంబు చేరి చంద్రాపీడుండు.

చ॥ తురగము డిగ్గి భక్తిభరితుండయి చండిఁ బ్రదక్షిణించి వే
మరు నతికాండమ్ముఁ సలిపి మంచిప్రశాంతమునౌ ప్రదేశ
మం, దరసెదుకోర్కెఁ మైఁదిరుగు చవ్వపినైకతలంబునందు
దు, ర్ధరనియమమ్ముఁ జరద్వివిడధార్మికు నొక్కనిఁ గాంచె
నున్నతిఁ. 110

ఆ॥వె॥ మంచిలక్షణమ్ము లించుకయును వీని
యందు నుండరాదటం చలక్ష్మి
గుద్దలింపఁదోఁచు గుంటలునాఁ దదం
గమున నొప్పు స్ఫోటకపుఁ గుదుళ్ళు. 111

క॥ శ్రవణావతంస మట్లుగఁ
జెవి సన్నిధి నతని కలరు సిగ, స్థూలశిరా
ది వితానముతో నెంతయు
గవాక్షితుఁడు వోలె నతఁడు కానఁగ వచ్చుఁ. 112

గీ॥ ఎవ్వఁడో దొంగరసవాది యిచ్చినట్టి
యంజనంబున నొక్కక న్నణఁగిపోవ
సతముఁ దక్కినకంటి కంజనము రాయఁ
బూనుపుడకయు మెత్తనో వానిచేత॥ 113

గీ॥ ముసలితోఁ గైకొన నతఁడు మానసమునందు
దక్షిణాపథరాజ్యమంతయు వహించి
నిస్సపత్నముగా నేల నిష్ఠతోడఁ
జండిఁ గొలుచును వరముఁ గైకొందు ననుచు॥ 114

గీ॥ అతఁడు సొఱబుఱ్ఱవీణియనంది మీఁటు
చుండ వెఱఁగంది పథికు లాదండ కారు

దివస మెల్ల నతఁడు తలద్రిప్పికొనుచు
దోమ గీపెట్టినట్టు లేమేమొ పాడు॥ 115

గీ॥ ఘోటకబ్రహ్మచారియగుట నతండు
నిలువ నట వృద్ధ మస్కరిణీజనంబు
సరసకుంజేరి స్త్రీవశీకరణచూర్ణ
ములను బదిలంబుగాఁ జల్లుఁ దెలియకుండ॥ 116

మ॥ నెలవీకుండఁగ బాలసారులకు నెంతేవారి వారించి దోః
కలహంబందున భగ్నపృష్ఠుఁడనివిఖ్యాతుం డొకండాతఁడా
వల నొక్కండపరాధిబాలకులకై పర్వెత్తుచుం డాతఁడ్రిం
దలగాఁగం బడి భగ్నమస్తకుఁడు భుగ్నగ్రీవుఁడుం డాఁ
డిలం॥ 117

గీ॥ అతఁడు సంస్కారికాఁడి నేమైనఁ జేయుఁ
జెవిటియాటను సైగతో వ్యవహరించు
ఖంజుఁడగుటను గడుమందగతిని నడుచు
రేయిఁజీఁకటి యగుటఁ జరించుఁ బగలె॥ 118

సీ॥ చీలిచె నతని నాసిక నెన్నిసారులో
పండుల దుల్చెడుపట్లఁ గపులు
కుట్టెను బలుసార్లు కుసుమంబులను గోయు
చోట నాతని మేనుఁ దేఁటిమూఁక
కఱచెఁబల్మాఱు మైమఱచి యాతఁడు పాడు
గుడులందుఁ బవళింపఁ గ్రూరఫణులు
చీరె జీర్ణాశ్రమసీమల నతని దా
డల గోళ్లఁ బలుతూరు లెలుఁగుబంట్లు

గీ॥ దళితమయ్యెను బలుపూఁగు తచ్ఛిరంబు
దూరపతితోరుమాలూరధారుణీజ
ఫలశతంబులఁ, బరమనిర్భాగ్యుఁడతఁడు
పడనిపాటులు గలవె? యయ్యడవియందు. 119

వ॥ అట్టి యాజరద్ద్రవిడుండు తమ్ముఁ గని యఱచుచు నేడ్చు
చుఁ గినియుచుండఁ గని చంద్రాపీడుండు కాదంబరీవిర
హాదోదూయమానహృదయుండయ్యుఁ, జిరకాలంబు హ
సించి యాయఱవతోఁ గలహించుచున్న స్వసైనికుల వా
రించి యాతని నుపసాంత్వనవాక్యంబులను బ్రియాలాప
శతంబులను ననునయించి క్రమముగా నతని వృత్తాంత
మెఱింగి యతిలోకంబులగు నిజశౌర్యాదులఁ గొండాడు
నాతనిపట్ల ననురక్తుండై యాతనికి విడె మిప్పించె నంత
సూర్యుం డస్తంగతుండగుటయు సైనికులు కాలోచితకృ
త్యంబులుదీర్చి యుచితతరుమూలంబులఁ బర్ణశయనీయం
బులఁ బవ్వళింపఁ జంద్రాపీడుండు నందొక్కచోఁబరిజనై
కదేశంబున సంయతంబగు నింద్రాయుధంబునకునెదుటఁ
గల్పితంబగు శయనీయంబుఁ జేరి 120

సీ॥ కనుమూసికొని యశే మనసుతో నెప్పుడుఁ గిం
పురుషాలయమునకుఁ బోయివచ్చుఁ
దలఁచు ననన్యచిత్తంబుతో హేమకూ
టీయమై తగు రామణీయకంబుఁ
జింతించు నెద మహాశ్వేతాకృపాపరం
పరలనిష్కారణబాంధవంబు

అభిలషించును జీవితాత్యంతఫలమయి
తనరు కాదంబరీదర్శనంబు

గీ॥ భావమున నెన్ను మదలేఖపరిచయంబుఁ
గాంచఁగోరుఁ దమాలిక, మంచుటింటి
పొలుపు వినుతించు వేఁడియూర్పుల నిగుడ్చు
శేషహారంబుపైఁ బ్రీతిసేయు మఱియు. 121

గీ॥ ఆత్మనూహించుఁ గేయూరకాగమనము
వెనుకనుండిన పత్రలేఖను గృతార్థఁ
గాఁగఁ దలపోయు నిద్దురఁగనమి నతఁడు
రేయియెల్లను నటు కనుమూయుఁ దెఱచు. 122

వ॥ ఇట్లు జాగరంబుతోడనే నిశీథిని వెళ్ళఁబుచ్చి యాజర ద్రావిడునకుఁ గావలసిన విత్తంబు పసదనంబుగ నిచ్చి రమణీయంబులగు ప్రదేశంబుల విడియుచుఁ గొన్నిదినంబులలోన యుజ్జయిని కేతెంచి. 123

గీ॥ తలవనితలంపుగా రాజతనయుఁ డేగు
దెంచెనను సంబరంబు మదిఁ జెలంగఁ
బౌరు లొనరించునతు లర్ఘ్యపద్మములటు
గొంచు రాచనగరుఁ బ్రవేశించె నతఁడు. 124

క॥ పరిజను లహమహమికతో
సరసర నేతెంచి రాజసత్తమ! యువరా
జరుదెంచె నుండె ద్వారము
దరి ననఁ బ్రేమాతిశయితఁ దడఁబడు నడకన్. 125

శా॥ పారావారజలంబు మందరమటుల్ పై వ్రాలె తా నేలపైఁ
జేరాడన్ దగ లాగికొంచుఁ గుతుకాక్షిన్ బాష్పవుల్ కన్న

లన్, గారన్ బుత్త్రినెదుర్కొనన్ నడిచియేత్త్మాపాలర
త్నంబు కేయూరోష్ణీషకిరీటధారులునృపుల్ వ్యూహాంబు
గా వెంటరాన్. 126

క॥ దూరముననె తండ్రిం గని
వారువమున్ డిగ్గి భక్తిఁబ్రణమిల్లెను జూ
డారత్నరోచిమాళిన్
రారమ్మని కౌఁగిలించె రాజు కొమరునిన్. 127

క॥ వందనమొనరిచి పెద్దల
కందఱికిన్ వారివారియభినందనముల్
పొందు సుతుఁగేలుగొని య
స్పందముదుఁడు చనె విలాసవతి సదనంబున్. 128

క॥ ఆరమణీమణియు సపరి
చారికయై సుతున కెదురుచని తోడ్కొని రాఁ
గూరిమి నచ్చట జయయా
త్రారమ్యసుగోష్ఠిఁ గొంతతడవేగఁ బయిన్. 129

మ॥ శుకనాసుంగన నేగి రాజసుతుఁడచ్చో నిట్టులే దిగ్జయా
దికగోష్ఠిన్ జిరకాలముండి సుతు సక్షేమంబెఱింగించి దం
డునుగొంచాతఁడు వచ్చుటన్ దెలిపివీడ్కోలంది తద్గేహినిన్
గని యేతెంచిస్వమాతృగేహమటనేకావించిస్నానాదులన్

గీ॥ అంత నపరాహ్ణమున స్వగేహంబుఁ జేరి
క్షేమ కాదంబరీదేవి క్షేమిఁ దన్నె
గాదు మఱిస్వీయభవనంబె కా దవంతి
పురమెగా దెల్లమహి శూన్యముగఁదలంచె. 131

గీ॥ మఱియుఁ గాదంబరీవార్త లెఱుఁగ నుత్సు
కుండయి మహోత్సవంబట్టు కోరికతీఱు
వేళ యట్లమృతోత్పత్తికాల మట్టు
లతఁ డెదురుచూచెఁ బత్రలేఖాగమనము. 132

వ॥ అంతఁ గొన్నిదినంబులకు మేఘనాదుండు పత్రలేఖతో నేతెంచినఁ గృతనమస్కారయగు పత్రలేఖను రాకొమరుండు దూరంబుననుండియే చిఱునవ్వుతోన ప్రీతినిబ్రకటించుచుఁ బ్రకృతివల్లభయైనను గాదంబరీసన్నిధినుండి యేతెంచుటం జేసి మఱింత ప్రీతితో నాదరాతిశయంబు లుప్పతిల్ల నెదురేగి కౌఁగిలించుకొని, ప్రణతుండగు మేఘనాదుని కరస్పర్శంబుచే గారవించి యుపవిష్టుండై, పత్రలేఖా! అటనెల్లరకుఁ గుశలమే యనుడు నామెయు దేవా! అట నెల్లరకుఁ గుశలంబ. రాకుమారా! శిరంబునఁ గరంబులు దోయిలించి కాదంబరీదేవి ససఖీపరివారయై నిన్నర్చించెనన్న విసృష్టరాజలోకుండై యామెను గొని యభ్యంతరంబుఁజొచ్చి యందొక్కెడనుండి పత్రలేఖా! నీ వచ్చట నెట్లుంటివి? ఎన్నిదినంబు లుంటివి? దేవీప్రసాద మెట్టిది? ఏమిగోష్ఠులుజరిగినవి? ఎవరెక్కుడుగా మమ్ముఁ దలంతురు? ఎవ్వరి కెక్కుడు ప్రీతి? యని ప్రశ్నించినఁ బత్రలేఖ సవిస్తరముగా నిట్లు విన్నవింపఁగడంగె. 133

ఉ॥ మీరటనుండియిచ్చటికమేయగుణా! చనుదేర నేనుఁగే
యూరకుతోడనేగి యటనుండితిఁ బూవుల సెజ్జపజ్జనే
వారనికూరిమిన్ ననవంబుల దేవి యనుగ్రహంబులన్
సారెకుసారెకందుచు విచారములేకయ చాలకాలమున్.

క॥ అనఘా వేయేటికి నా
దినమెల్లఁ దరుణి యిటు గతించెనుబో నా
కనులందుఁ గనులు, తనువునఁ
దనువుఁ గయిదమ్మిఁ గేలుఁ దమ్మియు నగుచుఁ. 135

గీ॥ అంత నే నూఁతగా నపరాహ్ణమందు
హిమగృహమువీడి స్వేచ్ఛమై నేగుచుఁ బరి
జనము రావలదని తన యనుఁగుఁజిన్ని
పూలతోఁటకుఁ బయనమై పోయి యచట. 136

శా॥ కాళిందీజలవీచికామయములై కన్పట్టునప్పచ్చటా
మేలామెట్టులఁబోయి గచ్చుటరుఁగున్ మేకొన్నరత్నా
లస్తం, భాలాధారముగాఁగ నిల్చియెదియో భావించి వా
క్రువ్వ, నన్నాలోకింపఁగ నాఁగె నాసతి చిరం బస్పంద
మానాక్షియై. 137

గీ॥ అరయుచునె కృతసంకల్పయై స్మరాగ్నిఁ
జొరఁదలంచెనో యనస్వేదఝరి మునింగె
దానఁదరళితయైన చందాన వణఁకెఁ
బతనభయమున ననఁ జింతఁ బట్టుకొనియె. 138

వ॥ అంత నేనది యెఱింగి తన్ముఖంబు నే కనుచు దత్తావధా
ననై యమ్మా! సెలవిమ్మా యనుడు నామెయు. 139

సీ॥ వణఁకు నిజావయవముల చేతనె చెప్ప
వలవదన్నటు లాపఁబడినదగుచు
వినునన్న లజ్జ, నీడను బంపనాఁ గుట్టి
మమ్మునఁ గ్రాల్వేలఁ జిమ్ముకొనుచు

వనదేవతల చెవిఁబడునో యీ గుట్టను
మది నటునిటు పలుమాఱుఁ గనుచు
దంతఖండితమగు తాంబూలవీటికా
శకలము శిఖికి లంచముగ నిడుచుఁ

గీ॥ జిత్రము దిటంబుచేసి నిశ్చయముగను
నుడువఁదలఁచియు సిగ్గుచేఁ బొడము గద్గ
దిక నాకించుకయేనిఁ జెప్పకయ లేక
పోయె నా పల్లవోష్ఠి యమేయచరిత! 140

గీ॥ జ్వలదతనువహ్నిదగ్ధయు బలె సతంబుఁ
బ్రవహదశ్రుజలంబులఁబడి యెటేని
పోయెనో యన మరుపుష్పసాయకముల
ముక్కలాయెనో యన నోట వాక్కులేదు. 141

గీ॥ లోని దుఃఖసహస్రముల్ పూని లెక్కఁ
గొనఁగ ముక్తాక్షమాలికఁ గూర్చు ననఁగ
వంచి శిరమును బొడము బాష్పముల దుర్ది
నంబుఁ బ్రత్యక్ష మొనరించె నళిననేత్ర. 142

వ॥ దేవీ! యేమిది యని నేను విన్నవింపఁ గన్నీరు దుడుచుకొని నిట్టూర్పునిగుడించి దుఃఖకారణము నేననుక్షణమడుగుచుండ సిగ్గునఁ జెప్పఁజాలక చివరకు నాబలవంతమువలఁద నిట్లు చెప్పఁగడంగె. పత్రలేఖా! 143

చ॥ నినుఁగనుటాది నాకు జననీజనకుల్ చెలియైన హంసనందన, మదలేఖ జీవితముఁదన్విరో! కావదియేమొ ప్రీతిభాజనములు నిన్నుఁబోలె; నెదచాలఁగనిన్ను నెనమ్మఁగాన

నీ, కు నెఱుఁగఁ జేసి నావ్యథలు కోమలి! ప్రాణములన్
ద్యజించెదన్. 144

గీ॥ నమ్ము మోపత్రలేఖ! ప్రాణమ్ము మీఁద
నొట్టు, నాడెందమునకె యీగుట్టు తెలిసె
ననుచుఁ గుందెదు నా కన్యమనములకును
దెలియు టెట్లుండునో నీవ తెలిసికొనుము. 145

గీ॥ ఏకులాంగన నావలె నిందుకిరణ
ధవళమావంశమునకు నిందను ఘటించి
కలుషతం గూర్చు వంశానుగతము వ్రీడ
విడి యకన్యాజనోచితవీథి నడుచు. 146

మ॥ జనకుం డీయఁడు తల్లి యొప్పదు కులాచారజ్ఞులౌ పెద్దలా
యనుమోదింపరు, పంపనేరినట కయ్యాకారమా చూపి
యుం, డ నింకేదిక్కును లేనిదానివలెఁ జంద్రాపీడుచే
నిట్టులై, తిని, న్యాయ్యంబులె గొప్పవారలకు నింతీ!
యిట్టియాచారముల్. 147

గీ॥ అభినవ బిసాగ్రపేశలమైన నాహృ
దయము నొవ్వించుటిది పరిచయఫలంబె
యువకజనులకు నిది తగునొక్కొ పరిభ
వింపఁ జేయఁ గుమారికావితతి నెందు॥ 148

చ॥ తలఁచుగ మన్మథాగ్నియె మొదల్ త్రపఁ బైహృదయమ్ముఁ
గాల్చెడిన్
మురికొనుఁ గాముబాణములె మున్వినయం బటుపైన
మర్మముల్, సరసిజనేత్ర! వేసెలవో సంగుమ గల్గుతనీ

సఖిత్వమే, మరుజననంబునందు నిటు మాపఁదలంచితి
నాకళంకముఁ. 149

వ॥ ఇట్లు పలికి తూష్ణీంభూతయైన దేవి నాలోకించియవిదిత
తద్భావనై హ్రీతయు భీతయునై సవిషాదంబుగా ని
ట్లంటి. 150

మ॥ మదిరానందనరో! వినందలఁచితిఁ మారాసుతుండెట్టిత
ప్పిదముఁ నీయెడఁజేసె నేపగిదినొప్పించెఁ బువుంబోలునీ
హృదయం బంతయు నానతిమ్ము విని యిష్టేజీవితంబుందృ
జిం, చెదనే ముందుగ, నీకుఁబ్రాణములు వర్జింపంగనా
నాపయిఁ. 151

వ॥ నావుడు గంధర్వరాజపుత్రి యట్లని వినిపింతు సావధాన
వై వినుము. ఈ మీరాకొమరుండు. 152

సీ॥ కలల నేతెంచి చిల్కల శారికల దూతి
కలఁజేసి నర్మవార్తలను బనుపు
నిదురింపఁజేరి సన్నిధిఁ గర్ణ దంతప
త్రములందు సంకేతతలము వ్రాయుఁ
జెమటవ్రాల్ చెదరినఁ దమి సాంజనాశ్రువుల్
వెలిఁబుచ్చు వలపుఁగమ్మల లిఖించుఁ
దన యనురక్తి చేతనొనాఁగ లాక్షార
సముచేత నాదుపాదములఁ బూయుఁ

గీ॥ బట్టుకొనునేమొ యితఁడన్న భయముచేతఁ
ద్వరగ నుపవనమందుండి పరుగులెత్తు
తఱిని జిగురాకునకుఁ గొంగుతగిలి నిలువ
వెనుకగా వచ్చి కౌఁగిటఁజొనుపు నన్ను. 153

వ॥ మఱియు. 154

గీ॥ ఏ నశోకంబుఁ దన్నుఁగా నెత్త నడుగు
నెచటనుండియొ యితఁ డడ్డ మేగుదెంచి
మత్పదాఘాతముల బహుమానదృష్టి
నుత్తమాంగంబుతోఁ గొన నుత్సహించు. 155

మ॥ తరుణీ! యేమన, నీర్ష్యగాఁ దలఁచుఁ బ్రత్యాఖ్యానమాత్రో
శమున్, బరిహాసంబనుఁ బల్కుమిన్ దెలియుమానంబంచు
దోషోక్తియున్, స్మరణోపాయముగా గణించుఁ గొను
నాత్మన్ లోకవాదున్ యశః,స్ఫురణంబట్లెటుమందలింతు
నితనిన్ బూఁబోఁడి! యోజింపుమా. 156

క॥ అన నామె నుడుల విని మది
ననుకొంటిన్ బుష్పబాణుఁ డల చంద్రాపీ
డుని జూపి యీ మృగేక్షణ
మన మాకర్షించెఁ జాలమట్టుకు నహహా! 157

క॥ ఇదియే సత్యం బగు నెడ
మదనుని చిత్తప్రవృత్తి మా రాజకుమా
రుదెన మఱి యెంతయేనియు
మదిరాసుతనెవమునన్ సమంజసముకదా! 158

చ॥ గొనములు రాజపుత్త్రినకుఁ గూరిచెఁ బ్రత్యుపకారమిన్ని
నా, ళ్ళను దెసలున్ యశస్సురభిళంబులు నేఁటికిఁబండెనిండు
జ,వ్వనము విధూదయాదులకు వచ్చెను మేల్తరుణంబు మ
ద్యమున్, గొనుటగుణంబెయౌ మదిరకూఁతురు రాసుతుఁ
బ్రేమ చేయుటన్. 159

వ॥ అని లోలో ననుకొనుచుఁ బైకి నవ్వి దేవీ! యిటేని కోపంబువీడుము ప్రసన్నవుకమ్ము కామాపరాధంబులచే రాకొమరు దూర న్యాయంబే యన నాయమయు నట్లేని యాకాముం డెవ్వఁడు? ఆతఁడేరూపంబువాఁడని యడుగ నేనిట్లంటి. 160

సీ॥ దేవి! వీనికి రూపధేయ మెక్కడిది యితఁ
డతనుఁడై నట్టి హుతాశనుండు
కనసీయకయె మహోగ్రజ్వాలలను క్షణ
మాత్రలో మలమలమాడ్చు జగముఁ
బొగలమొత్తంబుల నగపడఁజేయకే
కన్నీరు బొటబొట కారఁజేయు
భస్మచయంబు కన్పడనీక దేహ మా
పాదంబు వెలవెలఁబాఱఁజేయు

గీ॥ ఈజగత్త్రితయంబున నితనిబాణ
మునకు గుఱిగాని ప్రాణిఁ గన్గొన; మెవండు
తరుణి! గడగడలాడఁ డీతనికిఁ? బూవు
వింటఁ జెండాడు నితఁ డెంత బంటు నైన. 161

వ॥ మఱియు 162

సీ॥ సంకల్పితప్రియాస్య చంద్రులఁ గనునెడ
నంబరస్థలి పరమాణువట్లు
చెలువునిరూపంబు చిత్రించునప్పుడు
మేదినీతలము గోష్పాదమట్లు
కాంతునిగుణములు గణియించునవ్వేళ
నర్బుదాదికసంఖ్య యల్పమట్లు

దయితుకూటమి మేలు తలపోయుతఱి మహా
కాలమంతయు నొక్కగడియయట్లు
గీ॥ రమణు రమణీయ సత్కథాశ్రవణమందుఁ
గమలభవురాణి నే నప్రగల్భయట్లు
తలఁచుకొనుచుంద్రుగాదె గంధర్వపుత్రి
దర్పకునిబారిపడిన యా తలిరుఁబోండ్లు. 168
ఉ॥ నావుడు నేమొ చింతిలి క్షణం బనె రాసుత, పత్రలేఖ నన్
బూవిలుకాఁడొనర్చె నృపపుత్త్రునియం దతిపక్షపాతఁగా
నీవు వచించులక్షణము లెల్లను నాయెడ మిక్కుటంబులౌఁ
బో విను మన్యగా వనెడు బుద్ధిని నిన్నొకమాట నడ్గెదన్.
చ॥ ఎఱుఁగనుగాదె యీదృశము లెన్నఁడు నేనిపు డేమిచేయు
దున్, గురుజననింద్యనౌచుఁ గడకున్ బెనుసిగ్గున మ్రగ్గ
నాకిఁకన్, మరణముకంటె నొండుశరణంబు మనంబున
గోచరింప ది, త్తరుణమునందనంగఁ; బ్రమదామణి కేనిటు
విన్నవించితిన్. 165
గీ॥ చాలుఁజాలును వీడు మకాల నిర్ని
మిత్తమరణానుబంధ మోహమెలఁతపూజ
చేయకుండఁ బ్రసన్నుఁడౌ చిత్తభవుఁడె
నీకు వరదాన మొనరించె నిందలేల ? 166
చ॥ సరసిజనేత్రరో, కుసుమచాపుఁడె కన్నెలనిచ్చువేళలన్
గురునటుచింతసేయు ననుగుందలికై వడిసమ్మతించు సో
దరుబలె నిచ్చు నెచ్చెలివిధంబున వేడుకఁగూర్చుదాదినాఁ
గఱపు వయోవిలాసములఁ గాపథమా? యిది నూత్న
మార్గమా. 167

ఉ॥ ఎందఱుసుందరీజనము లిచ్చకునచ్చుసురూపులన్ మహా
నందముతోఁ దమంత వరణంబొనరించుటలేదు వారి కే
నింద ఘటించె నిద్ది వచనీయమయైన స్వయంవరంబు లో
యిందుముఖీ! మహామును లవేటికి శాస్త్రములందు
నొప్పిరో. 168

చ॥ విడు మరణానుబంధ మలివేణి! ప్రసన్నపుకమ్మ నమ్మ నీ
యడుగులయాన రాసుతున కాడెడు నీనుడులన్ వచించి
య,య్యెడకు వెసన్ ననున్ బనుపు మిప్పుడ నీకడగండ్లఁ
జెప్పి నీ,కడకు భవత్ప్రియున్ నిమిషకాలములోఁ గొని
వత్తు నావుడున్. 169

వ॥ గంధర్వపుత్రి ప్రేమార్ద్రదృష్టితో నన్నుఁ జూచుచు
ననురాగవిభ్రమంబుల నాకులీక్రియమాణయుఁ బ్రియ
వచనశ్రవణహర్షసంజాతరోమాంచయు నై కుండలమకర
కోటిలగ్నంబగు హారంబుఁ జక్కఁజేసికొనుచుఁ గన్య
కాజనసహజంబగు లజ్జతోడుగ మెల్లమెల్లఁగా నిట్లనియె,
అవధరింపుఁడు. 170

క॥ అనధీతకలాద్యర్థా
పనత త్తచ్ఛాస్త్రకోట్యపారశ్రమవ
జ్జనతాఽనధిగమ్యవినూ
తనవిషయవిబోధనైకతానప్రతిభా! 171

మంజుభాషి

నిరవద్యహృద్యకమనీయభాషణా!
పరసీజనూతికులచారుభూషణా!